# టి. ఎస్. ఎ. కథ 2013

(కథా సంపుటి)

టి. ఎస్. ఎ. కృష్ణమూర్తి

**కళా ప్రచురణలు**

మదనపల్లె - 517 325, చిత్తూరు జిల్లా

TSA కథ 2013
ప్రథమ ముద్రణ : ఆగస్టు 2014
ప్రతులు : 1000
హక్కులు : © రచయితవి

కళా ప్రచురణలు – 5
మదనపల్లె – 517 325
వెల : ₹ 72/–

ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రములు
లేదా
**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
3–169–16 రామారావు కాలనీ
బాపూజీ మునిసిపల్ స్కూల్ దక్షిణపు వీధి
**మదనపల్లె – 517 325**
చిత్తూరు జిల్లా
ఫోన్ : 08571 – 221963
సెల్ : 93472 98942
email : todimella krishnamurthy @ g mail.com

ముఖచిత్రం : **సుధా స్టుడియో**
బర్మారోడ్డు, మదనపల్లి – 517 325
సెల్ : 9441654958

ముద్రణ : **విజయవాణి ప్రింటర్స్**
గోసులకురప్పల్లి రోడ్డు,
చౌడేపల్లి – 517 257
చిత్తూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్.

# ఒక మనవి......

**2**012వ సంవత్సరంలో వెలువడిన నా పది కథలతో నేను నా తొమ్మిదవ గ్రంథంగా 'TSA కథ–2012' పేరిట కథాసంపుటిని ఏప్రిల్–2013లో వెలువరించాక ఆ పుస్తకం కలిగించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఆ సంపుటిలోని 'మనుషులు మరణిస్తారు', 'పనిమనిషి', 'అన్నదాత', 'ఆత్మబంధువు' లాంటి కథలమీద నేటికీ అప్పుడప్పుడు ఫోన్‌కాల్సు అందుతూ నన్ను ఆనందింపజేస్తూ నూతనోత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ఆ ప్రేరణతో ఇక ప్రతియేటా అంతకు మునుపటి సంవత్సరంలో వెలువడిన నాకథలతో 'TSA కథ––––––––' సంపుటాలను వెలువరిస్తూ ఉండాలనే కోరిక తీవ్రమైంది.

అయితే 2013వ సంవత్సరంలో నా కథలు కేవలం అయిదు మాత్రమే ప్రచురింపబడడం జరిగింది. హైదరాబాదు నుండీ వెలువడే 'ఉషోదయవెలుగు' అన్న ద్వైమాస పత్రిక జూలై, ఆగస్టు –2013 సంచికలో నా పెద్ద కథ 'కర్తృత్వము' ప్రారంభింప బడినదికానీ అది 2013వ సంవత్సరంలో పూర్తి కాలేదు. 2014 చివరలో ముగింపబడగలదు. ఆకారణంగా ఆకథను TSA–2013 లో ప్రచురించడం లేదు. అందువల్ల 2013లోనే ప్రచురితమైన నా హాస్యనాటిక 'బదిలీ' ని జోడించి 'TSA కథ–2013'ను వెలువరించడానికి సాహసిస్తున్నాను. ఈ సంపుటిని కూడా పాఠకులు ఆదరిస్తారనీ తమ అమూల్య అభిప్రాయాలను తెలియజేస్తారనీ ఆశిస్తున్నాను.

ముఖ్యంగా ఒక విజ్ఞప్తి.. ఇటీవల దాదాపు ప్రతిఒక్కరూ తమ తమ అభిప్రాయాలనూ, సూచనలనూ సలహాలనూ ఫోన్లమీదే తెలియజేస్తున్నారు. జాబులు కనుమరుగై పోకుండా ఉత్తరాల సంస్కృతిని జీవింపజేసుకోవాల్సిన అవసరం ఎంతయినా వుంది. కావున వీలయితే తమ అభిప్రాయాలను ఉత్తరాల ద్వారా తెలియపరచాలని మనవి.

3–169–16 రామారావు కాలనీ
**మదనపల్లె – 517 325**
చిత్తూరు జిల్లా

**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
01–06–2013

# అంకితం



***Sri B. Sivasankar, Accountant, Infosys, Bangalore.***

“సాంకేతిక పరిజ్ఞానం ఇంత అభివృద్ధి చెంది, దృశ్యవిప్లవం ఇంతలా మారుమూల పల్లెలలోకి కూడా విస్తరించి విజృంభించాక మనుషులలో పఠనాసక్తి తగ్గిపోయి పాఠకులు కరువయిపోతున్న దశిది!” అన్నమాటలు అక్కడక్కడ అప్పుడప్పుడు వినపడ్తూ నాలాంటి వాళ్ళకు ఇంచుక బాధను, నిరుత్సాహాన్ని కలిగిస్తుండడం కద్దు. అయితే... కాలం మరియు శ్రమశక్తి రెండూ కూడా డాలర్లలోకి మార్చబడే దేశాలలో సైతం పాఠక దేవుళ్లకు కరువే లేదనే సత్యాలను వెలువరించే కొన్ని సర్వేలయితే నాకు కాస్త ఊరట కలిగిస్తుంటాయి. కొన్ని పత్రికలు నారచనలతో పాటు నా ఫోను నంబర్లను కూడా ప్రచురించినప్పుడు నాకు రాష్ట్రం నలుమూలల నుండీ వచ్చే అనేక ఫోను కాల్సుఎనలేని ఆనందాన్ని, సంతృప్తిని, ఉత్సాహాన్ని కలిగిస్తుంటాయి. వాటికన్నాకూడా....... అరుదుగా అయినా అప్పుడప్పుడు నా రచనలు చదివి నన్ను వెతుక్కుంటూ వచ్చే వ్యక్తులవల్ల కలిగే ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. అలా వచ్చిన వాళ్ళలో ఒక ముఖ్యమైన వ్యక్తి బి. శివశంకర్.

దాదాపు తొమ్మిదేళ్ళ క్రితం నా ‘కొత్తబంగారులోకం’ నవల చదివి తరిగొండ గ్రామం కురవపల్లె నుండీ నన్ను వెతుక్కుంటూ వచ్చినప్పుడు అతని వయసు పద్దెనిమిదేళ్ళలోపే. B.com. చదువుతున్నట్లు చెప్పాడు. ప్రేమలోనో మరెందులోనో గాయపడి కొలుకుంటున్న కుర్రాడిలా అన్పించాడు పరిశీలనగా చూస్తే.

శ్రీ బి. శివశంకర్‌తో ఆ స్వల్ప పరిచయం అతను వ్రాసిన ఉత్తరాల ద్వారా బాగా అభివృద్ధి చెందింది. అతని ఉత్తరాలలోని ఆత్మీయత, అతని భాషలోని ప్రాంతీయత ఆనందాన్ని కలిగించేవి. సృజనకారులపట్ల అతనికున్న గౌరవం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేది.

అతని డిగ్రీ చదువు పూర్తవుతున్న దశలో కేంపస్ సెలక్షన్స్‌లో సెలక్టయి డిగ్రీ చేతికందగానే రాజస్థాన్ లోని జైపూర్‌కు వెళ్ళి ఉద్యోగంలో చేరిపోయాడు. నిజానికయితే అతనిలో ఒక రచయిత దాగుండాలి. జైపూర్‌లో ఉండిన నాలుగైదు సంవత్సరాలలోనూ తను చూడగలిగిన ఆగ్రా, ఢిల్లీ, గుర్గావ్, జైసల్మీర్, జోధ్‌పూర్, ఉదయపూర్, అజ్మీర్, చిత్తోడఘర్, మౌంటుఆబూ, జమ్మూ, పుష్కర్, వారణాసి మొదలైన వాటిన్నింటినీ గూర్చి కళ్ళకు కట్టినట్లు అతడు వ్రాసిన ఉత్తరాలు, వాటిలోని క్రియేటివిటీ రచయితగా నాకెంతో ప్రేరణ కలిగించాయి. ఎన్ని ప్రాంతాలు చూసినా, ఎంత ఎదిగినా జన్మభూమిని మరచిపోని మనిషతను. ఇహ ఇటీవల కాలంలో.......

జైపూర్ నుండీ బెంగుళూరు ఇన్ఫోసిస్ బ్రాంచికి అకౌంటెంటుగా బదిలి అయివచ్చాక ఒక పర్యాయం అతని తమ్ముడు శివకేశవ ద్వారా నాకు జవహర్లాల్ నెహ్రూగారి రచన 'ది డిస్కవరీఆఫ్ ఇండియా' గ్రంథం, ఒక కవరు అందాయి.

కవరులో రూ॥లు10116/- పదివేలా నూట పదహార్ల విలువగల చెక్, దానిని నా సాహితీ రంగానికి ఉపయోగించుకోవాల్సినదిగా ఒక లేఖ ఉన్నాయి.

అతడు చాల చిన్న వయస్కుడయినందున నేను ఆ చెక్‌ను ఉపయోగించు కోవడానికి ఇష్టపడలేక పోయాను. ఆ డబ్బును మరేదయినా సత్కార్యానికి ఉపయోగించుకోమనీ, చెక్ చించిపడవేస్తాననీ రెండు మూడు పర్యాయాలు ఫోన్‌లో హెచ్చరించాను.

కానీ అతని విన్నపం నన్ను కదిలించింది!

ఆచెక్ మార్చి సద్వినియోగ పరిచాను!!

ఇరవయిఏడేళ్ళ యువకుడే అయినా అతనికున్న సాహిత్యాభి మానానికి చేతులు జోడించి నమస్కరించాలని అన్పిస్తుంది నాకు.

అందుకే ఈ చిరుపొత్తం అతనికి అంకితం.

అతన్ని కన్న తల్లిదండ్రులు శ్రీమతి నాగమ్మ శ్రీబొగ్గల రెడ్డెప్పలు ధన్యజీవులు.

**మదనపల్లె - 517 325** **టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
5-6-2014 08571-221963&93472 98942

# కృతజ్ఞతలు

**ఈ** కథా సంపుటిలోని నా కథలను 2013వ సంవత్సరంలో తమ పత్రికలలో ప్రచురించిన ఆయా పత్రికాధిపతులకూ, సంపాదకులకూ, పత్రికల సిబ్బందికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఇందులోని రెండు కథలకు బహుమతులనందించిన 'ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక మరియు 'రచన' సచిత్ర మాసపత్రికల యాజమాన్యాలకూ, సంపాదకులకూ, సిబ్బందికీ ధన్యవాదములను అందజేయుచున్నాను.

ఈ సంపుటికి ముఖపత్రాలంకరణ గావించిన 'సుధాఆర్ట్స్' శ్రీ కె. సుధాకర్ గారికి వందనాలనర్పిస్తున్నాను.

ఈగ్రంథాన్ని ఇంత చక్కగా ముద్రించి అందజేసిన విజయవాణి ప్రింటర్స్ చౌడేపల్లి వారి యాజమాన్యానికీ మరియు వారి సిబ్బందికి హృదయపూర్వక నమస్సులను అందిస్తున్నాను.

ఈ గ్రంథ ముద్రణ జరుగుతున్న సమయంలో వచన రచనల పోటీలో నా 'ఆయుధం' నవలకు కన్సొలేషన్ బహుమతి నందించిన 'నది' మాసపత్రిక యాజమాన్యానికీ, సంపాదక వర్గానికీ, వారి సిబ్బందికీ కృతజ్ఞతాభి వందనములు తెలియజేయుచున్నాను.

**–రచయిత**

## ఈ సంపుటిలో.......

***అస్త్రసన్యాసం తప్పుకద?!*** **9**

*(ఆంధ్రభూమి వీక్లీ కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ)*

***అందరూ బాగుండాలి కద?*** **27**

– 'జ్యోతి' రాఘవయ్యగారి స్మారక ఆహ్లాదకర పోటీలో బహుమతి పొందిన కథ (రచనమాసపత్రిక)

***అదేమిటో*** **42**

– స్వప్న – మాసప్రతిక

***శుభాకాంక్షలు*** **43**

– కథాకేళి మాసపత్రిక

***ప్రవృత్తి*** **58**

– ఆలోచించండి మాసపత్రిక

***బదిలీ (నాటిక)*** **65**

– ఆలోచించండి మాసపత్రిక

# అస్త్రసన్యాసం తప్పకద ?!

**ప**ర్సనల్ సెల్ రింగయింది. తీసి, చూసి ఆశ్చర్యపోయాను. నంబరు కొత్తది.

"హలో" అన్నాను ఆన్ చేసి కూతూహలంగా.

"దయానంద్, నేను..రామ్మూర్తిని!"

"ఇదేమిటి ఏదో కొత్త ఫోన్‌లోంచీ మాట్లాడ్తున్నావు?" అన్నాను మరింత ఆశ్చర్యపోతూ.

"టవున్ వెలుపలి ఎస్.టి.డి. బూత్‌లోంచీ మాట్లాడుతున్నాను. జాగ్రత్తగా విను" అన్నాడు రామ్మూర్తి.

నా గుండె దడదడలాడింది.

"సరే..వింటున్నాను" అన్నాను.

"అదేమిటో చెప్పమనే బుడ్డోళ్ళ ఫ్రెష్ లిస్టులో నీవూ, నేనూ, రామి రెడ్డీ, చంద్రా ఉన్నాము. ఎప్పుడైనా మీద పడొచ్చు! చాలా రహస్య విషయమైనా తెలుసుకోగలిగాను. వెంటనే జాగ్రత్తపడు. బ్లాకేమాత్రం లేకుండా చూసుకో!" అన్నాడు రామ్మూర్తి.. 'వెంటనే' అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ.

"సరే!" అన్నాను నీరసంగా.

అవతల ఫోను పెట్టేశాడు రామ్మూర్తి.

'అదేమిటో' అంటే 'ఎ' అనీ, 'చెప్పమనే' అంటే 'సి' అనీ, బుడ్డోళ్లు అంటే 'బి' అనీ..వెరసి 'ఎ.సి.బి.' అన్నది మా కోడ్.

డ్రయివర్ని కూడా తీసుకోకుండా జీపెక్కి ఇంటికి వెళ్ళిపోయాను. భోజనం కూడా చెయ్యకుండా నా భార్యకు పరిస్థితి వివరించాను.

కోడలికీ, ముగ్గురు కుమార్తెలకూ వరుసగా చకచకా ఫోను చేసింది నా శ్రీమతి.

వాళ్ళయితే అందరూ ఆఘమేఘాల మీద కార్లలో దిగేశారు మరునాటి ఉదయాన్నే!

ముగ్గురు కూతుర్లుండడం ఇంట లక్ష్మీ, పార్వతి, సరస్వతులుండడమేరా అంటూండేది మా అమ్మ బ్రతికున్నంత కాలం. అది నిజమో, కాదో నాకయితే తేలలేదు కానీ ఈ ఆపత్కర సమయంలో బంగారాన్ని ముందే పంచుకుని నాకు పెద్ద బరువే దింపేశారు.

నా కోడలయితే సరేసరి.. 'నాకేం భయం లేదు. నేను సర్దుబాటు చేసుకోగల' నంటూ అందరికన్నా ఎక్కువే తీసుకుంది. ఎంతయినా హక్కుదారు కద?

డబ్బా కావాల్సినంత పుచ్చుకున్నారు పిల్లాజెల్లాతో సహా!

భోజనానికయినా ఉండడానికి ఇష్టపడలేదు ఎవరూ.

సునామీ ఉత్పన్నమవవచ్చునని తెలిశాక ఎవరి భయాలు వారివి!! దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి కద?

బండకుకొట్టిన కుండపెంకుల్లాగా నాలుగు కార్లూ, నాలుగు దిక్కులకు శరవేగంగా సాగిపోయాక నమ్మకస్తులయిన నలుగురు స్నేహితులకు ఊరి వెలుపలి ఎస్.టి.డి. బూత్ నుండీ ఫోను చేశాను..కార్లలో కాకుండా ఆటోలలో రమ్మని.

రామ్మూర్తి ఉపయోగించిన టెక్నిక్ చాలా మంచిది నిజానికి.

మిత్రులను నమ్మివాళ్ళు మొయ్యగలిగినంతమేర వడ్డీ లేని డిపాజిట్లలా నల్ల నిల్వలందించి నెత్తిమీద బరువు తగ్గించుకునే ప్రయత్నం చేశాను. ఇంతా చేసి..కొండలు కరిగాయేమో కానీ గుట్టలు మిగిలేవున్నాయి ఇంకా!

'ఎలా చెయ్యడం? ఏమిటి చెయ్యడం?' అని ఆలోచిస్తూంటే 'ఎవరైనా ఒక నమ్మకమైన మనిషితోడుంటే తీసుకువెళ్ళి ఎక్కడైనా పడేసి వచ్చేస్తే పోయె' అని అన్పించసాగింది. కానయితే ఈ విషయం చాలా గోప్యంగా జరగాలి. అందుకు సమర్థుడైన, నమ్మకస్తుడైన మనిషి కావాలి!

మా కార్యాలయంలో ఎవరూ అంతమాత్రం వారు లేరనే చెప్పవచ్చు. సింహాలు, సివంగులు, పులులు, తోడేళ్ళు ఎక్కువ! వాళ్ళకు ఏం చేసినా రహస్యంగా, గోప్యంగా ఉండగలరో లేదో? ఒకవేళ ఉండగలిగినా ఏదయినా ఇబ్బంది ఎదురైతే మాత్రం నా పేరు నానకుండా ఉండదేమో? అన్నీ అనుమానాలే!

ఆలోచనల మధ్య సతమతం అవుతోంటే ఓ పర్యాయం రాజారావు రూపం కళ్ళ ముందు కదిలింది ఆశ్చర్యకరంగా.

మా కార్యాలయంలో ఓ మూల ఏ ప్రాధాన్యతా లేని సెక్షన్‌లో పనిచేసే ఓ మామూలు గుమస్తా రాజారావు. ఎక్కడో స్వంత జిల్లాలో సజావుగా పనిచేసుకుంటుండిన అతడిని ఎత్తి ఇంత దూరానికి విసిరేశారు ఏడాది క్రితం.

కారణం పై వాళ్ళకు అతని నుండీ ఏమీ అందదు. అలాగని అతడూ ఏమీ ఆశించడు. ఒక రకంగా నిప్పు..మరొక రకంగా ఫిట్ ఫర్ నథింగ్.

పై అధికారి అతన్ని పిలిచి..“ఇలా వుంటే లాభం లేదు. నీవు మారాలి!” అన్నాడు.

“ఏం మరాలి సార్?”

“తినాలి..తినపెట్టాలి!”

“ఆ మార్పు నాలో రాదు సార్!” అనేశాడు రాజారావు నిక్కచ్చిగా.

“అయితే నీకు మార్పు తథ్యం..కాచుకో!” అన్నాడు ఆయనకు ఒళ్ళుమండి.

“మీ చేతుల్లో అధికారం ఉంది సార్. మీరేమయినా చెయ్యగలరు. కానీ సార్, నా చేతుల్లో కలం వుంది, నా బుర్రలో కాసింత తెలివి వుంది, చదవడం, ఆలోచించడం, వ్రాయడం నాకు చేతనవును. ఎక్కడయినా రూపాయకు పదహారణాలే. ఒక్కసారి స్వంతవూరు వదిలాక చలేమిటీ, గాలేమిటి?” అన్నాడు రాజారావు నిర్లిప్తంగా.

ఒక్క తన్నుతో ఇక్కడికి వచ్చిపడ్డాడు ఆపై.

అతనిక్కడ జాయినవడానికి ముందే రాజధానిలో ఓ అఫీషియల్ కాన్ఫరెన్సులో విరామమప్పుడు ఇదంతా కథ లాగా చెప్పుకున్నారు కొందరు ఉద్యోగులు. అందుకే నేనతని జోలికి వెళ్ళలేదు. నేనూ అతన్ని ఓ మూలకు విసిరేసి బండెడు చాకిరీ మాత్రం నెత్తినేశాను.

పనిలో మాత్రం పెద్దపులే రాజారావు. పనిని తినేస్తాడు. పెండింగ్ వర్కు అనేది అతని నిఘంటువులోనే లేదు. అతని వద్దనుండీ వచ్చే ఫైలు్సు చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. పరిపాలనాపరమైన చట్టముల వ్యవస్థీకరణ తాలూకు ఆదేశాల మీద అవగాహన సిద్ధాంతపరమైన న్యాయసూత్రాలను ఆకళింపు చేసుకున్న ఒక మంచి ఉద్యోగి రాజారావు. ఈ పని ఇన్నిగంటలో కావాలి అని చెప్పాక ‘సరే’ అంటే ఆ మాటకు కట్టుబడి ఆ పనిని ఆసరికి ముగించే మాట నిలకడ కలమనిషతను. అలాంటి వాళ్ళు సహకరిస్తేనే సునాయాసంగా ఈ బరువు దించేసుకోవచ్చు రహస్యంగా..మూడో కంటికి తెలియకుండా! మొత్తానికి అతడుగానీ ‘ఊ’ అంటే పని కాస్తా సానుకూలపడినట్లే.

కానీ అతడు ఎందుకు సహకరిస్తాడు?

కొన్ని గంటలపాటు ఆలోచించి, రిస్క్ ఉందనిపించినా, చివరికో నిర్ణయానికి వచ్చేశాను. రాజారావును పిలిపించి ఏకాంతంగా మాట్లాడాను.

“రాజారావ్, నీకు డబ్బేమయినా కావాలా అని ప్రశ్నించాను.

“ఎందుకు సార్, అలా అడుగుతున్నారు? అన్నాడతడు ఆశ్చర్యంగా.

"నీకేమయినా అవసరాలుంటే ఎంత డబ్బయినా ఇస్తాను. ఉచితంగా!" అన్నాను అతన్ని నా రంగంలోలాగుతూ.

"నాకే అవసరాలూ లేవు సార్, వచ్చే దాంతో సుఖంగా బ్రతుకుతున్నాము. ఇంతో అంతో దాచుకొన్నాము కూడా!" అన్నాడు.

నేను నాలిక్కరచుకుంటూ గతక్కుమన్నాను మొట్టమొదటి అడుగే తప్పటడుగు మరి!

నిజమే అతనిలాంటి వాళ్ళు అయాచితమైన దాన్ని దేన్నీ ఆశించరు. కష్టార్జితాన్నే ఇష్టంగా స్వీకరిస్తారు.

"సరే, నేను చెప్పేది కాస్త నింపాదిగా వినాలి. నీలోనే దాచుకోవాలి. వీలవుతుందా?" అన్నాను.

"దాచుకోగలను సార్" అన్నాడతడు అరనిముషం ఆలోచించి.

"నేనికపై నిజాయతీగా వృత్తి బాధ్యతలను నిర్వర్తించాలనుకుంటున్నాను" అన్నాను ఉపోద్ఘాతంగా.

"శుభాకాంక్షలు సార్, దేశంలోని ఉద్యోగులు అందరూ మీలా మారుమనసు పొందగలిగితే దేశ స్థితి గతులు మారిపోతాయి" అన్నాడు.

"అయితే ప్రస్తుతానికి నాకో చిన్న సహాయం కావాలి రాజారావ్!"

"చెప్పండి సార్, నా చేతనైతే తప్పక చేస్తాను." అన్నాడు అతడు.

"సత్ప్రవర్తనలోకి రావాలనుకున్నాక ఇహ అన్యాయార్జిత విత్తాన్ని ఎక్కడైనా రహస్యంగా పారవేయానుకుంటున్నాను. నాకు తోడుగా రాగలవా?" ప్రశ్నించాను.

"దానికి తోడెందుకు సార్?" అన్నాడు రాజారావ్ నవ్వి.

"పారవేసేలోపు ఎవరైనా నన్ను చంపేసి దోచేస్తారేమోననే భయం రాజారావ్!" అన్నాను ఏకాస్తయినా సిగ్గుపడకుండా.

"అంత ఎక్కువుందా సార్?" అన్నాడతడు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి.

అర్భకుడు అతనికేం తెలుసు? అది కొసరు మాత్రమేనని! అసలు సంగతి తెలిస్తే అదిరిపోయి కింద పడిపోయేవాడేమో?

నేను తలవూపాను.

"మీ ఉద్దేశాలు మంచివిగా మారిపోయినప్పుడు అంత పెద్ద మొత్తం పారవెయ్యడం కన్నా దేనికయినా సద్వినియోగం చేస్తే మంచిదేమో ఆలోచించండి సార్!" అన్నాడు అతను.

"ఓ ఎస్..అలాగే చేద్దాం. తిరుమలలో, శ్రీకాళహస్తిలో, విజయవాడలో, శ్రీశైలంలో... ఇలా కొన్ని ఆలయాలలోని హుండీలలో వరుసగా వేసేసి వద్దామా?" అన్నాను ప్రకాశంగా.

రాజారావు నవ్వేశాడు.

"ఎందుకు నవ్వుతున్నావు"

"ఏం లేదు సార్!"

"ఎందుకో చెప్పు!" అన్నాను నేను కాస్త దబాయింపుగా.

"మీకు కోపం వస్తుందేమో సార్!" అన్నాడతడు సంశయంగా.

"నేను కోపగించుకోను"

"అన్యాయంగా వచ్చిన ధనాన్ని దేవుని హుండీలలో వేయకూడదు సార్. కష్టపడి సంపాదించినదాన్నే ఇష్టపూర్వకంగా వెయ్యాలి!"

అతని మాటలతో నాకు షాక్ తగిలినట్లయింది. కోపం కూడా వచ్చింది. కానీ పైకి తెలియనివ్వలేదు.

"మరేం చేద్దామో చెప్పు!" అన్నాను.

"మూడు రోజుల తరువాత హైదరాబాదులో మీకు కాన్ఫరెన్సు ఉంది కద సార్!" అన్నాడు.

"అవును" అన్నాను ఆశ్చర్యంగా. ఆ కాన్ఫరెన్సుకూ, నా సమస్యకూ సంబంధమే ఉండదు.

"సంబంధిత గుమస్తా శెలవులో ఉన్నారు కదసార్, మీకు అసిస్ట్ చెయ్యడానికి, మీ వెంట ఫైల్సుతో రావడానికి ఆర్డర్సులో నా పేరు వేయించండి. మధ్యాహ్నమే బయల్దేరుదాము. డ్రయివరు వద్దు. నాకూ డ్రయివింగ్ చేతనవును. ఇద్దరమే నడుపుకుందాము. నెమ్మదిగా మూడురోజులు ప్రయాణం సాగిద్దాం!" అన్నాడు రాజారావు.

"మూడు రోజుల ప్రయాణమా? ఎందుకూ?" అన్నాను మరింత ఆశ్చర్యంగా.

"దారి పొడుగునా కన్పించే దేవుళ్ళకు పంచేసి బరువు దించుకోవచ్చు!"

నాకు కొద్దిగా అర్థం అయింది.

"వాళ్ళనెలా గుర్తించడం?"

"చాలా సులభం సార్!" అన్నాడు రాజారావు తేలికగా. ఎందుకోగానీ నాకతనిమీద చాలా విశ్వాసం కలిగింది.

ఎస్టాబ్లిష్‌మెంటు క్లర్కును పిలిచి ప్రొసీడింగ్స్ అర్జంటుగా పుటప్ చెయ్యమన్నాను.

"రాజారావునా సార్?" అన్నాడతను ఆశ్చర్యంగా.

"ఏం? అతను ఎక్స్‌పీరియన్సుడు కాదా?" అన్నాను.

గతుక్కుమన్నాడతను. ఆపై కిక్కురుమనకుండా వెళ్ళిపోయాడు. అతనే కాదు ఆఫీసులో చాలామందికి రాజారావంటే చాలా తేలిక భావం.

* * *

మధ్యాహ్నం మూడు గంటలకు బయల్దేరేశాము నా స్వంత కార్లో. కారు సరికొత్తదయినందువల్ల ప్రయాణం నింపాదిగా, హాయిగా సాగిపోతోంది.

ఐదు గంటలకు ఓ దాభాలో మంచి టీ తాగి రిలాక్సయ్యాం. తరువాత ఇరవయి కిలోమీటర్లు కూడా వెళ్ళివుండము...

"సార్, సార్ కారాపండి" అన్నాడు రాజారావు.

నేను రోడ్డు వారగా కారు ఆపాను.

కారు దిగి వెనుకవైపు లగేజి బూట్ నుండీ ఓ చిన్న జిప్ బ్యాగ్ తీసి తగిలించుకుని "రండి సార్, మొదటి దేవుడు ప్రత్యక్షం అయ్యేలా ఉన్నాడు" అన్నాడు రాజారావు.

నేను కారుదిగి డోర్ వెయ్యగానే ఆటోమేటిక్‌గా కారు డోర్లన్నీ లాక్ అయిపోయాయి. రాజారావు వెంటఅడుగులేశాను. రెండొందల గజాలు వెనక్కు నడిచిన తరువాత రోడ్డు దిగి దిశ, దారి లేని నేలమీద అడుగులేస్తున్నాడతడు. నేనూ అతన్ని అనుసరించాను.

అక్కడ ఒకచోట ఒక పొడిపొలం ముంగిట ఓ విషాదకరమైన భంగిమలో కూర్చుని వున్నాడు ఓ మనిషి. అతని ముఖంలో దిగులు, కళ్ళలో దీనత్వం స్పష్టాస్పష్టంగా కన్పిస్తున్నాయి.

"ఏం పెద్దాయినా, ఎందుకంత బేలగా కూర్చుండి పోయావు?"

రాజారావు ప్రశ్నవిని తలపైకెత్తిన అతని కళ్ళల్లో ఆశ్చర్యం..

"ఎవరు నాయనా నువ్వు..గుర్తురావడం లేదు" అన్నాడు పరిశీలనగా చూస్తూ.

"నేనెవరో తరువాత చెప్తాకానీ.. ఎందుకంత దిగులుగా ఉన్నావు?"

"ఏం చేయను నాయనా? వానలు పడ్తున్నాయి. మడక కట్టాలంటే ఎద్దులు లేవు. వాటితో రుణం తీరిపోయింది. ట్రాక్టరు బాడుగకు తేను లెక్క లేదు. చేను తడారిపోతే ఏం చేసేది?" అన్నాడతడు దిగులుగా.

"వెయ్యడానికి గింజలన్నా ఉన్నాయా?"

"ఆ! నాలుగు రోజులు, రేయింబగళ్ళు క్యూలో నేను, నా కొడుకు, మా ఆడది వంతులవారీగా కాపుకాస్తే సగం చేనుకెయ్యడానికి గవర్నమెంటోల్ల గింజలు దొరికాయి. మిగతా గింజలకూ, ఎరువులకూ ఆపైన కూలీలకూ దిక్కుతోచడం లేదు" అన్నాడు మరింత దిగులుగా.

"నీ కొడుకు పట్టించుకోడా?" రాజారావు ప్రశ్న చిత్రంగా ఉంది నాకు.

"వాడు పక్క టవున్‌లో సరుకుల రిక్షా లాగుతాడయ్యా. నా కూతురు ఊరోళ్ళ ఆవులు మేపుకొస్తుంది. వాళ్ళవల్లే మా నోటికాడికింత కూడొస్తోంది" అన్నాడు.

"కూతురికి పెళ్ళి చెయ్యలేదా?"

"ఏడ జేసేది నాయనా. నా చెల్లెలి కొడుకే చేసుకుంటానంటాడు. నా బావమరిదేమో ఇరవయి అయిదు వేలయినా లెక్క దెమ్మంటాడు. ఏడదెచ్చేది? మాయదారికాలం ఎంత కష్టపడినా తినడానికే సరిపోదు!" అతని కంట నీరు తిరగడం తెలుస్తూనే వుంది.

"ఇంతకూ నీకు పొలం దున్నడానికీ, గింజలకూ, ఎరువులకూ, కూలీలకూ ఎంత గావాల్సొస్తుంది?"

"పది వేల కాడికి అవుతుంది నాయనా!" లోకంలోని దిగులంతా అతని స్వరంలోనే వుంది.

"సార్, ఇతనికి నలభైవేలు ఇస్తే సద్వినియోగమవుతుంది!" అన్నాడు రాజారావు ఇంగ్లీషులో.

"ఏభయ వేలిచ్చేద్దాం!" అన్నాను ఆంగ్లంలోనే..మనస్ఫూర్తిగా.

ఆశ్చరకరంగా నాకు తెలియకుండానే నాలో ఆర్ద్రత పొంగుకొచ్చింది ఆ నిముషాలలో.

"ఒద్దుసార్. నలభై వేలే ఇవ్వండి చాలు" అంటూ తన భుజానికున్న బేగులోంచి ఓ వెయ్యి నోట్ల కట్ట తీసి నలభై కాగితాలు ఎంచి తీసి నాచేతికిచ్చాడు.

నేనతని చేతుల్లో పెట్టాను.

"ఈ సార్ మీ బంధువేలే....చాలాఏండ్లు విదేశాలలో వుండి మొన్ననే వచ్చారు. మీ పరిస్థితి తెలిసి నిన్ను వెతుక్కుంటూ వచ్చారు. నీవు పొలం దున్నించు. గింజలేశాక కూతురు పెళ్ళి చెయ్యి. పెళ్ళికి వస్తారు" అంటూ వెనుతిరిగాడు రాజారావు.

నోట మాట రాక దిమ్మదిరిగి నిలుచుండిపోయిన ఆ బడుగురైతు తేరుకునేలోపే మేం గబగబా నడిచి రోడ్డెక్కేశాం. తేరుకుని మాకేసి పరుగున వస్తున్న ఆ రైతుకి అందకుండా మా కారు ముందుకు సాగిపోసాగింది.

* * *

ఆ రాత్రికి దార్లోని ఓ పెద్ద టవున్‌లో త్రీ స్టార్ హోటల్లో బస చేశాము. రాజారావు తనేదయినా సాధారణ లాడ్జికి వెళ్తానన్నాడు. కానీ నేనే బలవంతంగా నాకు తోడుండాలంటూ ఫ్యామిలీ రూమ్ బుక్ చేశాను.

దేవుళ్ళను గురించి కొద్దిగా అవగాహన కలిగిందేమో, నాకు కూడా... మాకు డిన్నర్ సర్వ్ చేసిన రూంబోయ్ కళ్ళలోతుల్లో ఏవో చీకటి కోణాలు కన్పించాయి.

రాజారావును కదిలించాను.

"నేనే చెప్పబోతున్నాను సార్. మీరే గ్రహించారు" అంటూ రూమ్ బాయ్‌ను పిలిచి సంగతి విచారించాడు.

చేస్తున్నది రూమ్‌బాయ్ ఉద్యోగం అయినా తినీ, తినకా కుమారుడ్ని బాగా చదివించాడు. బొటాబొటీ ర్యాంకుతో ఒక మెడికల్ కాలేజీలో మెడిసన్‌లో సీటయితే వచ్చే అవకాశం వచ్చింది కానీ తక్కువ ర్యాంకయినందున ఆ ప్రయివేటు కాలేజి వారు డొనేషన్ డిమాండ్ చేస్తున్నారు. వాళ్ళనూ వీళ్ళనూ పట్టుకుని సిఫార్సు చేయిస్తే డొనేషన్ తగ్గించారు. అదయినా చెల్లించే స్థాయి లేదు. సీటు వచ్చేస్తే ఫీజు రీ ఎంబర్సు మెంటుతో ఎలాగోలా కుర్రాడ్ని డాక్టర్ని చేసుకోవచ్చు. కానీ డొనేషన్ కట్టడానికి డబ్బెక్కడ్నుండి వస్తుంది?

కుర్రాడయితే ధైర్యంగానే ఉన్నాడు. గవర్నమెంటు కాలేజీలో బి.ఎస్సీలో చేరిపోయి తరువాత మళ్ళీ వ్రాసి మంచి ర్యాంకుకోసం ప్రయత్నిస్తానంటాడు.

కానీ 'తీరా వెన్న పడేప్పుడు బాన పగిలిపోయేలా ఉందే?' అని దిగులు పడిపోతున్నారు రూమ్‌బాయ్ దంపతులు. నిజానికి కథ చాలా చిన్నదే కానీ గొప్ప హృదయ స్పర్శతో ఉంది. వింటున్న నాకే కంటనీరు తిరిగింది ఒక చోట!

అతనికి కావాల్సిన మొత్తానికి పాతికవేలు ఎక్కువగా కలిపి వెంటనే ఇచ్చేద్దామన్నాను ఇంగ్లీషులో.

కానీ రాజారావు అంగీకరించలేదు.

"ఇప్పుడొద్దు సార్. రేపు పెందలాడే గది ఖాళీ చేసి వెళ్తాం కద.. అప్పుడిద్దాం..ఎక్కువగా కాదు..అతనికి ఎంత అవసరమో అంతే ఇద్దాం!" అన్నాడు.

నాకు కొంచెం చిరాకేసింది. 'సత్రం భోజనానికి అయ్యంగార్ల సిఫార్సు అన్నట్లుగా వుంది ఈ రాజారావు వ్యవహారం అంతా' అని అనుకుంటూ... "కాస్త ఎక్కువిస్తే ఏం పోయింది? పాపం ఆ రైతుకు కూడా ఎక్కువ ఇవ్వనివ్వలేదు" అన్నాను నిష్టూరంగా.

నా ముఖకవళికలను గమనించాడు రాజారావు.

"సార్, అదృష్టాన్ని మించి ఆశించరాదు సార్ మనిషి. ముఖ్యంగా దిగువ మధ్యతరగతి వారు, పేదవారు కష్టపడి జీవించడానికి సదాసిద్ధంగా ఉండాలి. సోమరితనానికి కాస్త అలవాటుపడినా వారి జీవన గమనంలో అపశ్రుతులు ఆరంభం అయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకోసమే కొండంత దేవుడికయినా కావాల్సినంత నైవేద్యమే పెడ్తే బావుంటుంది అన్నది నా భావన. అలా కాదు ఎక్కువే ఇద్దామంటే ఇద్దాం..ఎటూ మనం మీ వద్ద ఉన్నదంతా అయిపోయే వరకే కదా ఇవ్వగలుగుతాం!" అన్నాడు.

నాకో గొప్ప సత్యం ఏదో బోధపడినట్లయింది. అంతేగాక ఎక్కువ ఇచ్చేయాలనుకున్న మొత్తాలు చివర్న ఎవరికయినా ఉపయోగపడగలవేమోనన్న ఆలోచన కూడా కలిగింది ఆ సమయంలో. అందువల్ల త్వరగా బరువు దించేసుకోవాలని నా మనసులో వున్న ఆత్రుతను కాస్త తగ్గించుకోవాలని అన్పించింది.

మరునాడు సూర్యోదయానికి ముందే తయారయిపోయాం. రూమ్‌బోయ్‌ని పిలిచి అతడు గదిలోపలికి రాగానే తలుపు మూసి గడియపెట్టాడు రాజారావు.

"చూడబ్బాయ్. నేను చెప్పేది జాగ్రత్తగా విను. రాత్రి నీ కథ విన్నాక సార్ చాలా బాధపడ్డారు. వర్షాలు కురవడం కోసం ఒక యాగం చేయించడానికి ఎక్కడెక్కడో తిరిగి సంపాదించిన సొమ్ము లోంచీ కొంత నీకిచ్చేయాలని అనుకుంటున్నారు. అయితే ఒక కండిషన్" అన్నాడు.

"ఏమిటి సార్ అది? తక్కువ వడ్డీ అయినా నేను కట్టలేను" అన్నాడు భయంగా కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.

"వెర్రి నాయనా, నీవు ఈ డబ్బు ఎక్కడో అప్పో, సప్పో చేసినట్లే ఖర్చు చేసుకో. వడ్డీ ఇవ్వాల్సిన పని లేదు. అసలంతకన్నా అక్కర లేదు. కానీ సార్ నీకీ సహాయం చేసినట్లు సార్‌పేరు బయటకు రాకూడదు. అలా వచ్చిందా..యాగానికి మొత్తాలిచ్చిన వాళ్ళ వద్ద సార్ గౌరవం పోతుంది. పైగా ఆ డబ్బు నీ ముక్కుపిండి వెనక్కి రాబట్టవలసి వస్తుంది" అన్నాడు రాజారావు నెమ్మదిగా.

అతనికి అర్ధం కావడానికి అరఘడియ పట్టింది.

నాచేత అతనికి ఇప్పించిన డబ్బుతో సహా అతన్ని ఆటోలో ఇంటికి పంపేసి వచ్చాడు రాజారావు.

అప్పటికి అర్థం అయింది నాకు నేను డబ్బు పంచుతున్న విషయం ఎప్పుడూ ఎక్కడా ఎలాంటి పరిస్థితులలోనూ బయట పడకుండా రాజారావు జాగ్రత్తపడ్తున్నాడని.

గది ఖాళీ చెయ్యగానే మా ప్రస్థానం ప్రారంభమైంది మళ్ళీ. కానీ..వేగంగా మాత్రం కాదు. ఎన్ని మజిలీలో? ప్రపంచంలో ఇన్నేసి కష్టాలూ, ఇంతింత కన్నీళ్ళూ, ఎన్నెన్నో విషాదాలూ ఉన్నాయని నాకయితే నిజంగా తెలియదు. ఫ్యానుగాలి క్రిందా, ఎక్కువ మాట్లాడితే ఎయిర్ కండిషన్ గదులలో గడుపుతున్నవాణ్ణి మరి.

రాజధాని సగం దూరంలో ఉండగానే కార్లో ఉండిన గుట్టలు సగానికి సగం కరిగిపోయాయి. నా బట్టలు మాసిపోయాయి. తల కూడా కాస్త చెదిరింది. కానీ ఎక్కడయినా దిగి ఫ్రెష్షప్ అవ్వాలనిపించలేదు. మిగిలిన గుట్టలు సద్వినియోగం చెయ్యడంలోని ఆనందాన్ని అనుభవించాడానికి ఉత్సాహంగా ముందుకు దూసుకుపోవాలన్పించసాగింది అలసట అన్పించకుండా! రాజారావూ సరే సరి!

దార్లో ఒకచోట..ఓ కారు ఆగి వుంది. దాని డ్రయివర్ కాబోలు మా కారును ఆపాడు. అలాంటి చోట కారు ఆపే అలవాటు నాకు లేదు. అయినా ఎందుకో అప్రయత్నంగా ఆపాను.

"సార్, మా కారు ట్రబులిస్తోంది. మెకానిక్ రావడం, రిపేరవడం ఆలస్యం అయ్యేలా వుంది. పాతిక కిలోమీటర్ల దూరంలో మా ఫ్యాక్టరీ వుంది. మా అయ్యగార్ని అంతదాకా తీసుకు వెళ్ళగలరా?" అన్నాడు వినయంగా.

"ఊ! రమ్మను" అన్నాను ఉత్సాహంగా.

ఎదుటి మనిషికి నిస్వార్థంగా సహాయపడడంలోని ఆనందం తాలూకు మజాను అప్పుడప్పుడే చవిచూస్తున్నవాణ్ణి మరి.

రెండు నిముషాలలో ఓ స్ఫురద్రూపి ఆ కారు దిగి వచ్చి మా కారు ఎక్కాడు. ఐదు నిముషాల తరువాత రాజారావు అతనితో సంభాషించడం మొదలు పెట్టాడు.

నన్ను డ్రయివరుగా, రాజారావును ఓనరుగా భావించినట్లుంది అతడు. రాజారావుతోనే సంభాషిస్తున్నాడు. కాస్సేపట్లోనే సంభాషణ మలుపు తిరిగింది.

మేం వెతుకుతున్న దేవుళ్ళలో తనూ ఓ దేవుడుగా ఉన్నాడతగాడు.

దాదాపు మూడు వందలా ఏభయిమంది పనివారు పనిచేసే ఫ్యాక్టరీ యజమాని అతగాడు. నిరవధికమైన కరంటు కోతలు సగం దెబ్బదీశాయి ఫ్యాక్టరీ ఉత్పత్తిని. పెరిగిన డీజిలు ధరలు దెబ్బమీద దెబ్బ కొట్టాయి. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్లు నాలుగు జనరేటర్లు వరుసగా దెబ్బతిని పని మానుకున్నాయి. ఎన్నడూ చేయి చాచి ఎరుగని అతడు అటూ ఇటూ తారట్లాడవలసి వస్తున్నట్లుంది అతని మాటలను బట్టి!

అతని కథ వింటూంటే అలనాడు ఆరవేటి కోటయ్యగారు గానం చేసిన పాట మధ్యలోని..'కాకి తన్ని పోయెరన్నా! కాకిపిల్ల తన్నిపోయెరన్నా' చరణాలు చెవులలో మెదలసాగాయి.

మౌనంగా సంభాషణ వింటున్న నాకు అవగతమైన ఆశ్చర్యకరమైన ఒక ముఖ్య విషయం యేమిటంటే అతడు ఎక్కువగా బాధపడ్తున్నది తను నష్టాలలో కూరుకుపోతున్నందుకు కాదు..తన ఫ్యాక్టరీలో పనిచేసే మూడువందలా ఏభయిమంది పనివాళ్ళ తాలూకు కుటుంబాలు దెబ్బ తింటున్నాయని!

అతని విషాదాన్ని వింటూంటే నాకు నేనే ఒక మరుగుజ్జులా అన్పించసాగాను.

అరగంట ప్రయాణం తరువాత..“అక్కడ ఆ ఎడంవైపు కన్పిస్తున్న ఫ్యాక్టరీ మాది. మీరు ఆ క్రాస్ వద్ద ఆపితే దిగిపోతాను” అన్నాడతను.

“మీ ఫ్యాక్టరీలోనే దింపుతాము మిమ్మల్ని. మీ ఫ్యాక్టరీని ఓసారి చూడవచ్చా?” అన్నాడు రాజారావు.

“వైనాట్. విత్ ప్లెజర్!” అన్నాడాయన.

ఫ్యాక్టరీ పెద్దదే! పని జరగకుండా ఆగిపోయివున్నా చాలామంది పనివారు ఫ్యాక్టరీ కేంపస్‌లో కన్పిస్తున్నారు దిగులు ముఖాలేసుకుని.

శెలవు తీసుకునే ముందు అతని విజిటింగ్ కార్డు అడిగి తీసుకున్నాడు రాజారావు.

కొంతదూరం వెళ్ళాక నేను కారు ఆపాను. ఇద్దరం కారు దిగి కాస్త రిలాక్స్ అయ్యాం. మూడు వందలఏభయి కుటుంబాల ఆ దేవదేవుడు లేచి నిటారుగా నిలబడాలంటే ఎంత కావాల్సిందీ లెక్క కట్టగలిగాను రాజరావుతో కలిసి.

“ఎలా?” అన్నాను చివరికి.

“శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలంటారు. అలాంటిది మనం అందిస్తున్న శతాధిక అదృష్టాల కార్యాలలో ఈ కార్యానికీ ఉపాయం ఉండకపోదు సార్!” అన్నాడు తను డ్రయివింగ్ సీట్లోకి వచ్చి కారు స్టార్టు చేస్తూ.

అరవయి కిలోమీటర్ల అవతల ఓ మధ్య తరగతి పట్టణం తగిలింది. ఓ లాడ్జిలో గది తీసుకున్నాము.

నేను ఫ్రెష్షప్ అయి రిలాక్స్ అవుతూండగా రాజారావు బజారుకు వెళ్ళి ఓ చిన్న బాక్స్, దానికో చిన్న తాళం, ప్యాకింగ్ మెటీరియల్ మొదలైనవి తీసుకువచ్చాడు.

ఆ దేవదేవునికి మేం చెయ్యాలనుకున్న నైవేద్యం లెక్కగట్టి సర్దితే సరిగ్గా బాక్సులోకి సరిపోయింది. బాక్సుకు ఆ బుల్లి తాళం వేసి అది వెలుపలికి వచ్చేలా బాక్సుకు ఫుల్ ప్యాకింగ్ స్ట్రాంగుగా చేశాడు. తరువాత తాళానికి గుడ్డ చుట్టి లక్కతో సీల్ వేసి తాళం చెవితో ముద్రలు వేశాడు చెక్కుచెదరని విధంగా.

విజిటింగ్ కార్డులోని ఆయన చిరునామాను ప్యాకింగ్ చెయ్యబడ్డ బాక్సుమీద స్కెచ్ పెన్‌తో వ్రాశాక, ఫ్రంఅడ్రసులో దేవరాజు, మామంచిపురం, భగవాన్ పేట పోస్టు అని వ్రాశాడు. అదయ్యాక..“సార్ ఇక బయల్దేరుదాం” అన్నాడు.

‘హెట్స్ ఆఫ్ టూ యూ రాజారావ్!” అని అనుకుంటూ అతన్ని అనుసరించాను.

గది ఖాళీ చేసి బయల్దేరాక దార్లో ఒకచోట కారు ఆపాడు రాజారావు.

“సార్ శ్రమ అనుకోకుండా అదిగో అక్కడ కన్పిస్తున్న కొరియర్ షాపు వరకు బాక్స్ తీసుకుని నడచివెళ్ళండి. నేను కారు తీసుకుని కొంచెం ముందుకు వెళ్లిపోతాను. మీ చేత్తోటే ఈ బాక్స్ కొరియర్ చేసి రండి. మన కారు నెంబరు ఆ కొరియర్‌షాపు వాళ్ళకు తెలియకుండా ఈ ఏర్పాటు” అన్నాడు.

నేను బాక్స్ పట్టుకుని కిందికి దిగేశాక కారు ముందుకు వెళ్ళిపోయింది.

నన్నెవరైనా గమనిస్తున్నారా? అని చుట్టూ చూశాను. నా వెర్రి కానీ ఎవరికి అంత తీరుబడి? ఎవరి ధోరణిలో వాళ్ళు కదలిపోతున్నారు.

కొరియర్ షాపు వాళ్ళు కూడా నన్నేం పట్టించుకోలేదు. వాళ్ళ షాపునకు వచ్చే వందలాది మందిలో నేనొకడ్ని కాబోలు?

కొరియర్ ఛార్జి తీసుకుని రసీదు ఇచ్చారు.

షాపునుండీ వచ్చేసి కారుకేసి నడిచాను. ఎక్కి కూర్చోగానే చప్పున ముందుకు పోనిచ్చాడు రాజారావు. ఊరు దాటి ఓ ఐదారు కిలోమీటర్ల దూరం వెళ్ళాక విండోగ్లాస్ కాస్త దించి రసీదును చిన్న చిన్న ముక్కలుగా చింపి గాలిలోకి వదిలాను.

✶ ✶ ✶

రాజధాని చేరుకునేసరికే నెత్తిమీద బరువు చాలావరకూ తగ్గిపోయి గుట్టలు ముప్పాతిక భాగం కరిగిపోయి ఆఫీసు ఫైళ్ళు వెలుపల పడ్డాయి.

వాటిని తీసుకుని కాన్ఫరెన్స్‌కు అటెండయ్యాము.

పాతపాటే..రాగం కొత్తది అన్నట్లుగా ప్రతి కాన్ఫరెన్సులో చెప్పే విషయాలనే కాస్త విస్తృతంగా ఒత్తిడిని కలిగిస్తూ కొత్త ప్రజంటేషన్‌గా చెప్పారు.

కాన్ఫరెన్స్ ముగిసేసరికి సాయంకాలం అయిపోయింది. గెస్ట్‌హౌస్ చేరుకుని ఆ రాత్రి అక్కడే గడిపి మరునాటి ఉదయాన్నే బయల్దేరాము.

మజిలీలు తక్కువే అయినా సాయంకాలానికి దాదాపు మొత్తం కరిగిపోయి ఓ పాతిక వేలు మాత్రం మిగిలాయి.

"విండోలోంచీ అవతలికి గిరాటేస్తాను రాజారావ్, ఎవరికి దొరికితే వాడదృష్టవంతుడవుతాడు!" అన్నాను రిలాక్సుడుగా.

"పారవెయ్యడం ఎందుకు సార్! మీ చేతులతో మీరే ఎవరికైనా ఇవ్వవచ్చు. కాస్త ఓపిక పట్టండి దయచేసి" అన్నాడు రాజారావు చిన్నగా నవ్వి.

కారు ఏదో చిన్న టవున్‌లోకి ప్రవేశించబోతోంది. రోడ్డుకు ఎడంవైపే ఏదో పురాతనమైన గుడి కన్పించింది కళాకాంతులు లేకుండా.

"రాజారావ్, ఆ గుడివైపు తిప్పు. ఒక్క దేవుడ్నైనా దర్శించుకుని వెళ్దాం!" అన్నాను.

"చాలా మంది దేవుళ్ళనే దర్శించుకున్నాం కదసార్!" అంటూ రాజారావు కారు వేగాన్ని తగ్గించి గుడివైపు నడిపి గుడి పక్కగా నీడలో నిలబెట్టాడు.

ఆలయం చాలా ప్రశాంతంగా, నిర్మానుష్యంగా వుంది. వెలుపల మంటపం దగ్గర కూర్చుని ఉండిన పూజారి మమ్మల్ని చూసి లేచి గర్భగుడిలోకి వెళ్ళి తట్ట పట్టుకు వచ్చి "అర్చన చెయ్యనా నాయనా?" అని అడిగాడు.

"హారతివ్వండి చాలు" అన్నాడు రాజారావు.

కర్పూర హారతి వెలుగులలో అద్భుతంగా వెలుగులీనుతూ కాంతివంతంగా కన్పించిన శివలింగాన్ని కాళ్ళారా దర్శించుకున్నాము. తీర్థప్రసాదాలు పుచ్చుకున్న తర్వాత మంటపం దగ్గరగా వచ్చి కూర్చున్నాము.

పూజారి అటువైపుగా వచ్చి కూర్చున్నాడు.

బ్రహ్మ తేజస్సుతో నిండివున్న ముఖారవిందమే పూజారిది. కానీ ఆయన కళ్ళలోతుల్లో ఏవో విషాదరేఖలు తారట్లాడుతున్నట్లు అన్పించింది నాకు.

రాజారావుకేసి చూశాను. అతడు తల వూపాడు.

"చాలా పురాతనమైనదా స్వామీ ఈ ఆలయం?" అంటూ పూజారిని ప్రశ్నించాడు రాజారావు.

"అవును నాయనా! చోళరాజుల కాలంలో నిర్మాణం, ప్రతిష్ఠలు జరిగి మడులు, మాన్యాలతో, భక్త జనసందోహాలతో ఓ వెలుగు వెలిగిన ఆలయం నాయనా ఇది" అన్నాడాయన భక్తిగా గర్భగుడిలోని శివలింగాన్ని చూస్తూ.

"మరి ఇప్పుడు?"

"మనుషులలో భక్తి భావం తగ్గిపోతోంది నాయనా. ఎక్కువమంది మనుషులు కాసులవెంట పరుగులు తీస్తున్నారు. పండుగలు, పర్వదినాలలో తప్ప పెద్దగా భక్తులు రారు. ఆలయానికి చెందిన మడి మాన్యాలు అన్నీ మునుపటి ధర్మకర్తలు, ప్రస్తుత ధర్మకర్తలు పేచీ పడి కోర్టుకెక్కడం వల్ల బీళ్లు పడ్డాయి. కొద్దో గొప్పో మా అనుభవంలో వుండిన భూమిని కూడా వ్యాజ్యంలోకి లాగారు. తలవర్లు, మేలగాళ్ళు, పనివారు కూడా భూములు బీడు పెట్టక తప్పలేదు. అందరికీ శ్రద్ధ తగ్గింది. అందుకే ఆలయం ఇలా వుంది" ఆయన స్వరంలో బాధ ధ్వనిస్తోంది.

"ప్రస్తుతం మీకెలా స్వామీ?"

"మా తాతల కాలం నుండీ వంశపారంపర్యంగా మేమే పూజారులం నాయనా! మా తండ్రికాలం వరకూ మాకు గొప్ప గౌరవం దక్కింది. నా తరం వచ్చాక కూడా చాలాకాలం ఆ గౌరవాలు, మన్ననలు కొనసాగాయి. కానీ ప్రస్తుతం వేదాధ్యయనం చేసిన నాకు తగిన గుర్తింపు లేదు. మా అనుభవంలో ఉండిన దేవుని మాన్యమూ కోర్టులో పడ్డాక తట్టకాసుల్తోటే జీవనం గడుపుకోవాల్సి వస్తోంది. భక్తులు వస్తే కద తట్టలో నాలుగు కాసులు రాలేది. నిజానికి కష్టంగానే ఉంది!

బాల్యం నుండీ చదువులతోపాటు వేదాలను అభ్యసించిన నా బిడ్డలు జరుగుబాటులేక ఒకడు టవున్‌లోని అయ్యర్ హోటల్ బిల్లులు వ్రాసే పనిలో కుదురుకున్నాడు. ఇంకొకడు పంచాయితీ ఆఫీసులో కాంట్రాక్టు బిల్ కలక్టరుగా పనిచేస్తున్నాడు. వాళ్ళ కొద్ది పాటి జీతాలతోటే బండి నడుస్తోంది నాయనా!" అన్నాడు.

"ఆడ పిల్లల పెండిండ్లు స్వామీ?"

"ఆ భాగ్యం భగవంతుడీయలేదు నాయనా..ఇద్దరే పిల్లలు!"

"తమరి శ్రీమతిగారు స్వామీ?"

"నా భార్య ఆరోగ్యమూ బాగులేదు నాయనా..కడుపులో ఏదో గడ్డ ఉందన్నారు. ఆపరేషను చెయ్యాలట. ఆరోగ్యశ్రీక్రింద చేయించాలని పెద్దాసుపత్రిలో చూపించాము జిల్లాకేంద్రంలో. మా రేషనుకార్డుకు ఆ పథకం వర్తించదట!" అతని స్వరంలో అంతులేని అశక్తతతో కూడిన విషాదం.

"మరెలా స్వామీ"

"ధర్మకర్తల చుట్టూ తిరిగాను. తను లేకపోతే నేను లేనని చెప్పుకున్నాను. కాస్తాగు, కేసు తెగిపోతుంది. ఏదో ఒకటి చేస్తామంటారు. కేసులు తెగేది ఎప్పటికి? అంకిపాడు మిట్టలో నా చిన్ననాటి స్నేహితుడు నారాయణ ఓ చిన్నస్థాయి డాక్టరు. వాడు తనకు తెలిసిన ప్రయివేటు పెద్దాసుపత్రిలో తను కూడా పాల్గొని తక్కువలో ఆపరేషను చేయిస్తానంటున్నాడు. దానికీ లెక్కకుదరడం లేదు"

"తక్కువలో అంటే ఎంతలో చేయిస్తానన్నాడు స్వామీ?"

"కావల్సిన రక్తము, మందులు, ఆపరేషను..అన్నీ కూడా పాతికవేల రూపాయలలో ముగించేలా సహాయం చేస్తానన్నాడు. అదే నా పాలిట పాతిక లక్షల లెక్కగా కన్పిస్తోంది!" ఆయన స్వరంలో అవధులు లేని ఆవేదన.

నాకు ఎలక్ట్రిక్ షాకు తగిలినట్లయింది. 'పాతిక వేలను ఎక్కడైనా పడవెయ్యనివ్వకుండా రాజారావు అడ్డుపడడం ఎంతమేలయింది?" అని అనుకున్నాను.

రాజారావు కారు దగ్గరకు వెళ్ళి డబ్బు తెచ్చి నా చేతికి అందించాడు. నేను ఆ పాతికవేలు పూజారి చేతుల్లో పెట్టి అన్నాను..

"స్వామిగారూ మీ డాక్టరు మిత్రుని సాయంతో, ఈ డబ్బుతో మీ భార్యకు ఆపరేషన్ చేయించండి"

కలో, నిజమో తెలియని స్థితిలో మనిషి ముఖం ఎలా వుంటుందో నాకు ఆయన ముఖం తెలియజెప్పింది ఆ నిముషాలలో.

ఐదు నిముషాల తరువాత ఆయన కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ విషాద ఆనందాలు కలగలిసిన ఉద్వేగంతో అన్నాడు..

***"వత్సౌ కౌయువాం యువయోహో వంశ గోత్రౌ కేయితి నాహం జానామి. కింతు అస్మిన్ ప్రపంచే ప్రేమానుకంప న్యాయ్య ధర్మాదీనాం ఆశ్చిత్వం మమ అవబోధ ఇతుమేవ ఆగత వంతౌ దేవదూతా వితి మన్యే. యువాం, యువయోహో కుటుంబ వంశీయాః చిరాయు రారోగ్యై ఐశ్వర్యానంద మనుభవేయురితి పరమేశ్వరం ప్రార్థయామి!"***

ఆయనలా అనగానే రాజారావు వంగి ఆయనకు పాదాభివందనం చేశాడు. అసంకల్పితంగా నేను కూడా నా జీవితంలో తొలిసారిగా ద్విజుడికి పాదాభివందనం చేశాను హృదయపూర్వకంగా!

* * *

ఆ టవున్‌లో విచారిస్తే అంకిపాడు మిట్టలో మంచి రెసిడెన్సీ హోటళ్లు ఉన్నాయని తెలిసింది. చీకటి పడేలోగా అంకిపాడు మిట్ట చేరాలని కారును వేగంగా పోనిస్తున్నాడు రాజారావు.

"రాజారావ్, ఇందాకా ఆ బ్రాహ్మడు మనల్నేదో ఆశీర్వదించాడు కదా?" అన్నాను.

"అవున్సార్..ఆశ్చర్యనందాల పారవశ్యంలో ఆయన నోటివెంట అద్భుతమైన ఆశీర్వాదం చక్కటి సంస్కృతంలో వెలువడింది!"

"నీకర్థమైందా?"

"అర్థమైంది సార్, నాలుగు మార్కులు ఎక్కువ వస్తాయని కాలేజీలో సంస్కృతం రెండవ భాషగా చదివిన వాడ్నికద?" అన్నాడు రాజారావు.

"ఇంతకూ ఏమిటి ఆయన ఆశీర్వాదం?" ఆసక్తిగా ప్రశ్నించాను.

***"నాయనా మీరెవరో, ఏ వంశస్తులో, ఏ గోత్రీకులో నాకు తెలియదు. కానీ ఈ ప్రపంచంలో ప్రేమ, దయ, న్యాయం, ధర్మం ఇంకా మిగిలివున్నాయని నాకు తెలియజెప్పడానికి వచ్చిన దేవదూతలు మీరు! మీరు, మీ కుటుంబాలు, మీ వంశాలు కలకాలం ఆనంద, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగుతూ ఉండాలని ఆ పరమేశ్వరుడిని ప్రార్థిస్తున్నాను అంటూ ఆశీర్వదించాడు సార్ ఆయన!" అన్నాడు రాజారావు.***

రాజారావు చెప్పింది వినగానే ఎందుకో నా మనసంతా ప్రశాంతంగా తయారయినట్లనిపించ సాగింది.

మౌనంగా ఐదు నిముషాలు గడిచాయి.

"రాజారావ్, నాకెందుకో ఇహ జీవితంలో చెయ్యాల్సిందేమీ లేదని అన్పిస్తోంది!" అన్నాను.

రాజారావు నవ్వేసి డ్రయివింగ్ మీదే మనసు లగ్నం చేశాడు.

"ఉద్యోగానికి కూడా రాజీనామా చేసేసి విశ్రాంత జీవితం గడపాలనిపిస్తోంది!" అన్నాను మళ్ళీ నేనే.

"తప్పుసార్!" అన్నాడు రాజారావు కొంత చనువు తీసుకుని.

"ఏమిటి తప్పు"

"మీకు చెప్పగలిగినంతటి వాణ్ణికాను సార్. కానయితే చేయగలశక్తి సామర్థ్యాలుండి కూడా అస్త్రసన్యాసం చేయాలనుకోవడం తప్పుకదా సార్? తామ రాకు మీది నీటి బొట్టులాగా మిగిలివున్న సంవత్సరాలు నిజాయితీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడమే ధర్మం!"

"అందువల్ల ఏమిటి ఉపయోగం?"

"మన కార్యాలయాల చుట్టూ తిరిగే దేవుళ్లకయినా మీ వల్ల వాళ్ల వాళ్ల పనులు సకాలంలో సానుకూలపడి మేలు జరగవచ్చు. వృత్తిధర్మాన్ని సజావుగా, సక్రమంగా నిర్వర్తించారన్న తృప్తి మీకు జీవితాంతం మిగులుతుంది" అన్నాడు రాజారావు.

నేను ఆలోచనల్లో పడ్డాను.

కొత్త కొత్త ఆలోచనలు, భావాలు ఉత్పన్నమవుతున్నాయి నా మనసులో.

***– ఆంధ్రభూమి వీక్లీ కథలపోటీలో రెండవబహుమతి 8000/– పొందిన కథ***

***2/5/2013***

# అందరూ బాగుండాలి కద?

"ఆ..మే...నా...?"

నా చాంబర్ కేసి నడుస్తూ యధాలాపంగా గ్లాస్ వాల్‌లోంచి సేల్సు సెక్షన్‌లోకి చూసిన నేను ఆశ్చర్యంతో అవాక్కయిపోయాను.

కాస్త ఆగి చుట్టూ పరిశీలించాను... ఎవరి పనులలో వాళ్ళున్నారు.

అంతదాకా నేను చెప్తున్నది వింటూ వస్తున్న ఆర్టిస్టు ఆశ్చర్యంగా చూశాడు నాకేసి.

"అలా చేసెయ్యండి!" అని చెప్పి అతన్ని పంపేశాను. ఇహ వెనక్కి తిరిగి సేల్సు సెక్షను వైపు నడిచాను చకచకా.

నా రాకను గమనించి గబగబా గ్లాస్ డోర్స్ వద్దకు వచ్చిన ఓ సేల్సుమెన్ ఓ డోర్ తీసి పట్టుకున్నాడు. అతని వినయం చూస్తూ ఉంటే నవ్వు వచ్చేస్తున్నా పైకి కన్పించకుండా జాగ్రత్తపడ్డాను.

స్వాతంత్ర్యం సిద్ధించి అరవై ఏడు సంవత్సరాలు దాటిపోయినా ఆంగ్లేయుల ద్వారా మనలో ఏర్పడిన భయంతో కూడిన బానిస మనస్తత్వం, ఆత్మన్యూనతా భావాలు ఇంకా సమిసిపోలేదు నిజానికి. చేతులు కట్టుకుని జవాబులు చెప్పే ఆఫీసు జవానులు, కారు ఆపగానే చప్పున దిగేసి వెనుక డోరు తీసి పట్టుకునే డ్రయివర్లు, వినయంగా తలుపులు తీసి పట్టుకునే దర్వానులు, అధికారులు వస్తే చేసే పనిని ఆపేసి సీట్లోంచి లేచి నిలబడే గుమస్తా తదితర ఉద్యోగులు... ఇలా ఎందరో మన దేశంలో... అందుకే కొన్ని దేశాలలోని కంపెనీల వారు భారతదేశం నుండీ వచ్చేవారికి ఉద్యోగాలు ఇవ్వడానికి సంతోషంగా ఇష్టపడ్తారట. బానిస మనస్తత్వం కలిగి ఉండే మనుషులైతే వినయంగా, శ్రద్ధగా, నమ్మకంగా విధులు నిర్వహించగలరనే ఆలోచనలు వారివి.

డోర్ తెరచి పెట్టుకున్నతని వైపు చూసి, "థాంక్యూ" అన్నాను.

అతడు ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.

సెక్షన్ ఇన్స్‌పెక్ట్ చేస్తున్న వాడిలా అటూ, ఇటూ చూస్తూ ముందుకు నడిచాను.

ఆమె సమీపానికి చేరువవగానే నా గుండె లయ తప్పింది.

సందేహం లేదు... ఆమే! ఆ అందగత్తే!! ఆ అందాన్ని కళ్ళతో ఆస్వాదించాలని భావనా నగర్‌లో ఎన్ని సార్లు తిరగలేదు... ఆమె దర్శన భాగ్యం లభ్యం కాకపోయినా!

దాదాపు పదిహేనేళ్ళు గడిచిపోయినా ఆమె అందం చెక్కు చెదరలేదు. తన శరీరాకృతిని, ఆరోగ్యాన్ని, సౌందర్యాన్ని చాలా చక్కగా, జాగ్రత్తగా, సిస్టమాటిక్‌గా మెయిన్ టెయిన్ చేసుకు వస్తుండాలి తను.

బ్రహ్మదేవుడు మైక్రా మీటరుతో కొలతలు పెట్టి తయారు చేసినట్లున్న తన ఒంపు సొంపులనూ, రవివర్మ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని అరుణారుణ కాంతులతో మెరిసేలా రంగు లద్దినట్లున్న చర్మ సౌందర్యపు తళుకులను, నంబర్ వన్ మాడల్‌ల తలదన్నేటట్లు మెరుస్తున్న తన మేని ఒంపు సొంపుల నిగారింపులనూ చకచకా పరిశీలించేశాను... క్రొత్తగా!

ఎక్కడా, ఏ కాస్తయినా తేడా లేకుండా... పదిహేనేళ్ళ క్రితం ఎలా ఉందో... అచ్చు అలాగే ఉండగలగడం అద్భుతం... ఆశ్చర్యకరం!

వాస్తవానికయితే ఆమె వల్లనే నేడు నేనింత వాడ్నయ్యాను!

ఆమె పట్ల నేనా కృతజ్ఞతను తప్పక కలిగి ఉండాలి!!

నెమ్మదిగా ఆమె పరిశీలిస్తున్న వాషింగ్ మిషన్ వద్దకు వెళ్ళాను.

ఆ మిషను తాలూకు మంచి చెడ్డలను గొప్పగా వివరిస్తున్నాడు సేల్సుమెన్.

"ఎక్స్క్యూజ్‌మీ మేడం!" అన్నాను చొరవ తీసుకుని.

"ఎస్!" అందామె నా వైపు తిరుగుతూ.

"ఆ ఎదురుగా ఉన్న మూడవ నెంబరు స్టేజి మీద లేటెస్టు మోడల్ మిషను ఉంది. వెళ్ళి పరిశీలించండి. మీ ఇంటికి తగిన వాషింగ్ మిషన్ అది!" అన్నాను.

నాకేసి ఓమారు పరీక్షగా చూసి ఆపై నేను చూపించిన మిషన్ వైపు చూసింది ఆమె.

ఆమె ఏ కాస్తయినా నన్ను గుర్తించినట్లు లేదు.

అయినా ఎలా గుర్తించగలుగుతుంది?

అప్పట్లో... మెకానిక్ యూనిఫాంలో ఉన్న నేనెక్కడ??

ఇప్పుడు... విలువైన దుస్తులు ఖరీదైన కళ్ళజోడు. అత్యంత ఖరీదైన బూట్లు ధరించి తళతళా మెరిసిపోతున్న నేనెక్కడ??

"ఖరీదు బాగా ఎక్కువేమో?"– అందామె యధాలాపంగా.

"ఖరీదు ఎక్కువయినా డిస్కవుంట్ ఇస్తాం!" అన్నాను.

సేల్సుమెన్, అప్పుడే అక్కడికి వచ్చిన నా అసిస్టెంట్ రాజన్ ఇద్దరూ తెల్లబోయారు... ఎందుకంటే నేను చూపించిన మిషన్‌కి ఎలాంటి డిస్కౌంట్లూ లేవు నిజానికి.

నేనామాట అనగానే ఆమె థర్డ్ స్టేజి కేసి నడచింది.

సేల్సుమెన్, నా అసిస్టెంటు ఇద్దరూ ఆమెను అనుసరించాక చివరగా నేను నెమ్మదిగా అడుగులేశాను అటుకేసి.

నేనక్కడే ఉండడం వల్ల సేల్స్‌మెన్, నా అసిస్టెంటు... ఇద్దరూ కూడా వంతుల వారీగా ఆ మెషిన్ గుణగణాలను, ప్రత్యేకతలను చకచకా వివరించారు మరింత జాగ్రత్తగా. వారి వివరణ అంతా అయ్యాక నేనన్నాను...

"ఈ మిషన్‌లోని మరో ప్రత్యేకత ఏమిటంటే మేడం, ఈ మిషన్‌కు ఏడు సంవత్సరాల వారంటీ ఉంటుంది. కనీసం ఐదు సంవత్సరాల పాటు మీరు మిషన్ మీద కంప్లెయింటు చెయ్యడం, మా మెకానిక్ మీ ఇంటికి వచ్చి బాగుచెయ్యడం లాంటి సమస్యలు ఉండవు!"

ఆనందాశ్చర్యాలతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. అయినా అప్పటికీ ఆమె నన్ను గుర్తించలేక పోయింది.

చాలా అందమైన పెద్ద పెద్ద కళ్ళు ఆమెవి... ఏ కాస్త భావుకత తెలిసినవాడయినా ఆ కళ్ళమీదోసారి ముద్దులు కురిపిస్తే బావుండునని భావిస్తాడు.

"దీని ఖరీదెంత?" ప్రశ్నించింది ఆమె.

చెప్పాడు సేల్స్‌మెన్.

"డిస్కవుంటు ఎంత ఇస్తారు?"

సేల్సుమెన్ ప్రశ్నార్థకంగా నా అసిస్టెంటు కేసి చూశాడు. అతడేమో నాకేసి...

"ట్వెంటీ ఫైవ్ పర్సెంట్ డిస్కవుంట్" అన్నాను.

ఆశ్చర్యంతో తబ్బిబ్బయి పోతూ ఒకరి ముఖం మరొకరు చూచుకున్నారు... నా అసిస్టెంటూ, సేల్సుమెన్ కలసి. ఎందుకంటే ట్వంటీ ఫైవ్ పర్సెంటు డిస్కౌంటు ఇచ్చేస్తే ఆ మెషిన్ యొక్క ప్రిన్సిపుల్ కూడా లభ్యం కానట్లే!

ఆమె ఆనందంగా ఓ.కే. చేసేసింది.

సేల్సుమేన్ ఆమెను తీసుకుని క్యాష్ కౌంటర్ వైపు వెళ్ళాడు.

"మిస్టర్ రాజన్! ఏస్ ఎ స్పెషల్ కేస్ ఈ ఒక్క మిషనుకు మాత్రం పాతిక శాతం డిస్కౌంటుతో ఏడు సంవత్సరాల వారంటీ ఇవ్వండి. తరువాత ఎవరైనా అడిగితే డిస్కౌంటుస్కీం ముగిసిపోయిందని చెప్పండి. ఈ మిషన్‌ను మన వెహికల్‌లోనే ఆమె ఇంటికి పంపించండి. భావనానగర్, చర్చి రోడ్‌లో నెంబరు 211 ఇల్లు ఆమెది. మన మెకానికల్ ఎక్స్‌పర్టును పంపించి వాళ్ళింట్లో ఎలక్ట్రిక్ పాయింటు. ఎర్త్‌వైర్ అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో చెక్‌చేసి రమ్మనండి. నేనన్నట్లు కనీసం ఐదు సంవత్సరాలపాటు ఆ మెషిన్ కంప్లెయింటు లేకుండా పనిచేయాలి! అదే మనకు లభించగల చాలా పెద్ద ఫ్రీ అడ్వర్‌టైజుమెంటు కావాలి... లాంగ్ ప్రాసెస్‌లో!" అన్నాను.

ఏదియేమయినా నా అసిస్టెంటు మాత్రం ఆశ్చర్యం నుండీ తేరుకోలేక పోతున్నాడు. నేనెప్పుడూ ఏ కస్టమర్ పట్లా అంత ఎక్కువ శ్రద్ధ చూపలేదు.

ఆ సాయంకాలం బిల్ బుక్స్ తెప్పించుకుని ఆమె తాలూకు బిల్ నెంబరు 27116ను నా డైరీలో నోట్ చేసుకుని చిరునామా చూశాను. అదే చిరునామా... భావనానగర్ చర్చి రోడ్, నెం. 211.

'థాంక్ గాడ్!' అనుకున్నాను.

నా ప్రస్థానం ప్రారంభమవడానికి అంకుర్పాణ జరిగింది అక్కడే!

✶ ✶ ✶

ఆరు నెలలు గడచిపోయాయి.

నా అసిస్టెంటును పిలచి, "ఒక ప్రకటన తయారు చెయ్యండి!" అన్నాను.

"చెప్పండి సర్!" అన్నాడు రైటింగ్ ప్యాడ్ అందుకుని.

"గత పధ్నాలుగు సంవత్సరాలుగా ఘటోత్కచపురం పట్టణానికి, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలకు విశ్వాస పాత్రంగా గృహోపకరణ వస్తువులను అందిస్తూ ప్రఖ్యాతి గాంచిన సుగాత్రి హోంనీడ్స్ త్వరలో పదిహేనవయేట అడుగిడబోతున్నది. ఆ శుభసందర్భాన్ని పురస్కరించుకుని, మా కంపెనీ ప్రారంభం నుండీ నేటీ వరకూ కూడా మా వద్ద గృహోపకరణాలు కొనుగోలు చేసిన వారి యొక్క బిల్ నెంబర్లనన్నింటినీ

ఉపయోగించి లాటరీ ద్వారా ఒక కస్టమర్‌ను ఎన్నిక చేయడం జరిగింది. డ్రాలో ఎన్నికయిన నెంబరు 27116. ఎన్నికయిన వారి పేరు శ్రీమతి సుచిత్ర. భావనా నగర్‌కు చెందిన చర్చి రోడ్ యందలి నెం. 211 నివాసి వారు. త్వరలో జరగబోయే సుగాత్రి హోంనీడ్స్ వారి ఫంక్షన్‌లో లక్ష రూపాయల నగదు, శాలువ, జ్ఞాపికలతో వారిని సన్మానించడం జరుగుతుంది. మా కస్టమర్లే మా దేవుళ్ళని తెలుపడానికి ఆనందిస్తున్నాం. వారిని గౌరవించడం మా విధి. యధావిధిగా సుగాత్రి హోంనీడ్స్ సేవలను అందరూ వినియోగించుకోవాలని అభ్యర్థిస్తున్నాము.

నమస్సులతో!<br>
భవదీయుడు,<br>
రాజారావు(ప్రొప్రయిటర్)

నేను చెప్పడం ముగించాను.

నా అసిస్టెంటు వ్రాయడం ముగించాడు... కానీ పెన్‌కు క్యాప్ పెట్టి ప్యాడ్ కవర్ మడచాలనేది మరచిపోయాడు. పైగా తెరచిన నోరు తెరచినట్లే ఉండగా నాకేసి కన్నార్పకుండా చూశాడు అర నిముషం పాటు.

"మిష్టర్ రాజన్, ఎక్కడున్నారు?" అన్నాను నవ్వి.

అప్పుడు అతనిలో కదలిక... అతనికి నా వద్ద చనువు ఎక్కువే...

"సార్, మీ చర్యలు చిత్ర విచిత్రంగా ఉంటాయి!" అని అనేశాడు.

నేను మరోసారి నవ్వి ఊరుకున్నాను.

* * *

తొమ్మిది ప్రధాన తెలుగు దినపత్రికలలో ఆ ప్రకటన వెలువడిన నాటి ఉదయం పది గంటలకు మరో స్త్రీతో కలసి మా షోరూంకు వచ్చేసింది ఆమె.

పద్దెనిమిదేళ్ళ యువతిలా ముస్తాబయి కళకళలాడూతూ తళతళ మెరసిపోతోంది తను. వచ్చిన ఇద్దరూ అందంలో పోటీపడ్తున్నా, నిజం చెప్పాలంటే మా షోరూంలో అందరి చూపులూ ఆమె మీదికే వెళ్తున్నాయి.

"థాంక్యూ సార్! ఇంత పెద్ద బహుమతి నాకు లభ్యమయ్యాక ఫోన్‌లో కృతజ్ఞతలు చెప్పడం బావుండదని అన్పించింది. అందుకే నేరుగా వచ్చాను!" అందామె మనోహరంగా నవ్వుతూ.

అప్పటికీ ఆమె నన్ను గుర్తించలేదని గ్రహించాను.

నిజానికీ నాక్కావాల్సిందీ అదే!

నేను చెప్పక మునుపే కూల్ డ్రింక్స్ తెప్పించాడు రాజన్.

"మీ టేస్ట్ అప్రిషియేట్ చెయ్యతగ్గది సార్!" అన్నాడు వాళ్ళు వెళ్ళిపోయాక.

"ఎలా?" అన్నాను ఆశ్చర్యంగా.

"షి ఈజ్ వెరి బ్యూటీ సర్!" అనేశాడు చనువుగా.

"నా శ్రీమతి సుగాత్రి కన్నానా?" అన్నాను.

రాజన్ అవాక్కయిపోయాడు.

"మరో మాట రాజన్... అందమైన ప్రతి స్త్రీ... అందమైన మనసునూ కలిగి ఉండకపోవచ్చు!" అన్నాను.

✶ ✶ ✶

"ఫంక్షన్ రాత్రి ఏడు గంటలకు పెట్టుకుందాం సార్!" అన్నాడు రాజన్.

"బావుంటుంది కానీ మనకు లాస్ జరుగుతుంది కద!" అన్నాను.

"ఏమిట్సార్ అది?"

"పత్రికా విలేకరులందరూ చాలా బిజీగా వార్తలు పంపే సమయం అది. ఆ సమయంలో అయితే ముఖ్యమైన వాళ్ళు హాజరు కాలేకపోవచ్చు. ఒక వేళ హాజరయినా చివరి వరకూ ఉండలేరు. వాళ్ళు అరాకొరగా వ్రాసుకు వెళ్ళి పంపించే న్యూస్ కూడా ఒక్కోసారి వాళ్ళ పేపర్లలో రాకపోవడం కూడా కద్దు!" అన్నాను.

"కరక్టె సార్!" అన్నాడు రాజన్ ఆలోచనగా.

"అందుకే ఉదయం పదిన్నరకు ఫంక్షన్ ప్రారంభించి పండ్రెండున్నరకు ముగిద్దాం. ఆ వెంటనే లంచ్ ప్రారంభిస్తే బావుంటుంది. పత్రికా విలేఖరులను ప్రత్యేకంగా ఆహ్వానిద్దాం. మన న్యూస్ ఐటం మరునాడు అన్ని పేపర్లలో పోటోలతో సహా వస్తుంది. అది మనకు పెద్ద అడ్వర్‌టైజుమెంటవుతుంది కదా?" అన్నాను.

✶ ✶ ✶

నేతాజీ ఫంక్షన్ హాల్‌లో రంగ రంగ వైభవంగా ప్రారంభమైంది మా కార్యక్రమం. చీప్ గెస్ట్‌గా వచ్చిన వ్యాపారదిగ్గజం మధుమూర్తి చేతుల మీదుగా సుచిత్రకు లక్షరూపాయల నగదు అందివ్వబడింది. నా శ్రీమతి సుగాత్రి షాల్ కప్పి, పూలహారం వేసి, మెమొంటో అందివ్వడం అద్భుతమైన సుందర దృశ్యం.

ఇద్దరు గొప్ప అందగత్తెలు పోటీ పడ్తున్నట్లుంది స్టేజ్‌మీద. ప్రెస్‌వాళ్ళ కెమేరాలు సెల్ ఫోనులు పదే పదే క్లిక్ అవుతున్నాయి.

"రేపు అన్ని పేపర్లలో మన ప్రోగ్రాం హైలెట్ అవుతుంది. సార్... మీరన్నట్లు మన షోరూంకు గొప్ప ప్రచారం!" అన్నాడు రాజన్.

లంచ్ ముగిశాక ముఖ్యఅతిథి శెలవు తీసుకున్నాడు. సుచిత్ర, సుగాత్రిలు సంభాషించుకుంటూ తమ భోజనాలు కానిచ్చిన తరువాత, సుచిత్రను, ఆమెతో వచ్చిన వాళ్ళను ఇళ్ళవద్ద దింపి రమ్మని కార్లు పంపించాను. కార్లు తిరిగి రాగానే సుగాత్రి ఇంటికి వెళ్ళిపోయింది – నా తల్లిదండ్రులనూ, పిల్లల్నీ, చెల్లినీ, బావమరిదినీ తీసుకుని.

వచ్చిన వారందరూ భోజనాలు ముగించుకుని వెళ్ళిపోయాక చిట్ట చివర్న నేనూ, రాజన్ లంచ్ ముగించుకుని ఫంక్షన్ హాలువెనుకనున్న చిన్న లాన్‌లో రిలాక్సుడుగా కూర్చున్నాము.

"సార్ మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలని ఉంది!" అన్నాడు రాజన్ స్వీట్ బీడా నములుతూ.

"అడుగు" అన్నాను.

"తీరా అడిగేశాక నన్ను ఉద్యోగంలోంచి తీసేస్తారేమోననే భయం కూడా ఉంది సార్!"

"నిన్ను పంపించేస్తే నీకన్నా మంచి నమ్మకస్తుడు నాకు దొరకడుకద రాజన్!" అన్నాను నవ్వేసి.

"కానీ..." అంటూ నీళ్ళు నమిలాడు రాజన్.

"కానీ లేదు, అర్ధణా లేదు, అణా లేదు, బేడ అంతకన్నా లేదు. అవన్నీ కాలంతో పాటు మారిపోయాయి. మనమూ మారిపోయాము... నిన్ను ఉద్యోగంలోంచీ తీసెయ్యలేనన్నాను కదా... కానిచ్చెయ్!" అన్నాను నవ్వుతూనే.

"సార్, మీరిచ్చిన చనువును దుర్వినియోగ పరిస్తే వెయ్యి క్షమాపణలు ముందుగానే చెప్తున్నాను సార్!"

"ఓ.కే. అలాగే... ఇహ అడిగెయ్యి... కొంపదీసి నన్ను కడిగేస్తావా ఏమిటి?"

"ఎంత మాట సార్... నేననుకుంటున్నది ఏమిటంటే సుచిత్ర గారికి లాటరీ పేరిట బహుమతివ్వడం, సన్మానించడం... ఇదంతా కేవలం మన షోరూం ప్రచారం కోసమే అంటే నాకు నమ్మబుద్ధి కావడంలేదు సార్!" అన్నాడు రాజన్. అనేశాక భయంగా చూశాడు నాకేసి.

"అఫ్‌కోర్స్ రాజన్! నీ అనుమానంలో కొంత వాస్తవం ఉంది!" అన్నాను నవ్వుతూనే.

"అయితే మీరు ఆమెను గతంలో గాఢంగా ప్రేమించారా సార్?" అనేసి నాలిక్కరచుకున్నాడు రాజన్.

"నా బొంద! నేను ఆమెను చూసినప్పటికే ఆమెకు వివాహం అయిపోయింది!"

నేనలా అనగానే కళ్ళు పెద్దవి చేసి నోరు తెరిచేశాడు రాజన్.

"అయితే... మీకూ, ఆమెకూ మధ్య ఏ విషయమూ లేదన్నమాట.. ఆమె వాలకమూ అలాగే ఉందిలే!" అన్నాడు అరనిముషం తరువాత నిరుత్సాహంగా.

"మా ఇద్దరి మధ్యా విషయమైతే ఉంది... కానీ... ఆమెకు తెలియదు! అంతే!!"

ఈ పర్యాయం నాలుగైదు నిముషాలు అవాక్కయిపోయాడు రాజన్. అంతసేపూ అతని నోరు తెరచుకునే ఉంది. ఆపై తేరుకుని అన్నాడు దీనంగా...

"సార్, అసలే అర్భకుడ్ని, ఆపై గయ్యాళి భార్యా బాధితుడ్ని... ఏదో మీరిచ్చే జీతం బొటాబొటీగా సరిపోతూండడం వల్ల బతుకు బండిని ఈడ్చుకుపోతున్న సామాన్యుణ్ణి. నన్నిన్ని తిప్పలు పెట్టి, నా హృదయ స్పందనను ఆపేస్తూ, పరుగులు పెట్టిస్తూ నడిపించడం ధర్మమా సార్!?"

నాకు జాలేసింది. నిజానికి రాజన్ నిజాయితీపరుడైన ఒక మంచి మనిషి. అతనికి చెప్పినంత మాత్రాన చెవిదాటే ప్రమాదం ఉండదు. అందుకే అతని ఆసక్తికి నవ్వుకుంటూ చెప్పడం మొదలు పెట్టాను.

* * *

చాలా ఏళ్ళనాటి మాట... నెలకు నాలుగు వందలు జీతం, వారానికి అరవయి రూపాయలు పెట్రోలు అలవెన్సు... మోటారు సైకిలుంటేనే ఉద్యోగం అన్న కండిషన్ ఉండడం వల్ల మా నాన్నగారు వాడకుండా మూలపెట్టేసి ఉండిన వారి జకోస్లోవేకియా మేడ్ – 1964 మాడల్‌జావా మోటారు సైకిలును నేనే చేతనయినకాడికి బాగుచేసుకుని దాని మీద వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్న రోజులు.

ఓ రోజు నేను పనిచేస్తున్న కంపెనీకి వాషింగ్ మిషన్ కొనడానికి వచ్చింది. ఆమె. వీనెక్ జాకెట్ ధరించి, కాళ్ళకు కట్‌షూ వేసుకుని ఉండడం వల్ల కన్నెపిల్లలాగే కన్పించింది.

నిజం చెప్పొద్దూ... తొలిచూపులోనే ప్రేమించేశాను తనని. ఆ రాత్రంతా కలలలో వీరవిహారం చేశాను తనతో ప్రేమలో!

అదృష్టవశాత్తు ఆమె కొన్న మిషన్‌ను డెలివరీ ఇచ్చి కనెక్షన్ ఇచ్చి రావడానికి నన్నే పంపారు మరునాడు - భవానీ నగర్, చర్చి రోడ్ నెంబరు 211 ఇంటికి... అప్పుడు చూశాను –ఆ పిడికెడు నడుం వయ్యారి భామ మెడలో ఆమె శరీర కాంతి ముందు వెలవెలబోతున్న మంగళ సూత్రాన్ని, కాళ్ళలో మెట్టెలను.

నిజంగా షాక్ నాకు. విషాద బాధను భరించడం కష్టమైంది. ఎలాగో మిషన్ కనెక్షన్ ఇచ్చేసి, ఎలా ఉపయోగించాల్సిందీ ఎక్స్‌ప్లెయిన్ చేసి భారంగా తిరిగి వచ్చేశాను.

ఆ రోజుల్లో మా కంపెనీ మూడు ఫ్రీ సర్వీసింగులు ఇచ్చేది. ఆమె ఇల్లు మరీ దూరమవడం వల్ల ఇతర మెకానిక్కులు ఇష్టపడకపోవడంతో కనెక్షన్ ఇచ్చి వచ్చిన నేనే ఫ్రీ సర్వీసింగ్సుకు అటెండ్ కావాల్సి వచ్చింది.

వెళ్ళిన ప్రతిసారీ ఆమె అందం, నా భగ్నప్రేమ నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి. నేను రాక్షసుడ్నయి ఉంటే ఎంత బావుండును? ఆమెను ఎత్తుకుని ఏ అడవులలోకో వెళ్ళిపోయి ఉండేవాణ్ణి కద? అని అన్పించేది. ఏమయితే అదయింది... ఆమె నడుం చుట్టూ చేతిని పోనిచ్చి ఒక లాగు లాక్కుని సుతిమెత్తని ఆమె బుగ్గ మీద, నక్షత్రాల్లా మెరుస్తున్న ఆ కళ్ళ మీద ముచ్చటగా మూడు ముద్దులు పెట్టేస్తే పోయె! అని బలంగా అన్పించింది.

'ఏం? మహా అయితే మూడు నెలలో, ఆరు నెలలో జైల్లో పెడ్తారు... అంతే కద?' అంటూ  రెచ్చగొట్టిన బుద్ధిని అదుపులో పెట్టింది వివేకం.

జబ్బు పడ్డ నా తండ్రి, కుట్టుమిషన్‌తో కుస్తీపడ్తూ సంసారం గుట్టుగా ఈడ్చుకొస్తున్న తల్లి, చదువుకుంటున్న తమ్ముడు, పెళ్ళికావాల్సిన చెల్లి... కళ్ళ ముందు కదలి నా కాంక్షను కంట్రోలు చెయ్యగలిగారు.

వాళ్ళ మిషన్ తాలూకు ఫ్రీ సర్వీసింగులు అయిపోయాక కూడా... ఎప్పుడైనా ఆ వైపు వెళ్ళాల్సి వస్తే ఆ వీధి వైపుకు అప్రయత్నంగా కదలిపోయేది నా బైక్ అయితే ఆమె తటస్థ పడ్తే కళ్ళచూడాలనే ఆశ నెరవేరేది కాదు.

చాలా రోజులు గడిచిపోయాయి...

ఓ రోజు భవానీ నగర్ చర్చి రోడ్ నెం.211 నుండీ కంప్లెయింటు... మెషిన్ పనిచెయ్యడం లేదని... నేను వెళ్ళకూడదనుకున్నాను. కారణం మా నాన్నగారు ఆస్పత్రిలో ఉన్నారు... జేబుల్లో డబ్బు లేదు... ఎవరినైనా మిత్రులను కలుసుకుని అప్పు సంపాదించాలి... అదీ పరిస్థితి!

అయినా వెళ్ళక తప్పలేదు.

ఆమె లక్కీ... ఎందుకంటే గ్యారంటీ పిరియడ్ ఇంకా ఒక్కనెల రోజులు మాత్రమే మిగిలుంది. మిషన్‌లో ఖరీదైన పార్టులే దెబ్బతిన్నాయి. అన్నీ ఉచితంగా వెయ్యాల్సిందే నెల దాటి వుంటే ఆమె చాలా బిల్లు చెల్లించాల్సి వచ్చేది!

దెబ్బతిన్న పార్టులు తీసుకువెళ్ళి గ్యారంటీ కార్డుతో ఫ్రీ ఎంట్రీ చేయించి కొత్త పార్టులు తీసుకుని కంపెనీ నుండీ ఆమె ఇంటికి వచ్చాను.

మిషన్ బాగా సెట్ చేశాను కొత్త పార్టులతో... కానీ నో యూస్... రొటేటర్ పనిచెయ్యలేదు. మళ్ళీ మిషన్ ఓపన్‌చేసి రొటేటర్‌ను విప్పదీసుకుని మళ్ళీ కంపెనీకి వెళ్ళి గ్యారంటీ కార్డు మీదే ఎంట్రీ వేయించి రీప్లేస్‌మెంట్ క్రింద రోటేటర్ తీసుకుని మళ్ళీ ఆమె ఇంటికి వెళ్తుంటే నా జావాలో పెట్రోలు అయిపోయింది. డబ్బు లేదు. జావాను ఫుట్‌రెస్టు మీద పూర్తిగా నేలమీదకు వాల్చి ట్యాంకు చివరి పెట్రోలు అందేలా చేసుకుని ఎలాగో ఆమె ఇల్లు చేరుకున్నాను.

పనిలో పడితే అన్నీ మరచిపోతాను నేను! సాయంత్రం నాలుగయ్యేసరికి సరికొత్తగా మిషన్ రడీ అయింది. ఓసారి ట్రయల్ చూడమన్నాను... గ్రాండ్ సక్సస్!

ఇహ అప్పుడు గుర్తుకు వచ్చింది పెట్రోలు లేని విషయం.

ఇల్లు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది... అయినా ఇంట్లో డబ్బు లేదు. కంపెనీ ఐదు కిలోమీటర్లు... ఆరు గంటలలోగా వర్కుషీటుతో కంపెనీలో రిపోర్టు చేయాలి.

"ఏమండీ, నా బైక్‌లో పెట్రోలు అయిపోయింది...జేబులో డబ్బు లేదు. ఇల్లు దూరం.. కంపెనీ ఇంకా దూరం...ఓ ముప్పయి రూపాయలు అప్పుగా ఇస్తారా? మళ్ళీ ఇటువైపు వచ్చినప్పుడు ఇచ్చి వెళ్తాను!" అన్నాను అభ్యర్థనగా.

అందమైన ఆమె ముఖం అరక్షణంలో కందగడ్డలా మారి పోయింది.

"ఏం తమాషాగా ఉందా? ఈ రకంగా మామూళ్ళు పుచ్చుకుంటారా? జీతాలు తీసుకుంటారు కద? మీ కంపెనీకి కంప్లెయింటు ఇస్తాను!" అని అందామె కోపంగా.

నేను అవాక్కయిపోయాను. ఎర్రటి ఎండలో రెండు పర్యాయాలు స్పేర్స్ కోసం ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంపెనీకి వెళ్ళి వచ్చినందున పెట్రోలు అయిపోయిందని వాస్తవాన్ని వివరించాను. దాంతో మరింత రెచ్చిపోయింది ఆమె.

గాయపడిన మనసుతో తల వంచుకుని వెలుపలికి వచ్చేసి టూల్‌కిట్ సైదు బాక్సులో ఉంచుకుని జావాను నెట్టుకుంటూ బయల్దేరాను.

ఉదయం ఎప్పుడో తిన్న అన్నం... కడుపులో ఆకలి మంట... బండిని నెట్టుకు వెళ్తున్న శ్రమకన్నా పెళ్ళయిన ప్రియురాలి తాలూకు కాఠిన్య ప్రవర్తన ఎక్కువ బాధిస్తోంది మనసును. అక్కడ ఆస్పత్రిలో నాన్నగారి పరిస్థితి ఏమిటో నన్న భయం.

"రాజారావుగారూ!"

బండిని నెట్టుకుంటూ దిగులుగా, భారంగా అడుగులేస్తున్న నేను కాస్తా ఉలికిపడి ఆగాను.

నన్ను పలకరించింది తమ కాంపౌండు గోడ మీద వాలిన మల్లె తీగలలోంచీ మొగ్గలు కోసుకుంటుండిన ఓ యువతి! గతంలో ఆ ఇంటిలో కూడా మా కంపెనీ వాషింగ్‌మిషన్ కనక్షన్ ఇచ్చి ఆ తరువాత రెండు పర్యాయాలు ఫ్రీ సర్వీసింగులకు కూడా అటెండ్ అయివుండినాను. అయితే ఆ అమ్మాయి నా పేరు గుర్తుంచకోవడమే కాక దారిన పోతున్న నన్ను ధైర్యంగా పలకరించడం మాత్రం గొప్ప విషయమే నిజానికి..

"ఎందుకండీ బైక్ నెట్టుకుంటూ వెళ్తున్నారు? రిపేరీ వచ్చిందా?" అని మళ్ళీ తనే ప్రశ్నించింది.

"లేదండీ... పెట్రోలు అయిపోయింది. అర లీటరు పెట్రోలు వేయించు కోవడానికైనా జేబులో పదిహేను రూపాయలు లేవు! అందుకే..." అంటూనే బైక్‌కు సైడ్ స్టాండు వేసి నిలబెట్టి జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాను.

"అయ్యో, అలాగా... ఉండండి నేను డబ్బు తెచ్చి ఇస్తాను. మీకు వీలైనప్పుడు తెచ్చి ఇద్దురు గానీ!" అంటూ ఇంట్లోకి వెళ్ళిన ఆమె ఓ ఏభయి రూపాయల నోటు, ఓ పెద్ద గ్లాసు నీళ్ళతో తిరిగి వచ్చింది.

అప్పుడు చూశాను... కాదు చూడగలిగాను ఆమె ఎంత అందంగా ఉందో!

ఆ ఇంట్లో మిషన్ సెట్ చేసినప్పుడు కానీ, ఫ్రీ సర్వీస్ చెయ్యడానికి వచ్చినప్పుడు కానీ నేనామె సౌందర్యాన్ని గుర్తించలేకపోయాను... నా మనసంతా పెళ్ళయిన సుచిత్ర రూపమే నిండి ఉండడం వల్ల.

ఆ రోజే... అప్పుడే... ఆ కొత్త దేవతకు వివాహం కాలేదనే విషయాన్ని నిర్ధారించుకో గలిగాను పాదాల నుండీ మెడ వరకూ కళ్ళారా పరిశోధన జరిపి.

* * *

నన్ను తిట్టడమేకాక ఫోను మీద మా కంపెనీకి నేను ముప్పయి రూపాయలు లంచం అడిగినట్లుగా కంప్లెయింటు కూడా చేసింది ఆమె.

మా కంపెనీ మేనేజరు ఓ జడ పదార్థం. నా వర్షన్ సరిగ్గా విన్పించుకోలేదు. ఇక ఏం అర్థం చేసుకుంటాడు?

మేనేజింగ్ డైరెక్టరుకు కంప్లెయింటు చేశాడు! వాళ్ళరూల్సు వాళ్ళవి!!

ఆ మరునాటి మధ్యాహ్నానికి నాకు రావాల్సిన జీతం, నా సెక్యూరిటీ డిపాజిట్టు మొదలైనవన్నీ అందించి ఇక ఇంటికి వెళ్ళమన్నారు.

నన్ను వాళ్ళు ఉద్యోగంలోంచీ తీసెయ్యడమూ మంచిదయింది ఒక విధంగా.

మా నాన్నగారు కోలుకోవడానికి దాదాపు నెల రోజులు పట్టింది. కంపెనీ వాళ్ళు నాకు ఇచ్చిన పంపిన చివరి జీత భత్యాలు మొదలైనవి అప్పుడు ఆదుకున్నాయి... అదృష్టం... ఆరోగ్యం పుంజుకునే ఇల్లు చేరారు మా నాన్నగారు.

నేను మరో ఉద్యోగం కోసం ప్రయత్నించకుండా అక్కడా ఇక్కడా పార్ట్‌టైం పనులు చేయసాగాను. అదే ఒకరకంగా మేలనిపించసాగింది.

మా అమ్మ మళ్ళీ కుట్టు మిషన్ మీద కూర్చుంది. మా నాన్నగారికి మా ఇంటి సమీపంలోనే ఉన్న ఓ లాడ్జిలో మేనేజరుగా చిన్న ఉద్యోగం లభ్యమైంది.

బ్రతుకు బండి మళ్ళీ గాట్లో పడుతోండగా నన్ను ఉద్యోగంలోంచీ తొలగించిన కంపెనీ నుండీనే నాకు కబురు వచ్చింది.

మళ్ళీ డ్యూటీలో చేరమన్నాడు మేనేజరు.

“ముప్పయి రూపాయలు లంచం అడిగాననే కారణం మీద నన్ను తొలగించారు మీరు. ఈ రోజు నేను పనిలో చేరుతాను. కొద్ది నెలల తరువాత ఇంకో కారణంతో తీసి వెయ్యరని గ్యారంటీ ఏమిటి?” అని ప్రశ్నించి తిరిగి వచ్చేశాను.

ఆ మరునాడు మళ్ళీ మేనేజింగ్ డైరెక్టరు నుండీ కబురు వచ్చింది. ఇష్టం లేక పోయినా వెళ్ళాను.

“ఆనాటి నీ వాస్తవిక పరిస్థితిని అవగాహన చేసుకున్నాము. అందుకే రెండు వందలు జీతం ఎక్కువ చేస్తాం. పెట్రోలు అలవెన్సు కూడా నెలకు రెండు వందలు

ఎక్కువగా ఇస్తాం. దసరాకు ఒక నెల జీతం బోనస్. ఈ రోజే జాయిన్ అయిపో!" అన్నాడు ఆయన.

మనసు ఆనంద పడిపోయింది... కానీ...

'నీ బుర్రలో సాంకేతిక విద్య నిక్షిప్తం అయివుంది. దాన్ని ఉపయోగించే నేర్పు నీ చేతులలో ఉంది. నిన్ను తొలగించిన తరువాతగానీ ఆ విషయం అవగతం కాలేదు వీరికి. నీవు వీరి వద్ద పనిచెయ్యడంకన్నా స్వేచ్ఛగా పార్ట్ టైం పనులు చేసుకున్నా వీరు ఇస్తామంటున్న దానికన్నా ఎక్కువగానే సంపాదించుకోగలనేమో నీవు!' అంటూ వివేకం హెచ్చరించింది.

"ఆలోచించుకుని వస్తాను" అని చెప్పి వెనుదిరిగాను.

ఆపై కూడా ఐదారుసార్లు కంపెనీ నుండీ పిలుపు వచ్చింది. దాంతో నాలో ఆత్మవిశ్వాసం రెట్టింపయింది.

పాతికమంది బంధుమిత్రులు చుట్టూ ఓపికగా తిరిగి ఒక్కొకరి వద్ద వెయ్యి రూపాయల చొప్పున అప్పు తెచ్చుకుని పాతిక వేల పెట్టుబడితో "రాజారాం హోం నీడ్ సర్వీస్ సెంటర్' ప్రారంభించాను.

* * *

పెళ్ళయిన సుచిత్ర రూపం మనసులోంచి చెదిరిపోసాగింది. ఆ స్థానాన్ని పెళ్ళికాని సుగాత్రి రూపం ఆక్రమించు కుంటోంది!

అందమైన రూపమే కాదు... అమూల్యమైన మనసున్న సుగాత్రి నాకన్నా బాగా ఎక్కువగా చదువుకున్న యువతి. గుణంలోనే కాక కులంలో కూడా ఆమె ఓ మెట్టు పై నున్నది పైగా కస్త కలిగిన కుటుంబం.

ఆమెను అందుకోవాలంటే ఆర్థికంగా పుంజుకోవాలి. నేను సర్వీస్ సెంటర్ పెట్టిన వేళావిశేషం బాగుంది. చేతులనిండా పని... చేసే కొద్దీ రాబడి... నా ఆర్థిక స్థితి పుంజుకోవడం మొదలైంది. జావా ఇంటి వరండాకే పరిమితమైంది. ఖరీదైన రాయల్ ఎన్‌ఫీల్డు చేతికొచ్చింది.

అదృష్టవశాత్తు ఓనాడు గుడి మెట్లు మీద తారసపడింది సుగాత్రి.

"సుగాత్రిగారూ! మీ స్థాయికి నేను ఎదగడానికి నాకింకా ఒకటి రెండేండ్లు పడ్తుంది. అంతవరకూ నాకు అవకాశం ఇవ్వండి!" అని అభ్యర్థించాను.

అయోమయంగా చూసింది ఆమె.

"మీ మనసులో ఇతరులెవరూ లేకుండా ఉంటే ఒకటి రెండేండ్లు వివాహం చేసుకోకుండా ఆగండి ప్లీజ్!" అని చెప్పేసి ఆమెకు అర్థం అయ్యేలోపే పారిపోయాను భయంతో.

నేను భయపడ్డట్లుగా ఏమీ జరగలేదు!

రెండేండ్లు కాదు... మూడున్నర సంవత్సరాలు ఆగింది ఆమె!!

నేను కూడా మా పెళ్ళయిన తరువాతే... సుగాత్రి సన్నని నడుం చుట్టూ చెయ్యి పోనిచ్చి చప్పున లాక్కుని నున్నటి ఆమె చెంప మీద, మెరుస్తున్న కళ్ళ మీద అంతులేని ప్రేమతో ముచ్చటగా మూడు తొలి ముద్దులు పెట్టడం.

* * *

నేను చెప్పడం ముగించాను.

"తరువాత కథంతా నాకు తెలుసు సార్... ఈ చిట్టచివరి అంకమేనాకు అర్థం కావడం లేదు!" అన్నాడు.

"ఏం అర్థం కాలేదు?"

"అదే అపకారికి ఉపకారము..."

"పిచ్చి రాజన్ ఆమె అపకారెలా అవుతుంది? ఆమె ఆనాడు ముప్పయి రూపాయలు అరువివ్వకుండా పోవడం వల్లనే కదా నాకు సుగాత్రి అందం, ఆత్మసౌందర్యం దృశ్యమానమవడానికి అవకాశం లభ్యమైంది. ఆమె కంప్లెయింటు చెయ్యడం వల్లనే కదా ఆ కంపెనీ వారు నన్ను తీసెయ్యడం–నా శక్తి, సామర్థ్యాలు వెలుగు చూడడం, ఒక్కో అడుగే వేసుకుంటూ నేనింతటి వాణ్ణి కావడం."

నా వివరణతో సంతృప్తి చెందలేదు రాజన్.

"అయినా అంత డబ్బు బహుమతిగా ఇవ్వాలా సార్?" అని ప్రశ్నించాడు.

"ఆమెకు చాలా అవసరం ఉంది రాజన్!"

"ఎలా?" అన్నాడు రాజన్ నిర్ఘాంతపోయి.

"నీకు గయ్యాళి భార్య ఉన్నట్లే ఆమెకు వివేకహీనుడయిన తకరారు భర్త ఉన్నాడు. నీ భార్య నీ మీద కేకలేస్తుంది తప్ప తనకు నీ మీద ప్రేమ లేకపోలేదు. నీకు ముత్యాల్లాంటి పిల్లల్ని కనిచ్చింది. నీ జీతంతోటే సంసారం సుఖప్రదంగా నెట్టుకొస్తోంది. నీకు రుచికరమైన టిఫిన్ పెట్టి, కమ్మటి కాఫీ ఇచ్చి డ్యూటీకి పంపుతుంది. మధ్యాహ్నం మంచి లంచ్ క్యారియర్లో పంపిస్తుంది. అయినా కూడా నీవు అసంతృప్తిలోనే ఉన్నావు.

ఆమె భర్తయితే ఆమెను తిడ్తాడు. తరచు చెయ్యిచేసుకుంటాడు. సంపాదన అంతా క్లబ్బులో పేకాటలకు, బార్లలో త్రాగుడుకు ఖర్చు పెడ్తాడు. ఆ అసంతృప్తి అంతర్గతంగా ఆమెలో ఎంత ఉందో? ఆ రిఫ్లెక్షనే ఆనాడు నా మీద అలా విరుచుకు పడడానికి, కంప్లెయింటు ఇవ్వడానికి కారణం అయివుండవచ్చు. అందువల్ల నాకు మేలే జరిగింది కదా? ఆ కృతజ్ఞత! అంతే... కాంక్ష మాత్రం కాదు!!

ప్రస్తుతం ఆమె తన ఇంట్లోనే చీరల వ్యాపారం పెట్టుకుని ఇల్లు నడుపుకొస్తున్నట్లు నాకు చాలా రోజుల క్రితమే తెలుసు. ఖరీదైన చీరలకు గంజిపెట్టి తోమివ్వడంలాంటి చిన్న చిన్న పనులు కూడా చేస్తూ నాలుగు డబ్బులు సంపాదించుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం మనమిచ్చిన ఈ మొత్తంలో తన చీరల వ్యాపారాన్ని మరి కాస్త అభివృద్ధి చేసుకుంటుంది. అందరూ బాగుండాలి కదా? ఏమంటావు?" అన్నాను.

రాజన్ అప్పటికి సంతృప్తి పడినట్లున్నాడు.

"రియల్లీ యూ ఆర్ గ్రేట్ సర్!" అన్నాడు.

మళ్ళీ ఏం గుర్తుకు వచ్చిందోయేమో–"సార్ ఈ శుభసందర్భంలో నాకు కాస్త జీతం పెంచితే బాగుండును!" అన్నాడు.

'అందరూ బాగుండాలి కద?' అన్న పాయింట్‌ను రాజన్ క్యాచ్ చెయ్యలేక పోయాడు.

చేసి ఉంటే... 'సార్ ఈ శుభసందర్భంలో మన స్టాఫ్ కందరికీ కాస్త జీతాలు పెంచితే బాగుండును!" అని అని వుండేవాడు బహుశా!!

***'జ్యోతి' రాఘవయ్యగారి స్మారక ఆహ్లాదకరపోటీలో బహుమతి పొందిన కథ***
***–రచన మాసపత్రిక, డిసెంబరు 2013***

✪

# అదేమిటో...?

నా చిన్నతనంలో నాకు కనిపించిన ప్రతి అమ్మాయీ...

పెద్దదయినా చిన్నదయినా బాగా అందంగానే ఉండేది!

అందుకే నేను చాలామందిని ప్రేమించాను!! నా దురదృష్టం...

నన్నెవరూ ప్రేమించలేదు! బహూశా నా ఆర్థిక పరిస్థితి, అంతంత మాత్రం చదువూ కారణాలు కావచ్చు. ఎట్టకేలకు ఎలాగో నాకూ పెళ్ళయింది. ఎగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన యువతి అయినా దిగువ మధ్యతరగతి వాడయిన నన్ను ఎంతగానో ప్రేమించింది... నా ఇంటిని స్వర్గంగా మార్చేసింది. అందువల్ల నేనూ ఆమెనే ప్రేమించగలిగాను. ఆపై! రత్నాలాంటి పిల్లలు కలిగారు మాకు.. పాప! బాబు!! నా బిడ్డలు పెరుగుతోంటే వారి పోలిక ఏదో ఒకటయినా నాకు కన్పించే ప్రతి అందమైన అమ్మాయిలోనూ దృశ్యమానమవసాగింది. మరో ఆలోచనకు అవకాశం లేకుండా!

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ఆపై ఏ యువతిని చూసినా వారిలో నా కుమార్తె కదలికలు కన్పిస్తున్నాయి. మొత్తానికి ఎలాగో తంటాలు పడి అమ్మాయి పెళ్ళి చేసి అత్తగారింటికి సగౌరవంగా పంపగలిగాను. ఇహ ఏ ఆడపిల్లను చూసినా ఆమెలో నా కోడలు కన్పించి "ఈ బిడ్డ నా కోడలైతే ఎంత బావుండును?" అని బలంగా అన్పించసాగింది. చివరికి ఆ ముచ్చటా తీరింది. నా ఇంట చిరు గృహలక్ష్మి ప్రవేశించింది. అదేమిటో...?... ఇప్పుడు ఏ స్త్రీ నా కంటబడినా తనలో నా తల్లి కన్పిస్తోంది! నన్నులాలించిన తల్లి.... పెంచి పెద్దచేసిన తల్లి... కష్టంలో సుఖంలో తోడుండి ధైర్యాన్నిచ్చిన తల్లి... వృద్ధాప్యంలో వుండీ నాకు జాగ్రత్తలు చెప్పిన తల్లి...

*– 'స్వప్న' మాసపత్రిక ఫిబ్రవరి – 2013*

✪

# శుభాకాంక్షలు

బూట్లచప్పుడు విని ఇన్‌స్పెక్టర్ విజయవర్మ తలఎత్తి చూసాడు. గదిలోకి ప్రవేశించిన సబ్‌ఇన్‌స్పెక్టర్ దయాకర్ అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్‌చేసి అన్నాడు...

"ఎవరో అమ్మాయి సర్! కాలేజి స్టూడెంటను కుంటాను... మిమ్మల్నే కలవాలంటోంది!"

"పిలిపించండి!" అన్నాడు విజయవర్మ తను చూస్తున్న ఫైలుమూసి టేబుల్‌మీద పెడ్తూ.

ఐదునిమిషాలు తరువాత ఆ గదిలోకి ఇరవయి రెండు సంవత్సరాల యువతి ప్రవేశించి, విజయవర్మకు నమస్కారం చేసింది. ఆమె కళ్లలో జంకు స్పష్టంగా కన్పిస్తోంది.

"క్షమించాలి సార్, ప్రొఫెసర్ సరళాదేవి గారు మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవమన్నారు... అందువల్ల..." అంటూ మధ్యలోనే మాటలు ఆపేసింది ఆమె.

"ఇట్సాల్‌రైట్... కూర్చోండి... కూర్చుని సావధానంగా చెప్పండి. మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు... మేమూ మీలాంటి మనుషులమే!" అన్నాడు వర్మ చిరునవ్వుతో.

అతని మాటలతో ధైర్యం పుంజుకున్న ఆ అమ్మాయి నెమ్మదిగా అతని ఎదుటనున్న కుర్చీలో కూర్చుంది.

'మా సబ్‌ఇన్‌స్పెక్టర్ కూడా ఈ గదిలో కుర్చోవచ్చా?' అంటూ శాంతంగా ప్రశ్నించాడు వర్మ చిరునవ్వుతో.

"మీ ఇష్టం సర్!" అంది ఆ అమ్మాయి తగ్గుస్వరంతో.

"కూర్చోండి దయాకర్!" అని వర్మ అనగానే ఆ అమ్మాయి ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్.

"మీరు చెప్పండి!" అన్నాడు వర్మ ఆ యువతిని ఉద్దేశించి.

"నా పేరు సరిత సార్. ఆర్నెల్లుగా సురేష్ అనే యువకుడు నావెంటబడ్తూ వేధిస్తున్నాడు. ఈ మధ్యనయితే అతని అరాచకం మరీ ఎక్కువయింది. ఈ విషయం మా ఇంట్లో తెలిస్తే నా చదువు మాన్పించేసి, ఇంట్లో కూర్చోబెట్టేస్తారు నన్ను. అందువల్ల

మావాళ్లకెవరికీ ఈ విషయం చెప్పలేకపోతున్నాను. ఇక ఆరు నెలలు చదివితే నా ఎం.యస్సీ. పూర్తయిపోతుంది. ఈ పరిస్థితుల్లో మీరే నాకు రక్షణ కల్పించాలి. అయితే ఈ విషయాలేవీ మావాళ్లకు తెలియకుండా ఉండాలి!" అంది కళ్లనీళ్లతో.

'ఆ సురేష్ ఎవరు?'

'అతడు మా యూనివర్సిటిలోనే ఎం.ఎ. ఫైనల్ చేస్తున్నాడు.'

'అతడు నిన్ను వేధిస్తున్నాడు అనేందుకు ఆధారం ఏదయినా ఉందా?'

'ఉంది సార్!' అంటూ తన వ్యానిటీ బ్యాగు తెరచి అందులోంచి ఓ కాగితం మడతను తీసి అందించింది సరిత.

ఆ కాగితాన్ని తెరచి అందులోని వాక్యాల్ని చదివాడు ఇన్‌స్పెక్టర్.

ఏయ్, సరితా!

ఆర్నెల్లుగా అందీ అందకుండా తప్పించుకు తిరుగుతున్నావు. మర్యాదగా నా దరికి వచ్చి నేను చెప్పినట్లు వింటే ఆపై నిన్ను పెళ్లి చేసుకుంటాను. వినలేదూ... నీఖర్మ... సుకుమారమైన నీ సుందర ముఖారవిందం నేను స్ప్రేచేసే ఆసిడ్‌తో కమిలిపోయి వికృతంగా మారిపోతుంది. ఆపై కుక్కలు కూడా నీవైపు కన్నెత్తిచూడవు.

నాతో ఆనంద మయమయిన జీవితం కావాలో లేక కురూపి ముఖంతో జీవచ్ఛవం లాంటి బ్రతుకు కావాలో త్వరగా తేల్చుకో!

**నీ సురేష్**

ఆ ఉత్తరం చదివాక అంతవరకూ చిరునవ్వు నవ్వుతుండిన విజయవర్మ ముఖంలో నవ్వు మాయమయింది. ఆ ఉత్తరాన్ని సబ్‌ఇన్‌స్పెక్టర్ దయాకర్‌కి అందించి అన్నాడు...

"సరితగారూ మీకొచ్చిన భయం ఏమీ లేదు... మీరు నిశ్చింతగా ఇంటికివెళ్లి నాలుగు రోజులు ఆగి రండి! ఈలోపు ఆ రాస్కెల్‌ని కొద్దిగా సరిచేసి రిజల్ట్ చెప్పగలం!" అన్నాడు విజయవర్మ.

"సార్ మళ్లీ మళ్లీ ఇక్కడికి రావాలంటే... నాకు నా కుటుంబపరంగా కొన్ని ఇబ్బందులున్నాయి!" అంది సందిగ్ధంగా సరిత.

"ఓ.కె. ఒక పనిచెయ్యండి... మీ సెల్ నెంబరు సబ్‌ఇన్‌స్పెక్టర్‌కి ఇవ్వండి!"

"క్షమించాలి సర్! నాకు సెల్‌ఫోను లేదు!" అంది సరిత.

"పోనీ మీ ఇంటి టెలిఫోన్ నెంబరు ఇవ్వండి!"

"మరోసారి క్షమాపణలు సార్... మా ఇంటికి టెలిఫోన్ కూడా లేదు!" ఆమె అలా అనగానే... అప్పుడు... చూసారు ఇన్‌స్పెక్టరూ, సబ్ ఇన్‌స్పెక్టరూ... ఇరువురూ ఒకేసారి పరీక్షగా సరితకేసి. ఆమె దుస్తులు పేదరికాన్ని సూచిస్తున్నాయి. చక్కటి అమ్మాయి కాబట్టి పరీక్షగా చూస్తే తప్ప ఆ విషయం తెలియడం లేదు.

"ఒక పనిచెయ్యండి సరితగారూ, దయాకర్ గారి సెల్‌నెంబరు ఇస్తారు మీకు. నాలుగు రోజుల తరువాత ఎక్కడ్నుండయినా ఫోన్ చెయ్యండి. ఆయన వివరంగా పరిస్థితి వివరిస్తారు. అంత దాకా ఈ ఉత్తరం మా వద్ద ఉండనివ్వండి!" అన్నాడు వర్మ.

"నాకేం భయం లేదు కదా సర్!" అంది ఆమె దిగులుగా చూస్తూ.

"ధైర్యంగా ఉండండి. మీ మీద ఈగను కూడా వాలనివ్వం" అన్నాడు దయాకర్ అనునయంగా.

ఆమె సెలవు తీసుకుని వెళ్లిపోయాక...

"సార్ జనరల్‌గా లోయర్ మిడిల్‌క్లాస్ కుటుంబాలకు చెందిన అమ్మాయిలమీదే లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతుంటాయి... నిర్భయ చట్టానికి సైతం వెరవకుండా! ఎందుకని?" ప్రశ్నించాడు దయాకర్ సంశయంగా.

"అప్పర్ క్లాస్ కుటుంబీకులకు సెల్ఫ్ ప్రొటెక్షన్ ఉంటుంది. అది లేనివాళ్లు అవసరమైతే డబ్బుతో కల్పించుకోగలుగుతారు. బిలోపావర్టీలైన్ కుటుంబాలలోని వ్యక్తులలో తెగింపు ఉంటుంది. అవసరమైనపుడు వారికి వారే రక్షణ కలిగించుకోగలరు, ఐక్యంగా పోరాడగలరు. ఒకరకంగా చెప్పాలంటే వారి పేదరికమే వారి బలం. అందువల్ల వారి అమ్మాయిలు తమ మీద దాడి లాంటిది ఏది జరిగినా భయపడిపోరు. ధైర్యంగా ప్రతిఘటిస్తారు. ఎదురు తిరిగి పోరాడగలరు కూడా! ఇక లోయర్ మిడిల్‌క్లాస్‌లోకి వస్తే... వారికి కూడా అప్పర్ మిడిల్‌క్లాస్‌వారి, హైక్లాస్ వారికి ఉన్నన్ని హంగులు, ఆర్భాటాలూ ఉంటాయి. ఒకవేళ లేకపోయినా అప్పో, సప్పో చేసి కల్పించుకోగల అవకాశాలు ఉంటాయి. అయితే అన్ని రకాలుగానూ ఇబ్బందిపడేది నిజమైన బడుగువారు వారే!

వారిలో వారికి వాస్తవానికి ఐక్యత తక్కువ, బలం తక్కువ, అందుకే వారి కుటుంబాలకు చెందిన అమ్మాయిలను వేధించడానికి సులభంగా సాహసిస్తారు దుర్మార్గులు" అన్నాడు విజయవర్మ.

* * *

వర్మ సూచనల మేరకు ఎస్.ఐ.దయాకర్ ఎ.ఎస్.ఐ. రామస్వామితో కలిసి ఆలోచించి "ఆల్వేజ్ మఫ్టీ" లోంచి ఇద్దరు గట్టివాళ్లను సెలెక్ట్ చేసారు. అరగంటలో అదర్ గెటప్‌కు మారిపోయారు వాళ్లిద్దరూ స్లైట్ మేకప్ ద్వారా.

వారిద్దరూ రంగంలోకి దిగగానే వెళ్లి సురేష్‌ని వంటరిగా పట్టుకుని ప్రక్కకు తీసుకువెళ్లారు.

"ఏమిటి? ఆసిడ్ స్ప్రేయర్ జేబులో పెట్టుకుని తిరుగుతున్నావట... వరంగల్ ఎన్‌కౌంటర్ గూర్చి తెలియదా?" అని ప్రశ్నించాడు ఒకతను. అప్పుడతను చూడడానికి పల్లెటూరు బైతులా కన్పిస్తున్నాడు.

"మీరెవరు?"

"నీ శ్రేయోభిలాషులంగానీ... అడిగిన దానికి జవాబు చెప్పు."

"ఆసిడ్ స్ప్రే ఎలా ఉంటుందో కూడా నాకు తెలియదు!"

"ఆహా! మరి ఇదేమిటి కన్నా?" అంటూ జేబులోంచి ఉత్తరాన్ని తీసి అందించాడు మరొకతను. అప్పుడుతడు చూడడానికి రిక్షాలాగే వ్యక్తిలా కన్పిస్తున్నాడు.

ఆ కాగితాన్ని విప్పి చూడగానే కొన్ని క్షణాలు అలజడి కన్పించింది సురేష్ కళ్లలో... కానీ వెంటనే సర్దుకున్నాడు.

"అసలీ సరిత ఎవరో కూడా నాకు తెలియదు!" అన్నాడు.

"తెలియకుండానే ఉత్తరం వ్రాసావా?"

"ఈ ఉత్తరం నేను వ్రాయలేదు... ఇదసలు నా చేత వ్రాతేకాదు...కావాలంటే నా హ్యాండ్ రైటింగ్ చెక్ చేయండి!"

రెండవతను తన జేబులోంచి డైరీ తీసి తెరచి అతనికి అందించి "దీని మీద వ్రాసిచూపు!" అన్నాడు.

"ఏం వ్రాయమంటారో మీరే చెప్పండి!" అన్నాడు సురేష్ ఆపై డైరీ అందించిన వ్యక్తి ఇచ్చిన డిక్టేషన్ నాలుగువాక్యాలను చకచకా వ్రాసాడు.

ఉత్తరంలోని చేతివ్రాత అతనిది కాదని తెలిపోయింది అక్కడికక్కడే. అందువల్ల తిరుగు ముఖం పట్టారు వారు నిశ్శబ్దంగా.

"మీరెవరో చెప్పండి... మీమీద కంప్లయింట్ చెయ్యాలి!" అన్నాడు సురేష్ కోపంగా.

"కంప్లెయింట్ ఎవరికి చేస్తావు? ఏమని?" రౌద్రంగా ప్రశ్నించాడు ఒకతను.

"ఎం.ఎల్.ఎ.కు చేస్తాను. ఆయన మాకు దగ్గర బంధువు... మీరు వచ్చి అనవసరంగా బెదిరిస్తున్నారని చెప్తాను!"

"అలాగా! నీవు పోలీసులకు కంప్లయింట్ చేస్తావని భయపడ్డాంలే...వెళ్లు... వెళ్లి శ్రేయోభిలాషులు వచ్చి బెదిరించి వెళ్లారని చెప్పు!" అన్నాడు డిక్టేషన్ ఇచ్చినతడు కోపాన్ని అణచుకుని.

✶ ✶ ✶

"సార్ ఉత్తరం వాడి చేతివ్రాతలో లేదు! కానీ వ్రాయించింది మాత్రం వాడే!"

"ఎలా చెప్పగలవు?" అన్నాడు విజయవర్మ వాళ్లు చెప్పింది విన్నాక.

"ఉత్తరాన్ని చూడగానే వాడి కళ్లలోని కదలిక చెప్పేసింది సార్. వాడు ఒక్కడేకాదు వాడికి సహకరించే వాళ్లు కూడా ఉన్నట్లున్నారు. వాడు చెప్తే ఇలాంటి ఉత్తరం వ్రాసిన వాళ్లు... రేపు వాడి కోరికమేరకు ఆసిడ్‌స్ప్రే సీసా లేదా కత్తో, సుత్తో అందించి ఆమె మీద దాడికి సహకరించడానికి వెనుకంజ వెయ్యరు!"

"నిజమే!" అన్నాడు విజయవర్మ.

అతడు పదిహేడు సంవత్సరాలపాటు మిలటరీ సర్వీసుచేసి డిశ్చార్జి అయివచ్చాక పోలీసు సర్వీసులో చేరినవాడు.

"వార్ వేరు... సివిల్ వార్స్ వేరు!" అనుకున్నాడు మనసులో. ఈ లోగా మఫ్టీ పోలీసు అందుకున్నాడు...

"సార్ ఇతనికి పొలిటికల్ ఇన్‌ఫ్లూయన్స్ కూడా బాగా ఉన్నట్లుంది. మొగ్గలోనే కట్టడి చెయ్యకపోతే ఇలాంటి వాళ్ల వల్ల ఇబ్బందే!"

"దయాకర్, విన్నారు కదా.... ఇప్పుడేంచేద్దామంటారు?" అన్నాడు విజయవర్మ నవ్వి.

"వాడ్ని పట్టుకువచ్చి కొంచెం సంస్కరించేదే మేలనిపిస్తోంది సార్!" అన్నాడు దయాకర్.

"పొలిటికల్ ప్రెషర్ రాకుండా జాగ్రత్త పడాలి కదా... కొంచెం ఓపిక పడదాం... అంతదాకా సాధారణ దుస్తుల్లో మనవాళ్లను వంతుల వారిగా నిఘా పెట్టించండి. అంతే కాదు వారి వెనుక మీరు ఉండి, తగిన సూచనలు ఇవ్వండి!" అన్నాడు వర్మ దూరం ఆలోచించి.

* * *

అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ చేసాడు దయాకర్ వర్మకు.

"ఇందాకా సరిత దగ్గర్నుంచి ఫోను వచ్చింది సార్. యూనివర్సిటీ క్యాంపస్‌లో వంటరిగా తటస్థపడినప్పుడు నానామాటలు అన్నాడట సురేష్. మూడు నాలుగు నెలల తరువాత తన సంగతి చూస్తానన్నాడట!"

"ఏం చేస్తాడట?"

"కళ్లు కూడా పోయేలా ఏదో చేస్తాడట! ఏ బంధువులను అడ్డు పెట్టుకుంటావో పెట్టుకో అన్నాడట. మనవాళ్లను ఆ అమ్మాయి బంధువులనుకున్నట్లున్నాడు!" అన్నాడు దయాకర్ నవ్వి.

"అదే మంచిది. మూడు నెలల వ్యవధిలో అంతా మరచిపోతారను కుంటున్నట్లున్నాడు. మొత్తానికి వాడు ప్రమాదకరమైనవాడే! ఎందుకయినా మంచిది మీరు వెళ్లి మఫ్టీలో సరితను కలిసి..." అంటూ కొన్ని సూచనలు అందించాడు వర్మ.

* * *

హుమయూన్ ఆప్టికల్స్ ఆ వూర్లోనే చాలా పెద్ద కళ్లద్దాల షోరూమ్. ఆ షోరూమ్‌లో మఫ్టీలో ఎదురుచూస్తున్న దయాకర్ రామస్వామిలను కలుసుకుంది సరిత.

"ఎందుకు సార్ నన్నిక్కడికి రమ్మని కబురుపెట్టారు?" అని ప్రశ్నించింది.

షోరూమ్‌లో ఇన్‌చార్జి దగ్గర అదివరకే సెలక్ట్‌చేసి ఉంచిన పెద్దసైజు కళ్లద్దాలు తీసి ఆమెకు అందించి... "వీటిని కళ్లకు పెట్టుకుని చూడండి!" అన్నాడు దయాకర్. ఆ కళ్లద్దాలు పెట్టుకుని అద్దంలో చూసుకుంది సరిత.

"అద్దాలయితే బాగానే ఉన్నాయి సార్, కానీ నా వయసే ఏడెనిమిది సంవత్సరాలు పెరిగి పోయినట్లు కన్పిస్తోంది నాకే!" అంది.

"దట్స్‌గుడ్! మస్తాన్‌భాయ్, ఈ అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉత్తరోత్రా ఈ అమ్మాయి కళ్లకేం ఇబ్బంది రాదుకదా?" అన్ని ప్రశ్నించాడు దయాకర్.

"జీరో గ్లాసెస్ సర్...రాత్రింబవళ్లు పెట్టుకున్నా కళ్లకేం కాదు! ఇంకా డస్ట్ పార్టికల్స్ నుంచి బోలెడు రక్షణ!" అన్నాడు షోరూమ్ ఇన్‌ఛార్జ్.

"చూడమ్మా... ఈ కళ్లద్దాల ధర నాలుగు వందల రూపాయలు. నీ దగ్గర డబ్బున్నప్పుడు తెచ్చి ఈ షోరూమ్‌లో ఇతనికి ఇవ్వు. తొందరేం లేదు... నీకు వీలయినప్పుడే తెచ్చి ఇవ్వవచ్చు. ఈరోజు నుంచి నీవు ఇంట్లో ఉన్నప్పుడు తప్ప...ఎక్కడికి వెళ్లినా వీటిని ధరించే వెళ్లాలి!"

"ఎందుకు సార్"!

"చెపుతాను...అలా వెళ్లి ఆ హొటల్‌లో కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం పదండి!"

ముగ్గురూ వెళ్లి దగ్గరలోనే వున్న హొటల్‌లోని ఫ్యామిలీ రూమ్‌లో కూర్చున్నారు.

తమకు రెండుకప్పులు టీ, సరితకు కాఫీ ఆర్డరిచ్చాక అన్నాడు దయాకర్...

"చూడమ్మా! నీ శత్రువు అతి తెలివైనవాడు. పైగా క్రూరమైన మనస్థత్వం కలవాడు. వాడు ఎప్పుడైనా ఎక్కడైనా దొంగదెబ్బతీసి నీమీద ఆసిడ్‌చల్లినా... లేదా మరేదైనా కెమికల్ స్ప్రే చేసినా నీ కళ్లకూ, ముఖంలో సింహభాగానికీ ఎలాంటి అపకారం జరగకుండా ఈ కళ్లద్దాలు కాపాడగలుగుతాయి. అందుకే ఇంట్లోవున్న సమయాలలో తప్ప తతిమ్మా అన్ని సమయాలలో వీటిని ధరించమంటున్నది. వీలయినంత వరకూ బయట తిరిగేటప్పుడు పలుచటి దుస్తులు కాకుండా కాస్త మందం దుస్తులు ధరించండి. ఒకవేళ ఆసిడ్ లాంటి దేదయినా మీదపడినా వాటి తీవ్రత మొదట దుస్తులు మీద ప్రభావం చూపడంవల్ల శరీరానికి జరిగే అపకారం బాగా తగ్గడానికి అవకాశం ఉంటుంది. కాస్త ఇబ్బందయినా మా సూచనలు పాటిస్తే చాలా మంచిది" అన్నాడు.

ఆమె అంగీకారంగా తలవూపింది.

"ఇకపోతే హేమంత్ కర్కరే కాలనీ తెలుసుకదా?"

"తెలుసు సార్...కొత్తగా వెలసిన కాలనీ అది!"

"వెరీగుడ్... ఆ కాలనీలో అశోక్ కామ్దేరోడ్ అని పెద్దరోడ్డు ఒకటుంది తెలుసా?"

"తెలీదు సార్!"

"తెలుసుకోవచ్చు... కొత్తగా బోర్డులు కూడా పెట్టారు... ఆ రోడ్లో విజయ సలార్కర్ లేన్ అని ఒక చిన్న రోడ్డు వుంది!"

"కనుక్కుంటాను సార్!"

"గుడ్... ఆ లైన్ ఏడవ నెంబరు ఇంటికి "సందీప్ ఉన్నికృష్ణన్ స్మారక భవనము" అని బోర్డు ఉంటుంది."

"ఆ! ఆ ఇంటిని గూర్చి మా యూనివర్సిటీలో ఎవరో చెప్తే విన్నాను సార్... ఎవరో పోలీసు అధికారిణి..."

"అవును శారదాదేవిగారని, రిటైర్డ్ ఐ.పి.ఎస్. పర్సన్ ఉంటారు ఆ ఇంట్లో. సాయంకాలం మూడు గంటల నుంచి ఆరు గంటలలోపు నీవు ఎప్పుడైనా వెళ్లవచ్చు. నీతోపాటు నీ స్నేహితురాళ్లను కూడా తీసుకువెళ్లవచ్చు. ఆ సమయంలో అక్కడ నీలాంటి ఆడపిల్లలకు నియుద్ధ నేర్పుతారు. నీవు తప్పకుండా అక్కడికి వెళ్లి నేర్చుకుంటే మంచిదని మా ఇన్స్పెక్టర్ విజయవర్మ చెప్పారు!"

"నియుద్ధ అంటే ఏమిటి సార్?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది ఆమె.

"నియుద్ధ అనే పదానికి అర్థాలు చాలానే ఉన్నాయి... సత్వర ఆత్మరక్షణ, ఎదురుదాడి, మెరుపువేగంతో మన మొదటిదెబ్బ, శక్తివంతమైన ప్రతిఘటన... ఇలా ఎన్నో అర్థాలున్నాయి... ఇంగ్లీషులో అయితే నియుద్ధను "ఆర్మ్‌లెస్ కాంబాట్" అంటారు. నెలరోజులపాటు వరుసగా వెళ్లగలిగితే నియుద్ధను మీరు పూర్తిగా నేర్చేసుకోవచ్చు. అలాగాక అప్పుడప్పుడూ వెళ్లి నా మూడు నాలుగు నెలల్లో పూర్తిగా నేర్చుకోవచ్చు. ఈ నియుద్ధ కరాటే, జూడో మొదలైన వాటికన్నా చాల శక్తివంతమైనది".

"తప్పకుండా నేర్చుకుంటాను సార్... కానీ వారి ఫీజు..." అంది సరిత సందిగ్ధంగా.

దయాకర్ నవ్వాడు. "శారదాదేవిగారు సామాజిక సేవగా స్త్రీలకు ఈ నియుద్ధను ఉచితంగా నేర్పుతున్నారు. మీరు ఎలాంటి ఫీజూ చెల్లించాల్సిన పనిలేదు... వెళ్లిన

ప్రతిరోజూ మీకు చాలా రుచికరమైన, శరీరానికి మంచి శక్తినివ్వగలిగిన రాగి, సుగంధ ద్రవ్యాల జావ ఓ పెద్ద గ్లాసుతో త్రాగించి మరీ పంపుతారు!" అన్నాడు నవ్వుతూ.

* * *

"సార్ మీ దయవల్ల, శారదాదేవిగారి పుణ్యాన సురేష్ కాదు కదా... అలాంటివారు నలుగురు వచ్చినా నేనొక్కదాన్నే ఎదుర్కోగల శక్తిని సంపాదించుకున్నాను ఈ ఐదు మాసాల్లోనూ. వాడు వచ్చి ఆసిడ్ సీసా తీసేలోపు ఒక్క తన్నుతో వాడి కథ ముగించి వాడి ఆసిడ్‌ని వాడి చేతులమీదే పొయ్యగల ఆత్మవిశ్వాసం కూడా ఏర్పడింది నాలో! కానీ ప్రమాదం మరో రకంగా కూడా వాడి నుంచి ఎదురవుతోంది సార్!" అంది సరిత.

"ఎలా?" అని ప్రశ్నించాడు విజయవర్మ.

"నాకు మావాళ్లు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. నా చదువయిపోయేలోగా వివాహం నిశ్చయించాలని వాళ్ల అభిమతం. అదెలాగో వాడికి తెలిసిపోయింది. అన్నీ చెడగొట్టి నాకు పెళ్లేకాకుండా చేసేస్తానని బెదిరిస్తున్నాడు."

"ఏ చేస్తాడట?"

"ఏదో చెప్పాడు... దాని భావం... నేను వృద్ధకన్యగానే జీవితం గడపాల్సి వస్తుందట కురూపిగా. వచ్చే నెల పదహారవ తేదీనాటికి నా ఫైనల్ ఎగ్జామ్స్ పూర్తయిపోతాయి. నేను బాగా ప్రిపేరవుతున్నాను కూడా... పరీక్షలయిపోయిన మరునాడే అంటే పదిహేడవ తేదీనాడు నాకు పెళ్లి చూపులు ఏర్పాటవుతున్నాయి. ఆ విషయం అయితే ఇప్పటికి అతనికి తెలియదు. తెలిస్తే ఏదయినా అఘాయిత్యం చేసి మా కుటుంబాన్ని అప్రతిష్టకు గురిచేస్తాడేమోనని భయంగా ఉంది సార్!" అందామె కాస్త దీనంగా.

"దయాకర్! పదిహేడవ తేదీకి చాలా సమయం ఉంది కాదా?"

"ఉంది సార్... ధారాళంగా సరిపోతుంది!"

"సరితా నువ్వెళ్ళమ్మా... నిశ్చింతగా వుండు కానయితే వచ్చే నెల పదిహేడవ తేదీనాడు మాత్రం రోజంతా ఇంట్లో ఉండిపోవాలి నీవు... ఇల్లు కదలి ఎక్కడికీ వెళ్లకూడదు!"

"ఆ రోజు నేను ఇంట్లోంచి వెలుపలకు వెళ్లాలన్నా మావాళ్లు కదలనివ్వరు సార్!"

“దట్స్‌గుడ్! నీవు నిశ్చింతగా వెళ్లమ్మా. నీకేం దిగులు లేదు...వాడేం చెయ్యలేడు!” అన్నాడు విజయవర్మ సరితకు ధైర్యాన్నిస్తూ.

“దయాకర్, ఒక లెటర్ డిక్టేట్ చేస్తా, వ్రాసుకో” అన్నాడు విజయవర్మ ఆమె వెళ్లిపోయాక.

“చెప్పండి సార్!”

“డియర్ సురేష్,

కట్నాలు, కానుకలు, కోరికల దెబ్బకు మా వాళ్ల కళ్లు తిరుగుతున్నాయి. వారు కోరుకున్న విధంగా నాకు పెళ్లి చేయలేరనే అన్పిస్తోంది నాకు. అందుకే బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను.

పదిహేడవ తేదీ సాయంకాలం ఐదు గంటలకు నీవు ఫారెస్టు డిపార్టుమెంటువారి పెద్దపార్కు చివరికి వస్తే మనం ఏకాంతంగా చర్చించుకుని ఒక నిర్ణయానికి వద్దాం. నా కండిషన్లకు నీవు ఒప్పుకోగలిగితే నీతో కలిసి నడవడానికి నేను అంగీకరించగలను.

ఇట్లు, సరిత.

“ఈ లెటర్‌ని ఒక కంప్యూటర్ ప్రింటవుట్ తీయించండి!” అంటూ కొన్ని విషయాలు డిస్కస్ చేసాడు విజయవర్మ.

ఆపై తన డైరీ తీసి టేబుల్‌మీద ఉంచుకుని టెలిఫోన్ దగ్గరకు తీసుకుని డైరీలో చూసి కొన్ని నెంబర్లకు ఫోనుచెయ్యడం మొదలు పెట్టాడు.

* * *

సాయంకాలం ఐదుగంటలు కావస్తోంది.

ఫారెస్టు డిపార్టుమెంటువారి పార్కు చివరి వరకూ నడిచాడు సురేష్. సరిత జాడ కన్పించలేదు.

చిట్టచివర సిమెంటు బెంచి మీద ఇద్దరు స్త్రీలు కూర్చుని మాట్లాడుకుంటుండడం కన్పించింది అతనికి.

వారి దగ్గరగా కాస్త ఆగి “ఏమండీ ఇటువైపు ఎవరైనా వెళ్లారా?” అని అడిగాడు చివరివైపు చేయిచూపుతూ.

“ఆ! ఎవరో ఒక అమ్మాయి వెళ్లింది!” అంది వారిలో ఒకామె.

సురేష్‌కి ఉత్సాహం ఎక్కువైంది. “సరిత తప్ప అంత చివరికి ఏకాంతం కోరుకుంటూ ఎవరు వెళ్తారు?” అని అనుకుంటూ చకచకా అటువైపు నడిచాడు.

దాదాపు పార్కు చివరకు చేరుకున్నాక అక్కడ ఓపెద్ద చెట్టుక్రింద సిమెంటు చప్టామీద కూర్చుని మాట్లాడుకుంటున్న మరో ఇద్దరు ఆడవాళ్లు కన్పించారు.

"ఏమండీ... ఇటుగా ఎవరైనా వెళ్లారా?" అని ప్రశ్నించాడు వారిని.

"బావుంది! ఇందాకా ఒకమ్మాయి వచ్చి ఇటుగా ఎవరైనా వెళ్లారా అని అడిగి ఇటే వెళ్లింది... ఇప్పుడు మీరొచ్చి అడుగుతున్నారు!" అంటూ ఒకామె అటువైపు చేయి చూపించింది.

ఆమె చేయి చూపించినవైపు కొద్ది దూరంలోనే పార్కు అంతమయి ఫారెస్టు ప్రాంతం ప్రారంభమవుతుంది. నిజానికి అటువైపు ఎవరూ వెళ్లరు.

"థాంక్యూ!" అనేసి చకచకా అటువైపు నడిచాడు సురేష్ అతని నడక చాలాదూరమే సాగింది.

పార్కు అంతమైంది. అడవి ప్రక్కగా పార్కు ఫెన్సింగ్ కన్పించింది. సరిత జాడలేదు! చివరికి విసుగ్గా వెనుతిరిగాడు సురేష్. మొట్టమొదట సిమెంటు బెంచిమీద కన్పించిన ఆడవాళ్లు అతనికి ఎదురొస్తూ కన్పించారు.

అతడు ఆశ్చర్యంలోంచి, తేరుకోకముందే అతని ముఖం పచ్చడయ్యేలా ఒక ముష్టిఘాతం తగిలింది.

ఒక స్త్రీ చేతిలో అంత బలం ఉంటుందని కాని, అంత దెబ్బ కొట్టగలదని కానీ అతనికి తెలియదు. కళ్లు తిరిగి క్రిందపడిన అతడు తేరుకునేసరికి అతనికి తనచుట్టూ తను అక్కడికి వస్తున్నప్పుడు చూసిన నలుగురు ఆడవాళ్లూ కన్పించారు... కన్పించడం కాదు... ఒళ్లు గుల్లయిపోయేలా తన్నడం మొదలుపెట్టారు.

అతను తేరుకుని ఓ పొలికేక పెట్టబోయేంతలో అతని నోట్లో ఓ గుడ్డముక్క కుక్కబడింది.

మరో పది తన్నులు తగలేసరికి శోషవచ్చి బోర్లపడిపోయాడు సురేష్. నేలకు అంటుకుపోయిన అతని రెండు చేతులమీద రెండు చెప్పుకాళ్లు తొక్కిపట్టుకున్నాయి బలంగా...

"ఈ చేతులతోటే కదరా ఆసిడ్ చల్లాలని అనుకుంటున్నావు?" అంటూ ముందుకు వంగింది ఓ స్త్రీ... ఆమె చేతిలో ఓ చిన్నసీసా...

పాపు నిముషం తేడాతో బోర్లా తిరిగివున్న అతని రెండు అరచేతులమీద ఏదో ద్రవంపడి పొంగడం మొదలుపెట్టింది. అప్పుడతడు పెట్టిన కేకకు అతని నోట్లో కుక్కబడ్డ గుడ్డముక్క ఊడిపడిపోయింది... అతని అరుపుతో ఆ ప్రదేశం ప్రతిధ్వనించింది.

పార్కులో ఎక్కడెక్కడో ఉండిన తోటమాలులు ఇద్దరు ముగ్గురు అతని అరుపులు వినపిస్తున్న చోటికి పరుగు పెట్టుకు రాసాగారు. అప్పటికే ఆ నలుగురు ఆడవాళ్లూ మెరుపువేగంతో ఆ ప్రదేశం నుంచి మాయమైపోయారు... అతని జేబులోని కాగితం లాక్కుని.

* * *

టెలిఫోన్ మ్రోగింది.

అప్పటికి ముప్పావు గంటకుపైగా సీట్లోంచి కదలకుండా కూర్చుని వున్న దయాకర్ రిసీవర్ అందుకున్నాడు.

"హల్లో" అన్నాడు.

"సార్ వన్‌టవున్ పోలీస్‌స్టేషనేనా సార్!" అన్నారు ఎవరో అవతలి నుంచి కంగారుగా.

"హలో... హలో...!" అన్నాడు దయాకర్.

"సార్... మేం ఫారెస్ట్ పార్కు దగ్గర్నుంచి మాట్లాడుతున్నాం... ఇక్కడ మా స్నేహితుడు సురేష్ మీద ఆసిడ్ దాడి జరిగింది... మీరు వెంటనే రావాలి..." అంటున్నాడు అవతలి వ్యక్తి.

"హలో... హలో...ఛ... ఈ ఫోను రింగయింది... వాయిస్ రావడం లేదు... హలో...హలో..." అన్నాడు విసుగ్గా దయాకర్.

"సార్ మీరు అత్యవసరంగా..."

"హలో... హలో... రామస్వామీ, అర్జంటుగా మీ సెల్‌లోంచి ఫోనుచేసి, ఫోను సరిగా పనిచేయడం లేదని కంప్లయింట్ ఇవ్వండి...మన ఫోన్ రింగవుతోంది గానీ అవతలి వాయిస్ రావడం లేదని చెప్పండి..." అంటూ ఫోన్ పెట్టేసాడు.

మళ్లీ ఫోన్ రింగయింది కానీ దయాకర్ ఫోన్ తీయలేదు. అలా రెండు మూడు పర్యాయాలు జరిగాక రిసీవరు అందుకున్నాడు.

"హల్లో... మేం టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ ఆపరేషన్స్ సెక్షన్ నుంచి మాట్లాడుతున్నాము... మా మాటలు మీకు వినపడ్తున్నాయా?"

"చక్కగా విన్పిస్తున్నాయండీ... థాంక్యూ!" అంటూ రిసీవర్ క్రెడిల్ చేసాడు. దయాకర్.

ఆ వెంటనే మళ్లీ ఫోన్ మ్రోగింది.

దయాకర్ మళ్లీ రిసీవర్ అందుకున్నాడు.

"హల్లో... టవున్ పోలీసు స్టేషనాండీ?"

"ఎస్... సబ్ ఇన్‌స్పెక్టర్ స్పీకింగ్!"

"సార్, నా పేరు శ్రీనాథ్. యూనివర్సిటీ స్టూడెంట్‌ని. నా మిత్రుడు సురేష్ మీద ఎవరో ఆడవాళ్లు దాడి చేసారు!"

"ఎక్కడ?"

"ఫారెస్ట్ పార్క్‌లో!"

"మీ మిత్రుడు ఆడవాళ్ల మీద ఎందుకు దాడి చేసాడయ్యా? అది చట్టరీత్యా నేరం. మేం చర్య తీసుకుంటాం!!"

"సార్, సార్... మావాడు ఆడవాళ్ల మీదదాడి చెయ్యడం కాదు సార్... ఆడవాళ్లే మా వాడిమీద దాడి చేసారు!"

"తమాషాగా వుందే! ఎందుకూ?"

"ఎందుకో తెలియదు సార్!"

"ఆడవాళ్లు దాడిచేసి కొట్టడం ఏమిటయ్యా? మీవాడికి దెబ్బలు తగిలాయా?"

"దెబ్బలు తగలడమే కాదు... చేతుల మీద ఆసిడ్ కూడా పోసారు!"

"చేతులమీద ఆసిడ్ పోసారా? వాళ్లని పట్టుకున్నారా?"

"లేదు సార్ అరచేతుల పైభాగాన చర్మం కాలిపోయింది. ఎముకలు కూడా కన్పిస్తున్నాయి. అర్జంటుగా రావాలి మీరు. పోతే ఆ ఆడవాళ్లు పారిపోయారు సార్!"

"అలాగా... మేం ఇప్పుడే వస్తున్నాం... నూట ఎనిమిది నెంబరు వాహనాన్ని కూడా పంపిస్తాం!"

"అవసరం లేదుసార్... ఆటో వచ్చింది... ఆస్పత్రికి తీసుకువెళ్తాము...మీరు మిషనాసుపత్రి వద్దకు వచ్చేయండి చాలు!"

"మిషనాసుపత్రికి తీసుకెళ్లకండి! ఆ ఆస్పత్రిలో ఈ కేసు అడ్మిట్ చేసుకోరు. ప్రభుత్వాసుపత్రికి తీసుకురండి. ఆలోగా మేమూ అక్కడికి చేరుకుంటాం!"

"అలాగే సార్!" అన్నాడు అవతలి వ్యక్తి.

* * *

అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ కొట్టారు విజయవర్మ, దయాకర్ కలిసి.

ఎం.ఎల్.ఎ. శంభులింగం వారి సెల్యూట్స్ నేమాత్రం పట్టించుకోకుండా, ప్రతిస్పందించకుండా విసుగ్గా చూసాడు వారికేసి.

"ఏంటయ్యా... మా బంధువుల అబ్బాయి మీద ఎవరో ఆడవాళ్లు దాడిచేసి, ఆసిడ్‌పోసి ఎనిమిది రోజులయింది... ఇంతవరకూ వారి ఆచూకీ అతీ గతీ లేదు!" అన్నాడు.

"చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం సార్!" అన్నాడు వర్మ.

"ఎవరో సరిత అనే అమ్మాయి చేయించిందని మావాడంటున్నాడు!"

"అతడేదో పొరపాటు పడ్డట్లున్నాడు సార్".

"ఎలా?"

"ఆ అబ్బాయి దాడికి గురయినరోజు ఆ అమ్మాయికి పెళ్లిచూపులు జరిగాయి. ఆమె ఇల్లువదిలి వెళ్లలేదని ఇరుగుపొరుగులు చెప్తున్నారు. ఆ అమ్మాయిని చూస్తే చాల అమాయకురాలిలా వుంది... అతడు ఎలా పొరబడ్డాడో? ఏమో?" అన్నాడు వర్మ.

"ఖచ్చితమేనా?"

"చాలా ఖచ్చితమైన కూపీ లాగాము సార్!" అన్నాడు దయాకర్.

"సరే మీరు వెళ్లండి. త్వరగా ఆ ఆడవాళ్లెవరో... వాళ్లని కనుక్కుని పట్టుకోండి!"

"యస్సార్!" అంటూ మళ్లీ అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ కొట్టారు ఇన్‌స్పెక్టర్, ఎస్.ఐ.

వాళ్లు వెళ్లిపోయిన తరువాత తన మనుషులకు కబురుపెట్టి పిలిపించాడు ఎం.ఎల్.ఎ.

"ఆ సరిత సంగతేమిటో కనుక్కోమన్నాను కదా?"

"కనుక్కున్నాము సార్, మన అబ్బాయి సురేష్ ఏదో పొరపాటు పడినట్లున్నాడు. ఆ అమ్మాయి చాలా మంచి కుటుంబానికి చెందిన అమాయకయువతి. ఈ నెలాఖర్లో ఆ అమ్మాయి పెళ్లి కూడా జరగబోతోంది... ఆ కుటుంబం వైపు వెళ్తే మన పార్టీకి కూడా బాగా నష్టం వస్తుంది నిజానికి!" అన్నాడు గ్రూపు లీడరు.

"వీడు చెడె గాడిద... చేసే తప్పులన్నీ చేసి చివర్న నింద ఏ అమాయకుడి మీదో వేయడం వీడికలవాటే... ఈసారి గట్టిగా మందలించాలి వాణ్ని... కాదు... వాడి నాన్నని!" అని సణుక్కున్నాడు శంభులింగం.

✶ ✶ ✶

హెడ్‌క్వార్టర్స్‌కి పంపల్సిన డిపార్టుమెంటు స్టాటిస్టిక్స్ చెక్ చేసుకుంటున్న విజయవర్మ బూట్లు చప్పుడుతో పాటు మరో అలికిడి కూడా విని తలపైకెత్తి చూసాడు.

దయాకర్ అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ చేస్తే అతనితోపాటు వచ్చిన సరిత చేతులు జోడించి నమస్కరించింది వర్మకు.

"ఏమిటమ్మా... మళ్లీ ఇలా వచ్చావు?" అన్నాడు వారికి ప్రతి నమస్కారాలు చేస్తూ.

"మీ మేలు మరచిపోలేను సార్! నా వివాహానికి తప్పక రావాలి మీరు!" అంటూ వెడ్డింగ్ ఇన్విటేషన్ అందించింది సరిత.

ఆమె మరోమారు కృతజ్ఞతలు తెలిపి సెలవు తీసుకుని వెళ్లిపోయాక అన్నాడు దయాకర్... "సార్, ఈ అమ్మాయి పెళ్లికి తప్పక వెళ్లాలి మనం!"

విజయవర్మ నవ్వేసాడు..."ఇంకా నయం... పెండ్లి బందోబస్తుకు వెళ్లాలన్నావు కాదు. మనం ఈ పెళ్లికి వెళ్తే, అది శంభులింగం గారి మనుషుల కళ్లబడ్తే మనల్ని అనుమానించే అవకాశం ఉంది కదా!" అన్నాడు.

దయాకర్ నాలిక్కరచుకుని అన్నాడు... "ఐయామ్ సారీ సర్!"

"ఇట్సాల్‌రైట్... నీ సంతృప్తి కోసం కొరియర్‌లోనో, పోస్టులోనో శుభాకాంక్షలు పంపుదాంలే!" అన్నాడు వర్మ నవ్వి.

*– కథాకేళి, మాసపత్రిక*

*మార్చి 2013*

✪

# ప్రవృత్తి

రాజారావుది జాలిగుండె!

తన చిన్నతనంలో.. 'అశోకుడు బాటల కిరువైపులా చెట్లు నాటించెను' అని చదువుకున్న పాఠం అతని మనసులో నాటుకుపోయింది. పైగా అలాంటి చెట్ల నీడలలోనే ప్రతిరోజూ రెండు మైళ్ళకు పైబడి నడచి వెళ్లి వస్తూ ప్రాథమిక, ఉన్నత, కళాశాలల విద్య వరుసగా ముగించిన వాడు. అందువల్లే అతనికి తిరగడం అన్నా, పచ్చని ప్రకృతి అన్నా చాలా యిష్టం.

చదువంటూ ముగిశాక అదృష్టవశాత్తు అతనికి దార్లు తిరిగే ఉద్యోగమే లభించింది. బస్సుల కోసమూ, రైళ్ల కోసమూ కాచుకుని వెంపర్లాడకుండా దర్జాగా ఊర్లకు వెళ్లి వచ్చేందుకు వీలుగా అతనికి వాళ్ళ కంపెనీ మోటారు సైకిలు శాంక్షన్ చేసి, పెట్రోలు అలవెన్సు మంజూరు చేసింది. అందువల్ల తిరగడానికి ఇష్టపడే అతడు ఆనందంగా తన విధులను సక్రమంగా, సమర్ధవంతంగా నిర్వర్తించడం మొదలు పెట్టాడు.

వారంలో కనీసం మూడు నాలుగు రోజులయినా అతడు జిల్లాలోని మధ్య తరగతి పట్టణాలకూ, మారుమూల గ్రామాలకూ కూడా వెళ్ళి రావాల్సి వచ్చేది.

కొన్ని దార్లలో అతని ప్రయాణం చాల ఆనందదాయకంగా, ఆహ్లాదకరంగా.. గతంలో తన చదువు తాలూకు రెండు మైళ్ళ నడకంత అద్భుతంగా సాగేది. ఆ దార్ల కిరువైపులా, పొడుగునా అశోకుడు నాటించిన చెట్ల లాంటి రకరకాల చెట్లుండడం, ముఖ్యంగా ఆకురాలు కాలమయ్యాక రకరకాల రంగులలో ఆకులు, పూలతో కనువిందు చేస్తూ కన్పిస్తుండడం, వేసవి వచ్చేశాక కూడా వాటి గుండా వచ్చే చల్లటి గాలులు అతనికి ఎంతో మానసిక ఉల్లాసాన్ని కలిగించడం అందుకు కారణాలయ్యేవి.

నాణేనికి బొమ్మా-బొరుసూ ఉన్నట్లే.. అతడు వెళ్ళే మరికొన్ని దారులలో కొన్నింటి కయితే రోడ్డు కిరువైపులా కిలోమీటర్ల తరబడి చెట్లు కాదు కదా, కనీసం కంప చెట్లయినా కన్పించేవి కావు. ఎండలు మండుతున్నప్పుడయితే ఆ దార్లమీద ఎగసిపడే సెగలకు, దుమ్ము పొగలకు తల్లడిల్లిపోవాల్సి వచ్చేది. ముక్కు రంధ్రాలయితే పగుల్లు బారినట్లయి పోయేవి. అలాంటి సమయాలలో అతనికి 'అశోకుడు' జ్ఞాపకానికి వచ్చేవాడు. పాలకులందరూ.. లేదూ... కనీసం పాలితులయినా అశోకుడిలా ఆలోచించ

గలిగే వారయితే ప్రకృతి పరమ ప్రశాంతంగా ఉండి, ప్రజలకు చల్లగా, ఆహ్లాదంగా, ఆనందదాయకంగా, కుదురుగా ఉండేది కదా?! అని అనుకునే వాడు.

ఇహ గతుకులూ, గోతులు వున్న రోడ్లమీద ప్రయాణించేటప్పుడయితే అతనికి రోడ్ల అతుకుపనులు (ప్యాచ్ వర్కు) పూర్తిగ మరచిపోయిన సాంకేతిక నిపుణుల (ఇంజనీయర్ల) మీద ఒళ్ళు మండి పోయేది. ప్రతి పనిలో లాభాల్ని ఆశిస్తూ రావడం ఎక్కువయిపోయాక చిన్నా చితకా పనులు చేయించే నిజాయితీ పరులైన ఉద్యోగులు కరువయిపోయారు. రాత్రికి రాత్రే పెద్దంత రోడ్డు రెన్యూవల్ చేయించి ప్రజాధనాన్ని దుర్వినియోగ పరచగలరు. కానీ చిన్నా చితకా పనులు చేయించరు అని అనుకుంటూ ఆ దుర్మార్గులను తిట్టుకుంటూ వెళ్ళేవాడు. ఒక్కోసారయితే "ప్రభూ ఈ ప్రపంచాన్ని మార్చు!.. దాన్ని ఈ దుర్మార్గులను సంస్కరించడంతో ప్రారంభించు!!" అని భగవంతున్ని ప్రార్థించే వాడు.

అతడు ఏ దారిన యే సమయంలో వెళ్తున్నా, ఎవరైనా తనను ఆపి అభ్యర్థిస్తే వారిని తప్పక తన వెనుక కూర్చోబెట్టుకుని తీసుకు వెళ్ళేవాడు.

ప్రతి దారికీ రెండు వైపులా పచ్చని చెట్లు ఉండితీరాలన్నది అతని కోరిక, కల! అరికాళ్ళూ, నడినెత్తి మాడకుండా మామూలు మనుషులు సైతం ఏ దారి మీదనయినా హాయిగా నడచి వెళ్లాలనేది అతని ఆకాంక్ష. ప్రకృతి సమతౌల్యానికి కూడా సహకారం అందగలదనే ఆలోచన కూడా!

* * *

ఆ రోజు ఆదివారం. అయినా అతడా అడవి దారిన అంకిపాటుమిట్టకేసి వెళ్ళి తీరాల్సిన పని పడింది. 'త్వరగా వెళ్ళి పనిముగించుకుని తిరిగి వచ్చేస్తే, భార్యా బిడ్డల్ని సినిమాకు తీసుకు వెళ్ళవచ్చు' అని అనుకుంటూ పెందలాడే బయల్దేరాడతడు.

నీరెండకు కరిగిపోతున్న మంచు తెరల మధ్యన అతనికి అడవి చాల అందంగా కన్పించి అద్భుతంగా అన్పించసాగింది. రోడ్డు వంపులకు ఇరువైపులా కన్పిస్తున్న చెట్ల ఇంపులనూ, ప్రకృతి కాంత తాలూకు పచ్చని సొంపుల అందాలనూ చూస్తూ కాస్త నెమ్మదిగా మోటారుసైకిల్ను పోనిస్తున్న అతన్ని ఒకచోట ఇద్దరు మనుషులు అభ్యర్థనగా చూస్తూ, వినయంగా ఆపారు.

"సార్, బస్ ఎంతకీ రావడంలేదు... అంకిపాడు మిట్టదాకా వస్తాము!" అన్నాడు ఒకతను.

"ఇద్దరున్నారే? ముగ్గురు వెళ్ళడం నేరం కద?" అన్నాడు రాజారావు సంశయంగా.

"సార్, ఆదివారం కద... అయినా ఈ అడవి మధ్యన ఎవరు చెక్ చేస్తారు? చాల జరూరు పనిసార్!" అన్నాడు రెండవతను కాస్త దీనంగా.

రాజారావు కరిగిపోయాడు. "సర్దుకుని కదలకుండా కూర్చోవాలి!" అన్నాడు తను కాస్త ముందుకు జరిగి పెట్రోల్ ట్యాంకుకు ఆనుకుని కూర్చుంటూ.

"అలాగే సర్!" అంటూ వాళ్ళిద్దరూ చకచకా చప్పున ఎక్కి సర్దుకుని కూర్చున్నారు.

ప్రకృతి అందాలను పరిశీలిస్తూనే మోటారు సైకిల్ను నెమ్మదిగా, జాగ్రత్తగా పోనివ్వసాగాడు రాజారావు.

పది నిముషాలు గడిచి ఉంటాయి....

హఠాత్తుగా ఏదోజరిగింది! ఏం జరిగిందో గ్రహించేలోపే ఎద్దు ముగదాడు లాంటి తాడు రాజారావు మెడకు ఉరిత్రాడులా కాస్త బిగుతుగా చుట్టుకుంది.

"రేయ్... బండిని పక్కకు తీసి ఆపరా!" అన్నాడు రాజారావు వెనుకనే కూర్చున్న మనిషి కరకుగా. అతని రెండు చేతుల్లో తన మెడకు చుట్టుకున్న తాడు తాలూకు రెండు కొసలూ ఉన్నాయని గ్రహించాడు.

అతడు కనుక తాడు బిగిస్తే తను ప్రమాదంలో పడడమో లేక మరణించడమో జరుగుతుందని భయపడిపోయాడు! "తాడు బిగుసుకుని తను బండితో సహా ఏ చెట్టుకో కొట్టుంటే వెనుకనున్న ఇద్దరికీ కూడా ప్రమాదమే కద?" అన్న ఆలోచన మాత్రం రాకపోయింది అతనికి.

అందువల్ల మోటారు సైకిల్ను రోడ్డు వారగా ఆపేశాడు.

వెనుక నుండీ వారిద్దరూ క్రిందికిదిగారు కానీ తన మెడకు బిగుసుకున్న తాడు కొసలు మాత్రం ఒకతని చేతుల్లో బిగుతుగానే సిద్ధంగా వుంది.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఇటూ, అటూ ఏదయినా వాహనం వస్తున్న జాడయినా లేదు.

"క్రిందికి దిగరా!" అన్నాడు ఒకతను. అతని స్వరం మహా కర్కశంగా ఉంది ఇప్పుడు.

సైడు స్టాండు వేసి క్రిందికి దిగాడు రాజారావు. ఆ చలిలో సైతం అతని వళ్ళంతా చమటలు పడుతున్నాయి. చేతివేళ్ళు పాదాలు కంపిస్తున్నాయి.

తాడు బిగించిన వాడు తాడు పట్టుకుని అలా నిలబడి ఉండగానే రెండవవాడు తన జేబులోంచీ మరోతాడు తీసి దాంతో రాజారావు చేతులను వెనక్కు తీసి నడుం మీదికి కట్టేశాడు. ఆపై ఇంకో జేబులోంచి ఓ వస్త్రాన్ని తీసి రాజారావు కళ్ళకు అడ్డుగా కట్టేశాడు చకచకా.

"భార్యబిడ్డలున్న వాణ్ణి. నేను మీకేం అపకారం చేశాను? నన్ను చంపకండి!" అన్నాడు రాజారావు దాదాపు ఏడ్చేస్తూ.

గంతలు కట్టినతడు మోటారు సైకిల్ను తన చేతుల్లోకి తీసుకున్నట్లుంది..

"రేయ్, బైక్ మీద కూర్చోరా!" అన్నాడు తాడు బిగించి పట్టుకున్నతను. తీవ్రమైన స్వరంతో... తాడు పట్టు కాస్తయినా సడల నివ్వకుండా.

చేతులు వెనక్కి కట్టి వుండడం వల్ల చాలా కష్టం మీద ఎలాగో ఎక్కి కూర్చున్నాడు రాజారావు. తాడు బిగించినతను అదే పట్టుతో వెనుక కూర్చున్నాడు.

మోటారు సైకిలు శరవేగంగా ముందుకు పోతుండగా శతవిధాల భయపడి పోతూ... "నన్నేం చెయ్యకండి.. బిడ్డలున్నవాడ్ని" అంటూ ఏడుస్తున్నాడు రాజారావు... కన్నీటితో కళ్ళగంతలు తడుస్తోండగా.

పది నిముషాల తరువాత... తారురోడ్డు వదిలి ఏదో కాలిదారిలోకి మోటారు సైకిలు తిరిగిందని గ్రహించాడు రాజారావు కుదుపులను బట్టి.

మరో ఐదారు నిముషాల తరువాత మోటారు సైకిలు ఆగింది.

ముగ్గురూ మోటారు సైకిలు మీదనుండీ క్రిందికి దిగేశాక...

"ఇప్పుడు తీరా నీ జేబుల్లో ఉన్నదంతా!" అన్నాడు మోటారు సైకిలు నడిపించినతను.

"ఎలా తీసేది?" అన్నాడు రాజారావు ఏడ్పుగొంతుతో.

"అవును కదూ..." అంటూ రాజారావు ప్యాంటు జేబులోంచి పర్సు, సెల్ఫోను తీసేసుకున్నాడు.

వాచీ, ఉంగరం ఊడలాక్కున్నాడు రెండవతను.

"పర్సులో ఎ.టి.ఎం. కార్డు ఉందే... నెంబరు చెప్పరా!" అన్నాడు నిముషం తరువాత మొదటి వ్యక్తి.

"వన్ టూ త్రీ ఫోర్." అన్నాడు రాజారావు ఏడ్పుగొంతుతో.

మరుక్షణం రాజారావు చెంప చెల్లుమంది.

"చంపేస్తా దొంగనా... అసలు నెంబరు చెప్పు" అన్నాడు తీవ్రస్వరంతో.

"నిజంగా నా ఎ.టి.ఎం. కార్డు నెంబరు అదేనయ్యా!" అన్నాడు రాజారావు ఏడ్చి మొత్తుకుంటూ.

కొద్ది నిముషాలలోనే అతని మెడకు ఉరిలా వున్న తాటిని దేనికో కట్టేశారు. రాజారావు ఏకాస్త, ఎటు కదిలినా బిగుసుకుంటోంది.

"ఒరేయి పోతున్నాము. ఎ.టి.ఎం. కార్డు నెంబరు తప్పయితే మళ్ళీ గంటలో వచ్చి నిన్ను చంపేసి వెళ్ళిపోతాము!" అన్నాడు అంతవరకూ తాడు పట్టుకున్న తను.

మరో రెండు నిముషాలలో మోటారు సైకిలు స్టార్టయి వెళ్ళిపోయిన శబ్దం విన్పించింది రాజారావుకు.

* * *

దాదాపు రెండు గంటల పాటు బాధతో, భయంతో నరకం అనుభవించాడు రాజారావు..." హెల్ప్! హెల్ప్!!" అని అరచి కేకలు పెడ్తూ.

ఫారెస్టు వారి కంట బడకుండా ఎండు కట్టెలు ఏరుకు పోవడానికి అడవిలోకి వచ్చిన పల్లెటూరు పిల్లలెవరో అతని అరుపులు విని వెతుక్కుంటూ వచ్చి అతని పరిస్థితి చూసి ఓ చెట్టు కొమ్మకు కట్టివున్న అతని మెడతాడును, చేతి కట్లను, కళ్ళ గంతలను విప్పదీశారు.

ఒక కుర్రవాడు పరుగు పెట్టుకు పోయి ఎక్కడ్నుండీనో ఓ ఆకు పొట్లంలో నీరు తెచ్చి రాజారావుకు తాగించాడు. దాంతో అతనికి కాస్త కంగారు, భయం తగ్గాయి.

ఆ కుర్రవాళ్ళే రాజారావును రోడ్డు మీదకు తీసుకు వస్తే, మోటారు సైకిలు మీద వెళ్తున్న ఓ యువకుడు రాజారావును తీసుకు వెళ్ళి అంకిపాడుమిట్ట పోలీసు స్టేషనుకు చేర్చాడు.

* * *

అంకిపాడుమిట్టలో ఉన్నది ఒకే ఒక ఎ.టి.ఎం. అందులోనే రాజారావు ఖాతాలో వున్న ముప్పయి అయిదువేలు డ్రా చేసుకున్నారు దొంగలిద్దరూ.. అదృష్టవశాత్తు ఆ ఆటోట్రాన్సక్షన్ మిషన్‌లో సి.సి. కెమెరా ఉండడం వల్ల వారిద్దరు వచ్చి డబ్బు డ్రా చెయ్యడం కాస్త స్పష్టంగానే రికార్డయింది. రాజారావు వారిని గుర్తించాడు కూడా.

పోలీసులు కూడా వారికోసం తీవ్రంగా ప్రయత్నించారు కానీ... ఆ దొంగలు దొరకలేదు. కనీసం మోటారు సైకిలు ఆచూకీ కూడా చిక్కలేదు.

"తన్నుమాలిన ధర్మాలకు పోకురా, అంటే వినవు!" అంటూ రాజారావుకు చీవాట్లు పెట్టారు బంధుమిత్రులు.

"నా తాళి గట్టిది, నా బిడ్డల అదృష్టం గొప్పది" అంటూ గుడిలో అభిషేకం చేయించి వచ్చి ఇంట్లో దేముడి గదిలో నేతి దీపాలు వెలిగించి, ప్రసాదాలు పంచింది అతని భార్య.

కంపెనీ మోటారుసైకిలు పోగొట్టినందుకు అతని జీతంలో కంతుల వారీగా దానికి సంబంధించిన కోత విధిస్తూ సరికొత్త మోటారు సైకిలును శాంక్షన్ చేసింది యాజమాన్యం.

ఆగని కాలచక్రం కదుల్తూనే వుంది. అయితే...

దాదాపు ఏడాదిపాటు దార్లో ఎవరాపినా, ఎక్కడ ఎవరు మండుటెండలో నడచి వెళ్తూ కన్పించినా కూడా పొరపాటున కూడా తన మోటారుసైకిలును ఆపలేదు రాజారావు.

* * *

ఆ రోజు.. ఎర్రటి ఎండలో.. ఎర్రకోట పల్లె నుండీ చెట్టనే మాట కన్పించని, పొగలు గక్కుతున్న రోడ్డుమీద ఉసూరుమంటూ వస్తున్నాడు రాజారావు తన బైక్‌మీద.

ఎవరో నడివయసు మనిషి... కాళ్ళకు చెప్పులు, తలమీద తుండు గుడ్డయినా లేకుండా అగ్నిగుండంలా వున్న రోడ్డుమీద నడచి వెళ్తూ కన్పించాడు.

"ఎటయినా పోనీ, ఎట్లయినా పోనీ.. ఛో!" అని మనసులోనే అనుకుంటూ అతన్ని దాటిపోయాడు రాజారావు.

కానీ... అతని మనస్సాక్షి ఊరుకోలేక పోయింది...

"ఎవరో పాపాత్ములు చేసిన పనికి ప్రతి మనిషినీ జీవితమంతా అనుమానిస్తూ బ్రతుకుతావా?" అంటూ నిలదీసింది.

అలా అన్పించడమే తడవు, బ్రేకు వేసి రోడ్డు వారగా నిలిపాడు రాజారావు తన బైక్‌ను.

ఎండన బడి వస్తున్న ఆ మనిషి తన దగ్గరగా రాగానే పరీక్షగా చూశాడు. దొంగ కుండాల్సిన లక్షణాలలో ఒక్కటయినా కన్పించలేదు ఆ మనిషిలో.

శరీరకష్టంతో రక్తాన్ని చమటగా మార్చి చిందిస్తే తప్ప బతుకుబండి నడవని బడుగు జీవిలా వున్నాడు.

"ఎక్కడికి పోవాలి?" అని అతన్ని ప్రశ్నించాడు రాజారావు.

"రామాపురం!" అన్నాడతడు కాస్త ఆగి.

"ఇంత ఎర్రటి ఎండలో పడి నడవక పోతే బస్‌లో పోవచ్చు కద?" అన్నాడు కాస్త కోపంగా రాజారావు.

"అర్రూపాయలుండిన టిక్కెట్టు ఎనిమిది జేసేశారు. అంత లెక్క దగ్గరుంటే నడిసెందుకు బోతాను సామీ?" అన్నాడు అతడు తన కుడిచేత్తో నుదిటిమీది చమటను విదిలించుకుంటూ.

రాజారావు మనసు మూలిగింది. హృదయం ద్రవించింది, గుండె ఘోషించింది, ఆత్మ పెద్ద స్పందనతో విలవిల లాడింది!

"కూర్చో నేనటువైపే వెళ్తున్నాను!" అన్నాడు రాజారావు.

"నాకు రాదు సామీ, నేనెప్పుడూ గుడుగుడు మోటారు మీద కూకోలేదు!" అన్నాడతడు.

నిర్ఘాంతపోయాడు రాజారావు.

వెనక సీట్లోకి ఎలా ఎక్కవలసిందీ, కదలకుండా కుదురుగా ఎలా కూర్చోవాల్సిందీ నెమ్మదిగా ఓపికగా తెలియజెప్పి అతన్ని తన మోటారు సైకిలు మీద కూర్చో బెట్టుకున్నాడు రాజారావు. ఆపై నెమ్మదిగా ముందుకు పోనిచ్చాడు.

పది నిముషాలు గడచివుంటాయి…

రాజారావు వెనుక… మోటారు సైకిలు మీద ఏదో చాల చిన్న చిరుకదలిక…

"నీవు, నీ పెండ్లాము, బిడ్డలు… నీ వంసమంతా నిండు నూరేండ్లూ సల్లగుంటారు సామీ!" అన్నాడు వెనకు కూర్చున్నతను ఆర్ద్రంగా… రెండు చేతులతో రాజారావును ఆశీర్వదిస్తూ…

*– ఆలోచించండి మాస పత్రిక ప్రత్యేక సంచిక*
*సెప్టెంబరు&అక్టోబరు–2013*

✪

# బదిలీ

## (హాస్యనాటిక)

*(ఆలోచించండి మాసప్రతిక జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు 2013 (ప్రత్యేక సంచిక)లలో చిరు ధారావాహిక నాటికగా ప్రచురితము)*

# బదిలీ (నాటిక)

| | | | |
|---|---|---|---|
| **1.** | **తిప్పయ్య** | **:** | యాభై సంవత్సరాలు దాటిన హెడ్ కానిస్టేబులు, మొదట యూనిఫామ్‌లో వుండి చివరన మఫ్టీ డ్రెస్‌లోకి మారుతాడు. |
| **2.** | **రాజారావు** | **:** | ముప్ఫై సంవత్సరాలు దాటిన పోలీసు. చివరి వరకూ యూనిఫామ్‌లోనే ఉంటాడు. |
| **3.** | **కనకలింగం** | **:** | ముప్ఫై నాలుగు సంవత్సరాలు దాటిన పోలీసు. మొదట్లో యూనిఫామ్‌లో ఉండి, చివరన మఫ్టీ డ్రెస్‌లోకి మారుతాడు. |
| **4.** | **సూర్యం** | **:** | పాతికేళ్ళ వయస్సుగల విద్యాధికుడైన పేద నిరుద్యోగ యువకుడు. |
| **5.** | **పేపరు బాయ్** | **:** | ఇరవై సంవత్సరాల పేపరు కుర్రవాడు. |
| **6.** | **చంగప్ప** | **:** | యాభై సంవత్సరాలు దాటిన పల్లెటూరిబైతు లాంటి అమాయక వ్యక్తి. **చుట్ట కాలుస్తాడు!!** |
| **7.** | **సురేష్** | **:** | ఇరవై సంవత్సరాల కాలేజీ విద్యార్థి. యన్.సి.సి. డ్రెస్‌లో ఉంటాడు. |
| **8.** | **స్టేషన్ రైటరు** | **:** | యాభై ఏళ్ళ వయస్సున్న పోలీసు స్టేషన్ రైటరు. కాకీ ప్యాంటుమీద స్లాగు ధరించివుంటాడు. |

# ముఖ్యగమనిక

వాస్తవానికి ఇది ఒక ఏకాంకిక. గోడగడియారంలో చెయ్యాల్సివచ్చే సమయ మార్పులకోసం తెరవేసి తీయాల్సిన ఐదు అంకములుగా వ్రాయబడినది. చాకచక్యంగా నాటికను నడపదలచుకున్నవారు లైట్లన్నింటినీ ఆర్పి తిరిగి లైట్లు వేసేలోపుగా గోడగడియారంలో మార్పులు చేసుకుని ఏకాంకికగానే ప్రదర్శించవచ్చును.

# మొదటి అంకం

తెర తీయగానే కన్పించే దృశ్యం: అది ఒక సాధారణ పోలీసు స్టేషన్‌లోని పోలీసుల గది......

ఎదుటి గోడమీద గాంధీ మహాత్ముని ఫోటో, దానిక్రింది పనిచేస్తున్న పాతకాలపు గోడగడియారం కన్పిస్తాయి. గడియారం పన్నెండు గంటలు చూపుతుంటుంది. గదిలోఎడంవైపు కాస్త మూలకు ఓ కుర్చీ, దానిముందో బల్లా ఉంటాయి.

యూనిఫాంలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ తిప్పయ్య ఆ బల్లమీద కాళ్ళు చాపుకుని కుర్చీలో కూర్చుని తల వేలాడేసి నిద్రపోతుంటాడు. బల్లమీద అతని కాళ్ళ ప్రక్కగా అతని టోపీ ఉంటుంది.

అతని బల్లకు ముందుప్రక్కనున్న చిన్న బెంచీ మీద కొన్ని పాత ఫైళ్ళు పేర్చబడివుంటాయి. గదిలో కుడివైపు ఓ ప్రక్కగా గన్‌స్టాండు, అందులో నాలుగు తుపాకులు నిలబెట్టబడి ఉంటాయి. ఫైళ్ళున్న బెంచీకి గన్‌స్టాండుకు మధ్యగా గోడకానుకుని ఓ భోషాణం పెట్టె దానిమీద నాలుగు పోలీసు టోపీలు, రెండు లాఠీలు, ఓ పేపర్ల కట్టా కన్పిస్తాయి. ఆ గదిలో ఓ ట్యూబులైటు, ఓ మామూలు బల్బు వెలుగుతుంటాయి. అది రాత్రి సమయమని తెలిసేలా వెలుగు కాస్త తక్కువగా ఉంటుంది.

తెర తీయబడిన తదుపరి అరనిముషానికి గడియారం పన్నెండు గంటలు కొట్టడం నిశ్శబ్దంలోంచి స్పష్టంగా వినిపిస్తుంది. మరో అర నిముషం గడిచిన తరువాత...

ఎడంవైపు నుండి ఫుల్ యూనిఫాంలో ప్రవేశించిన పోలీసు రాజారావు తిప్పయ్య ఎదుటికి వెళ్ళి అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ చేస్తాడు. కానీ తిప్పయ్యలో చలనం కన్పించదు.

**రాజారావు** : సార్! (అంటూ పిలుస్తాడు)

**తిప్పయ్య** : (పలకడు... కదలడు) గుర్... గుర్...(అంటూ గురకపెడ్తాడు)

**రాజారావు** : సార్! (బిగ్గరగా పిలుస్తాడు పెద్ద స్వరంతో)

**తిప్పయ్య** : (ఉలికిపడి కళ్ళు తెరచి తలెత్తి చూస్తాడు)

**రాజారావు** : సార్! రాత్రి పన్నెండు గంటలు దాటిపోయింది.

**తిప్పయ్య** : అయితే ఏమిటంట?(అంటూ కోపంగా చూస్తాడు).

**రాజారావు** : పెట్రోలింగ్ వెళ్ళాలన్నారు సార్ మీరే!

**తిప్పయ్య** : పెట్రోలింగ్ లేదు, గిట్రోలింగ్ లేదు. వెళ్ళు... వెళ్ళి పడుకో! బంగారంలాంటి నిద్ర చెడగొట్టావు (అంటూ తల వాలుస్తాడు, ఆ వెంటనే నిద్రలోకి జారుకుంటాడు కూడా).

**రాజారావు** : నైట్‌డ్యూటీలో నిద్రెలా పడ్తుందో? (అని గొణుక్కుంటూ, గాంధీ ఫోటోకేసి చూస్తూ కుడివైపుకి వెళ్తాడు!

అర నిమిషం తరువాత కానిస్టేబుల్ కనకలింగం ఓ పాతికేళ్ళ యువకుడ్ని చెయ్యిపట్టి లాక్కుంటూ ఎడంవైపునుండి ప్రవేశిస్తాడు. ఆ యువకుడి దుస్తులూ, వాలకమూ పేదరికాన్ని చాటి చెప్తుంటాయి. కనకలింగం పోలీసు యూనిఫాంలో ఉంటాడు.

**కనకలింగం** : (తిప్పయ్య దగ్గరగా వెళ్ళి) సార్! (అంటూ పిలుస్తాడు)

**తిప్పయ్య** : (పలకడు) గుర్... గుర్... (అంటూ గురకతీస్తాడు)

**కనకలింగం** : సార్!... సార్!!... (అంటూ గట్టిగా పిలుస్తాడు)

**తిప్పయ్య** : గు............ర్....... (అంటూ దీర్ఘంగా గురకతీస్తాడు)

**కనకలింగం** : సార్! మినిష్టరు వారి ఫోను(అంటాడు పెద్దస్వరంతో బిగ్గరగా)

**తిప్పయ్య** : (ఉలికిపడి మేలుకుంటాడు) మంత్రిగారి ఫోనా?... ఏమిటంట??... ఏమిటంట... (అంటూ కంగారుగా లేచి నిలబడి టోపీ అందుకుని తలమీద ఉంచుకుంటాడు).

**కనకలింగం** : ప్రస్తుతానికి మంత్రిగారు హైదారాబాదు వెళ్తున్న రైల్లో ఫస్ట్‌క్లాస్ ఎ.సి. కూపేలో హాయిగా నిద్రపోతున్నారు సార్. ఎంతకూ మీరు నిద్రలేవకపోతేనూ...

**తిప్పయ్య** : నిన్ను దెయ్యాలదిబ్బకు బదిలీ చెయ్యా! నీబొందను పచ్చి కట్టెల మధ్య కాలీకాలకుండా తగలెట్టా!! దివ్యమైన నిద్ర పాడుచేసేశావే... ఎస్.ఐ. గారికి చెప్పి నీ సస్పెన్షన్‌కు రెకమండ్ చేయిస్తాను. (అంటూ యువకుడివైపు చూస్తాడు).

**తిప్పయ్య** : వీడెవడు?

**కనకలింగం** : అర్థరాత్రి వీధినపడి షికారు చేస్తుంటే పట్టి లాక్కొచ్చాను

సార్!

**తిప్పయ్య** : మంచిపని చేశావు (అంటూ యువకుడివైపు తిరిగి) ఎవడ్రా నీవు? (అంటూ కోపంగా ప్రశ్నిస్తాడు).

**యువకుడు** : (చిన్నబుచ్చుకుంటాడు) నా పేరు సూర్యం అండీ!

**తిప్పయ్య** : సూరీడు పగలు మాత్రమే తిరగాలి. రాత్రులందు ఎక్కడికో తమరి షికార్లు? (వ్యంగ్యంగా ప్రశ్నిసాడు).

**సూర్యం** : (తిప్పయ్య వ్యంగ్య ధోరణికి బాధపడ్తాడు). కుంజర యూధంబు దోమ కుత్తుక జొచ్చాల్సిన అవసరాలు కూడా అనాదిగానే ఉంటున్నాయి సార్ ఈ లోకంలో.

**తిప్పయ్య** : లింగం...

**కనకలింగం** : సార్!

**తిప్పయ్య** : వీడేమిటేమిటో మాట్లాడేస్తున్నాడు, కొంపదీసి పిచ్చాసుపత్రి బాపతేమో?

**కనకలింగం** : ఒరేయ్ నీ నాటకాలు నావద్ద సాగవు! నిజం చెప్పు నీవెవరు?

**సూర్యం** : ఐయాం మిస్టర్ ఎస్. సూర్య ప్రకాష్‌రావు, ఏం.ఏ., ఎం.ఇ.డి., డి.పి.ఎ. (అంటాడు కాస్త కోపంగా, ఉక్రోషంగా).

**కనకలింగం** : (కాస్త తగ్గుతాడు) ఏం పని చేస్తుంటావు?

**సూర్యం** : ఉద్యోగం కోసం వెతుకుతుంటానండీ!

**తిప్పయ్య** : ఓహో... నిరుద్యోగివా? అయినా ఇంత రాత్రప్పుడు ఎక్కడ్నుండీ, ఎక్కడికి వెళ్తున్నావు? (కటువుగా అడుగుతాడు).

**సూర్యం** : ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఇంటికెళ్తున్నానండీ! ఒళ్లు కాలి ఏడుస్తున్నవాణ్ణి సిగరెట్‌కోసం నిప్పడిగినట్లు ఈయన నన్నిక్కడికి లాక్కువచ్చాడండీ! నే చెప్పేదేమాత్రం విన్పించుకోకుండా!!

తిప్పయ్య : ఆస్పత్రి నుండి ఇంటికెందుకూ వెళ్ళడం?

సూర్యం : ఆస్పత్రిలో మా తాతయ్య పోయాడండి (దిగులుగా అంటాడు).

తిప్పయ్య : ఎప్పుడు?

సూర్యం : పదకొండు గంటలా ముప్పయి ఆరు నిముషాలకండీ!

తిప్పయ్య : ఆస్పత్రిలో మీ తాత బాల్చీ తన్నేస్తే నీవు ఇంటికి వెళ్ళడం ఎందుకు?

సూర్యం : మా వాళ్ళకు తెలిపి వారిని తీసుకురావాలి కదండీ?

తిప్పయ్య : ఫోను చెయ్యవచ్చుకదా?

సూర్యం : మా కుటుంబానికి ఫోను సౌకర్యం లేదండీ!

కనకలింగం : ఇంతకూ మీవాళ్ళు ప్రాణం పోతున్న ముసలాడి దగ్గరుండకుండా ఇంట్లో ఎందుకున్నారన్నది నా అనుమానం.

సూర్యం : అందర్నీ... అంటే... పిల్లాజెల్లా, గొడ్డూగోదాతోపాటు ఆస్పత్రిలో ఉండనివ్వరు కదండీ?

కనకలింగం : అదికాదు కారణం... మరేదో ఉండాలి!... నీవేదో దాస్తున్నావు!!

సూర్యం : నిజమే! ఇంకో కారణం కూడా లేకపోలేదు (ఏదో ఆలోచిస్తూ అంటాడు).

తిప్పయ్య : అలాగా ఏమిటా కారణం? (దబాయింపుగా అడుగుతాడు).

సూర్యం : వెన్ పావర్టీ ఎంటర్స్ ఫ్రం ది డోర్ లవ్ ఫ్లైస్ అవుటాఫ్ ది విండో... సర్!

కనకలింగం : సార్! ఇతగాడేదో మనల్ని తిడ్తున్నట్లున్నాడు.

సూర్యం : అబ్బే తిట్టడం కాదండీ... అదో ఆంగ్ల సామెత! పేదరికం గుమ్మంగుండా ఇంట్లోకి ప్రవేశిస్తే ప్రేమ కిటికీ గుండా ఎగిరిపోతుందని చెప్తుందది. ఆ మాత్రం అర్థం తెలియదా?

**తిప్పయ్య** : ఆ మాత్రం ఇంగ్లీషు తెలుసుంటే మేము నీలాగ రోడ్లు పట్టుకుని తిరిగే వాళ్ళం చిప్పలు చేతపట్టుకుని.

**కనకలింగం** : ఇంగ్లీషు పూర్తిగా నేర్వకపోవడం వల్లే దర్జాగా ఈ ఉద్యోగాలు చేసుకుంటున్నాం ఆ! (గర్వంగా అంటాడు)

**సూర్యం** : హేట్స్ అఫ్ టూ అవర్ గ్రేట్ నేషన్!

**తిప్పయ్య** : లింగం వీడు మరీ పెట్రేగిపోతున్నాడు కానీ బొక్కలో తోసెయ్యి వీడ్ని... ఆనక చూద్దాం వీడి కథ.

**సూర్యం** : అమ్మ బాబోయ్! కాలం కానప్పుడు చేతికర్రే పామై కరుస్తుందంటారు...నిజమే.. నేను మా తాతయ్య పోయిన విషయాన్ని మా వాళ్ళకు చెప్పాలి సార్ (ఏడ్పు గొంతుతో అంటాడు)

**తిప్పయ్య** : ఉదయం చెప్తువు కానీ!

**సూర్యం** : ఆలోగా ఆస్పత్రిలోని ఎలుకలూ, పందికొక్కులూ తాతయ్య శవాన్ని చీల్చి చెండాడేస్తాయి సార్.

**తిప్పయ్య** : నేనేం చేసేదయ్యా? తెల్లవారాలి! నీకు ఎవరైనా బెయిల్ ఇవ్వాలి! అంతదాకా నిన్ను వదలడానికి వీల్లేదు మరి!!

**సూర్యం** : ఎవరో వచ్చి నాకు బెయిల్ ఇచ్చేలోపు ఆస్పత్రి వాళ్ళు అన్‌క్లైముడు డెడ్‌బాడీ క్రింద మునిసిపాలిటీ వాళ్ళ కిచ్చేస్తారు సార్ తాతయ్య శవాన్ని.

**తిప్పయ్య** : మాకు ఇన్‌ఫార్మ్ చెయ్యకుండా మునిసిపాలిటీ వాళ్ళకు ఇవ్వరు లేవయ్యా... అధవా ఇచ్చినా... మీకు బోలెడు ఖర్చు తగ్గిపోతుందికదా?

**సూర్యం** : శివ శివా!! మా తాతయ్య గతంలో ఎంతో ఘనంగా బ్రతికిన వారయ్యా!

**తిప్పయ్య** : దానికి నేనేం చేసేదయ్యా?

**సూర్యం** : నేనేం నేరం చెయ్యలేదు! నన్ను లోపల పెట్టడానికి మీకేం అధికారం ఉందయ్యా (కోపంగా ప్రశ్నిస్తాడు).

**తిప్పయ్య** : తగ్గవయ్యా తగ్గు.. ఆపరేషన్ పాడ్‌లాక్ క్రింద.... అనమానస్పందంగా తిరుగు తున్నందుకు నిన్ను ఆరెస్టు చేశాము! సరా?

**సూర్యం** : దరిద్రుడు సముద్రంలో పడిచావాలని వెళ్ళబోతే.. వెళ్ళనీయకుండా రాళ్ళ వాన పట్టుకుందట.. ఓ తాతయ్యా!! నేనేం చేయను దేముడో?...'

**లింగం** : నీ జేబులో డబ్బుంటే వంద రూపాయలు డిపాజిట్టు కట్టి నీవు వెళ్ళిపోవచ్చు!!

**సూర్యం** : ప్రాణం వదలాలని పాడుబడ్డ బావిలో పడితే ప్రాణం పోకపోగా కప్పలూ, పాములూ కాళ్ళూ చేతులూ పీక్కుతిన్నట్లుంది ఇదంతా... (అంటూ జేబులో చెయ్యి పెట్టాడు).

**తిప్పయ్య, లింగం:** (సూర్యం జేబులోంచి డబ్బు తీసి లెక్కపెట్టుకుంటూంటే కళ్ళార్పకుండా చూస్తారు)

**సూర్యం** : సార్ నావద్ద మొత్తం పంన్రెండు రూపాయలు మాత్రమే ఉన్నాయి.

**తిప్పయ్య** : (సూర్యం చేతుల్లోని డబ్బు లాక్కుంటూ అంటాడు) వెళ్ళు.. వెళ్ళు ఎవరు, ఎప్పుడు, ఎక్కడ చచ్చినా రాత్రులందు మాత్రం బయట తిరగొద్దు... వెళ్ళు!

**సూర్యం** : హేట్స్ అప్ టూ అవర్ ఇండిపెండెంట్ ఇండియా (అంటూ గాంధీ ఫోటో కేసి చూస్తూ ఎడంవైపు వెళ్ళిపోతాడు).

**తిప్పయ్య** : లింగం, నీకు బుద్ది లేదయ్యా!

**లింగం** : ఎందుకు సార్?

**తిప్పయ్య** : నీ జేబులో డబ్బుంటే డిపాజిట్ కట్టి వెళ్ళొచ్చు... అన్నావు!

**లింగం** : అవున్సార్! అన్నాను!! ఏం??

**తిప్పయ్య** : వాడు రేపు ఉదయాన్నే "నా డిపాజిట్ నాకివ్వండి!" అంటూ వస్తే?

లింగం : తాత చచ్చి ఏడుస్తున్నవాడు మళ్ళీ ఉదయాన్నే ఎందుకొస్తాడు సార్? వల్లకాటికి పోతాడు గానీ!

తిప్పయ్య : బేష్!

లింగం : నాకు ఆరు రూపాయలివ్వండి సార్!

తిప్పయ్య : (కోపంగా చూసి) రెండు రూపాయలుంచుకో... చిల్లర లేదు. మరేదయినా వస్తే ఇస్తా. (అంటూ రెండు రూపాయలు ఇస్తాడు).

లింగం : (ఏదో గొణుక్కుంటూ ఎడం వైపు వెళ్తాడు).

రాజారావు : (కుడివైపు నుండీ కోపంగా ప్రవేశిస్తూ అంటాడు) సార్! మీరు చేసింది చాలా అన్యాయం.

తిప్పయ్య : ఏమిటోయ్? ఏమిటి నీ సొద??

రాజారావు : ఇంతింత జీతాలు తీసుకుంటున్నాం. ఎందుకు సార్ ఇంత కక్కుర్తి.. శవం మీద చల్లే బొరుగుల్లోని పైసలు ఏరుకున్నట్లు.

తిప్పయ్య : రాజారావ్ (కోపంగా కళ్ళెర్ర చేస్తాడు).

రాజారావు : సార్! (అంటాడు కాస్త తగ్గిపోయి).

తిప్పయ్య : చేతకాని వాడివి చేతకానట్లు పడివుండు! నన్నే విమర్శిస్తే... యస్సై గారికి చెప్పి నిన్ను దెయ్యాల దిబ్బకు రెకమెండ్ చేయిస్తాను! ఆ!!

రాజారావు : (మౌనం వహిస్తాడు).

తిప్పయ్య : వెళ్లు...సైకిలు మీద వెళ్ళి ఊరంతా తిరిగి బీట్ చేసిరా... వెళ్ళు.

రాజారావు : (అటెన్షన్‌లో నిలబడి తిప్పయ్యకు సెల్యూట్ చేసి... ఆపై గాంధీ ఫోటో వైపు చూసి) దిసీస్ నాట్ ది కరక్ట్ లిబర్టీ (అని గొనుక్కుంటూ ఎడమవైపు వెళ్ళి పోతాడు.)

తిప్పయ్య : (వెళ్ళి తన కుర్చీలో కూర్చుని కాళ్ళు టేబులు మీదకు చాపుకుని తలమీదున్న టోపీ తీసి కాళ్ళ ప్రక్కగా పెట్టుకుని రిలాక్సుడుగా ఆవిలిస్తూ రెండుసార్లు చిటిక వేస్తాడు).

**తెర వాలుతుంది**

# రెండవ అంకం

(తెర తీయబడగానే కన్పించే దృశ్యం : తిప్పయ్య కాళ్ళు బల్లమీద చాపుకుని మామూలుగానే కూర్చిలో తల వ్రేలాడేసి నిద్రపోతుంటాడు. కాళ్ళ ప్రక్కగా అతని టోపీ ఉంటుంది.

గోడగడియారం నాలుగు గంటలు చూపుతుంటుంది.

అరనిముషం తరువాత గడియారం నాలుగు గంటలు కొట్టడం విన్పిస్తుంది. మరో పావు నిముషం తరువాత దూరం నుండీ విన్పించినట్లుగా కోడి కూత నిముషం తేడాతో రెండు పర్యాయాలు విన్పిస్తుంది.

అంతలోనే కనకలింగం కంగారుగా, వేగంగా ఎడం వైపునుండీ ప్రవేశిస్తాడు).

**లింగం** : సార్.. సార్.. దొంగ.. దొంగసార్! (పెద్ద స్వరంతో అంటాడు)

**తిప్పయ్య** : (ఉలికిపడి నిద్రలోంచీ మేలుకుని ఉద్రేకంగా లేచి నిలబడ్తాడు.. ఆ కంగారులో అతని కాళ్ళ వద్దనున్న టోపీ క్రింద పడిపోతుంది). దొంగా? పట్టుకో.. పట్టుకో!.. ఫో!! (అని కోపంగా అరుస్తాడు).

**లింగం** : (వంగి క్రిందపడ్డ టోపీని తీసి తిప్పయ్యకు అందిస్తూ అంటాడు) పట్టుకున్నాడు సార్!

**తిప్పయ్య** : మరి ఏడీ? సెల్‌లో తోసేశావా?? (అంటూ కుడివైపు చివరికి వెళ్ళి తొంగి చూసి వస్తూ అంటాడు) ఎక్కడయ్యా దొంగాడు? ప్రభుత్వ ఖజానా లాగా ఖాళీగా ఉందే సెల్??

**లింగం** : దొంగాడు పారిపోయాడు సార్!

**తిప్పయ్య** : (ఓ నిముషంపాటు కనకలింగం వైపు అలా కన్నార్పకుండా చూస్తూ ఉండిపోతాడు) లింగం నీకు బుర్ర పనిచేస్తోందా? లేక ఎలక్షన్ దగ్గర పడుతున్నదని ఇరు పార్టీల వాళ్ళూ పోయించే మందు త్రాగి త్రాగీ ఖరాబయి పోయిందా?

**లింగం** : బాగానే పనిచేస్తోంది సార్! అసలు నేను రెండు పక్షాల వారి మందు తాగడమే లేదుసార్.

తిప్పయ్య : మరేం చేస్తున్నావు?

లింగం : ఇంట్లో స్టాక్ చేసుకుంటున్నాను.. అస్సలు దొరక్కుండా పోయినప్పుడు వాడుకోవచ్చుని.

తిప్పయ్య : ఓర్నీ ఇల్లు కనకం కానూ.. ఇంతకూ అసలేం జరిగిందో అర్థం అయ్యేలా చెప్పితగలడు!

లింగం : అర్ధరాత్రి నేనిక్కడ్నుండీ పేకాట కెళ్ళాను సార్! కాస్సేపు గెలిచాను కానీ.. గెలిచిందీ.. నావద్దనున్నదీ అంతాపోయింది మళ్ళీ!

తిప్పయ్య : నీ బ్రతుకే అంత కదా?

లింగం : అక్కడ్నుండీ ఇంటికెళ్ళాను సార్! అంత ఆలస్యంగా అన్నానికి వెళ్ళినందుకు మా ఆవిడ తిడ్తుందేమోనని భయపడ్తూ వెళ్తే అది నోరు మెదపలేదు సార్.

తిప్పయ్య : (ఆశ్చర్యంగా) ఎందుకూ?

లింగం : దొంగాడు దాని కాళ్ళూ చేతులూ కట్టేయడమే కాదు నోట్లో కూడా గుడ్డలు కుక్కేశాడు!

తిప్పయ్య : వార్నీ!

లింగం : నన్ను చూడగానే దొంగాడు కట్టుకున్న మూటతో సహా రివ్వున పారిపోయాడు సార్... నేను నాభార్య నోట్లోవున్న గుడ్డలాగేశాను.

తిప్పయ్య : దొంగను వదిలేశావా?

లింగం : నా భార్యా అదే అందిసార్! ఏం పోలీసోడు నీవు? వెళ్ళి దొంగను మూటతో సహా పట్టుకురా లేకపోతే కాళ్ళు విరగ్గొడ్తాను అందిసార్!!

తిప్పయ్య : ఆ! బాగా గడ్డెట్టింది.

లింగం : నేను ఇంట్లోంచీ వెలుపలికి రాగానే రాజారావు సైకిలు మీద బీటొచ్చాడు సార్!

తిప్పయ్య : మరి నీవూ, రాజారావూ కలిసెల్లి దొంగను పట్టుకోలేక పోయారా?

**లింగం** : నేను చెప్పేది ఆసాంతం వినకుండానే రాజారావు తనొక్కడే సైకిలుమీద దూసుకుపోయాడు సార్ దొంగెళ్ళిన వైపు.

**తిప్పయ్య** : వెరీగుడ్!

**లింగం** : వెళ్ళిన వాడు వెళ్ళినట్లే పది నిముషాలలోనే తిరిగొచ్చేశాడు సార్ దొంగాడ్ని మూటతోపాటు పట్టుకుని సైకిలు బారుమీద కూర్చో బెట్టుకుని మరీ...

**తిప్పయ్య** : రాజారావెవరను కున్నావోయ్? నా శిష్యుడు! మన ట్రెయినింగ్ అంటే మాటలా మరి? (అంటూ మీసం మెలిపెడ్తాడు).

**లింగం** : రాజారావు నన్ను నానా మాటలన్నాడు సార్! నేను మన డిపార్టుమెంటు పరువు తీస్తున్నానట. ఈ దొంగతనం విషయం తెలిస్తే ప్రజలు నవ్విపోతారట (ఏడ్పు గొంతుతో అంటాడు).

**తిప్పయ్య** : కాదూ మరి?!

**లింగం** : రాజారావు నన్ను తిట్టేసి దొంగను నాకు అప్పజెప్పి "ఏమయినా చేసుకో పో" అంటూ సైకిలెక్క వెళ్ళిపోయాడు సార్ బీటుకి.

**తిప్పయ్య** : (తెల్లబోతూ) మరి దొంగాడేడయ్యా?

**లింగం** : దొంగాడా సార్? (అటూ జేబులోంచీ సరికొత్త వందరూపాయల కాగితం తీసి మడత విప్పి తిప్పయ్య ముఖం ముందు అటూ, ఇటూ ఆడిస్తాడు).

**తిప్పయ్య** : (నోటు ఎటు ఆడితే అటు నాగుపాములా తల తిప్పుతూ ఆశగా కళ్ళు విప్పార్చి చూస్తాడు నోటుకేసి).

**లింగం** : దొంగాడు ఈ నోటు ఇలాగే నాముఖం ముందు ఆడించాడు సార్! మీరెలా చూశారో అచ్చు అలాగే ఆశగా చూశాను సార్ ఈ నోటుకేసి.

**తిప్పయ్య** : చూస్తే!

**లింగం** : దొంగాడు ఈ నోటు నాకిచ్చేశాడు సార్!

**తిప్పయ్య** : ఆహా!

**లింగం** : తెల్లవారుఝామునే మంచి బోనీ అయిందనుకుని నోటు కళ్ళకద్దుకుని జేబులో ఉంచుకుని ఇంట్లోకి వెళ్ళాను సార్.. మూట మాట మరచిపోయి!

**తిప్పయ్య** : నిన్ను పచ్చి కట్టెల మధ్య పెట్టి కాలీ కాలకుండా తగలెయ్యా!

**లింగం** : నా భార్య కూడా నన్ను తిట్టని తిట్టు తిట్టకుండా తిట్టి ఆపై పప్పుగుత్తితో కొట్టొచ్చింది సార్.

**తిప్పయ్య** : కొట్టడం కాదు నిన్ను చంపేయాల్సింది.

**లింగం** : సార్ ఆ దొంగాడ్ని పట్టుకుని సొత్తు ఇంటికి తీసుకెళ్ళక పోతే నా భార్య నిజంగానే నన్ను చంపేస్తుంది సార్!

**తిప్పయ్య** : రామా (అంటూ కుర్చీలో కూలబడి తలపట్టుకుంటాడు).

**లింగం** : ఎలాగైనా ఆ దొంగను మీరే పట్టుకోవాలి సార్!

**తిప్పయ్య** : లింగం.. నేనో విషయం చెప్పనా?

**లింగం** : చెప్పండి సార్!

**తిప్పయ్య** : ఆ దొంగాడ్ని పట్టుకునే తాహతుంటే నేను హెడ్‌కానిస్టేబులు అయ్యేవాడ్నే కానయ్యా!

**లింగం** : మరి?

**తిప్పయ్య** : హాయిగా ఇలా నిద్రపోకుండా రాజారావులా చలిలో సైకిలు మీద బీట్లు తిరుగుతూ ఉండేవాణ్ని.

**లింగం** : ఇప్పుడెలా సార్? (బాగా దిగులుగా అంటాడు).

**తిప్పయ్య** : దిగులు పడకోయ్... ఎక్కడో ఒక చోట రికవరీ చేసిస్తానులే ఎలాగో ఒకలా. వెళ్ళి కాసేపు పడుకుని రెస్టు తీసుకో.. ఫో! (అంటూ తన కూర్చీలో వెనక్కి జరిగి కాళ్ళు తీసి బల్లమీద ఉంచుకుని నెమ్మదిగా చాపుతాడు).

**లింగం** : (కుడివైపుకు వెళ్తాడు)

**తెర వాలుతుంది**

# మూడవ అంకం

(తెర తీయగానే కన్పించే దృశ్యం:– గోడగడియారం ఏడుగంటలు కావస్తున్నట్లు చూపుతుంటుంది. ట్యూబులైటు, మామూలు బల్బు రెండూ ఆరిపోయి ఉంటాయి. అయినా వెలుగు ఎక్కువగా వుంటుంది. తెల్లవారిందని తెలియజేస్తూ.

తిప్పయ్య కుర్చీలో కూర్చుని తల బల్లమీదకు పెట్టుకుని నిద్రపోతుంటాడు.

తెర తీయబడిన అర నిముషం తరువాత గడియారం ఏడు గంటలు కొట్టడం విన్పిస్తుంది. మరో నిముషం తరువాత దూరం నుండి కూరలమ్మి అరుపులూ, పాలవాడి కేకా వరుసగా విన్పిస్తాయి.

పేపర్‌బోయ్ పేపర్ల కట్ట పట్టుకుని ఎడంవైపు నుండి ప్రవేశిస్తాడు.

**పేపర్ కుర్రాడు :** సార్! (అంటూ పిలుస్తాడు)

**తిప్పయ్య :** (పేపరు తన తలమీదుగా ఎగిరి బల్లమీద పడ్డా నిద్రలేవడు.

పేపరబ్బాయి ఎడంవైపు వెళ్ళిపోయాక కుడివైపు నుంచి పలుచటి పొగ ఆగి ఆగి రావడం మొదలుపెడ్తుంది).

**తిప్పయ్య :** (గురక ఆపి తల కదిలిస్తాడు).

(కుడివైపునుండి పలుచటి పొగ ఆగి ఆగి వస్తూనే ఉంటుంది... అర నిముషం తరువాత తిప్పయ్య నిద్ర మేలుకుని కూర్చీలో కూర్చుంటాడు).

**తిప్పయ్య :** ఎవడ్రా అది... స్టేషనులో చుట్ట కాలుస్తున్నది? ఆయ్! (అంటూ బిగ్గరగా అరుస్తాడు).

(పావు నిముషం తరువాత)

**చంగప్ప :** నేనేనయ్యా (అంటూ కుడివైపు నుండి ప్రవేశిస్తాడు. ఆకృతి పల్లెటూరి బైతులా ఉంటుంది. చేతిలో వెలుగుతున్న చుట్ట ఉంటుంది).

**తిప్పయ్య :** వెళ్ళరా... వెళ్ళు... ముందు ఆ చుట్ట అవతల గిరాటేసిరా... ఇది స్టేషననుకున్నావా? నీ అత్తగారి ఇల్లనుకున్నావా?... ఆయ్! (అంటూకేకలేస్తాడు).

చంగప్ప : మరేం సేయనయ్యా? గంట కాడ్నుండీ కాసుకున్నాను. ఈ టేసనేమో నాలుగు కట్టల గడ్డితిని, తొట్టెడు కుడితి తాగిన దున్నపోతు మాదిరి నిద్దరపోతావుంది... ఓరూ పలకరు...

తిప్పయ్య : పలకకపోతే?

చంగప్ప : సిరాకేసి సుట్ట కాలుత్తా కూకున్నానయ్యా ఆడ (అంటూ కుడివైపు చూపుతాడు).

తిప్పయ్య : ఆ గదిలో కూర్చున్నావా? నిన్ను తగలెయ్యా... ఎక్కడ??

చంగప్ప : ఆ గొట్టం కొట్టి సెప్పేది లేదూ... నల్లటిది... దాని పక్కన లేదూ... ఆ కుర్సీలో కూకున్నానయ్యా.

తిప్పయ్య : నిన్ను బతికుండగానే కాష్టంలో పెట్టి కాలీ కాలకుండా తగలెయ్యా! ఫోను ప్రక్కనున్న కుర్చీలో... అంటే... ఎస్.ఐ. గారి కుర్చీలో కూర్చుంటావా?

చంగప్ప : మరేం సెయ్యనయ్యా? కుర్సీల్లో, బల్ల చెక్కలమీదా యాడసూసినా మీ పోలీసులే గురకల్దీస్తుండిరి.

తిప్పయ్య : అయితే మాత్రం ఆ కుర్చీ కావాల్సి వచ్చిందా నీకు? గాడిదా నిన్ను బోక్కలో తోసేసి బోడి కొట్టిస్తాను.

చంగప్ప : మరేడ కూకోవాలయ్యా? (విసుగ్గా అడుగుతాడు).

తిప్పయ్య : వల్లకాట్లో... నీ దరిద్రపు ముఖానికి కుర్చీ కావాలా?

చంగప్ప : నన్ను దరిద్రగొట్టనకయ్యా! మా ఇంట్లోనూ రెండు కుర్సీలున్నాయి. పడక్కుర్సీ కూడా ఓటుంది. నాలుగు నులక మంచాలున్నాయి... మా గేదె కూడా గోతాం పట్ట పరిత్తే తప్ప పడుకోదు... ఆ!

తిప్పయ్య : నీ గొప్పలు నీ బాబుకి చెప్పుకో... ఫో... ఇక్కడ్నుండీ ముందు బయటకు నడు.

చంగప్ప : యాలపోతానూ? నా గేదెను పట్టిచ్చేదాకా నేపోను.

తిప్పయ్య : నీ గేదేమిటి?... నీవే ఓ గేదెలా వున్నావు!

చంగప్ప : నా గేదె మొన్ననగా మేతకెళ్ళి కన్పట్టకుండా పోనాదయ్యా!

తిప్పయ్య : దానికి మేమేం చేసేది?

చంగప్ప : ఎతకి పట్టివ్వాలయ్యా!

తిప్పయ్య : హ్హా... హ్హా... హ్హా... (అంటూ చాలా గట్టిగా పడీపడీ నవ్వుతాడు).

లింగం : (కుడివైపు నుండికళ్ళు నులుముకుంటూ కంగారుగా వస్తాడు) ఏమిటిసార్ ఈ భయంకరమైన నవ్వు... స్టేషను కప్పు కూలిపేయేలా... మాంచి నిద్ర కాస్తా పాడయి పోయింది.

తిప్పయ్య : లింగం... వీడి గేదె పోయిందట... మనం వెతికి పెట్టాలట (మళ్ళీ పడీపడీ నవ్వుతాడు).

లింగం : (ఉక్కిరి బిక్కిరయిపోతూ నవ్వుతాడు).

చంగప్ప : మీరుగాక మరెవుడయ్యా ఎతికేది?

తిప్పయ్య : ఓయ్... తగ్గరా తగ్గు. గేదెలనూ, గాడిదలనూ, నీలాంటి అడ్డగాడిదలనూ వెతికి పెట్టిచ్చే రోజులు బ్రిటీషు వాళ్ళతోటే వెళ్ళిపోయాయి. వెళ్ళి బందలదొడ్లో వెతుక్కోఫో!

చంగప్ప : ఈ ఊరి బందలదొడ్లోనే కాదు సుట్టుపక్కల ఊళ్ల బందలదొడ్లన్నీ ఎతికేసానయ్యా!

తిప్పయ్య : అంజనం శాస్త్రుల దగ్గరకెల్లలేకపోయావా? (వ్యంగ్యంగా ప్రశ్నిస్తాడు).

చంగప్ప : ఆ శాస్తుల మీద నాకు సత్తెం లేదయ్యా!

తిప్పయ్య : నమ్మకం లేదా? ఎందుకూ??

చంగప్ప : పోయినేడు ఇదే గేదె పోయినప్పుడు మీకాడికి రాకుండా ఆ శాస్తులకాడికే పోనానయ్యా.

లింగం : పోతే?

చంగప్ప : శాస్తుల్లు టెంకాయ, ఆకూ, ఒక్కా, ఆర్రూపాయలూ దచ్చినా లాక్కుని అంజనం డబ్బాలోకి సూసాడయ్యా.

**తిప్పయ్య** : చూసి...?

**చంగప్ప** : ఒరే చెంగా ఈడకు దచ్చినంగా రెండామల్ల దూరంలో ఓ మీసాలోడు నీ గేదెను కోసి బాగా లేత్తున్నాడురా పెద్ద బండమీద. నీ గేదె కొమ్ములు కూడా కన్పిత్తున్నాయి... అన్నాడు శాస్తుల్లు.

**లింగం** : తరువాత?

**చంగప్ప** : ఎతుక్కుంటూ ఎల్లినా పెయోజనం లేదని శాస్తుల్లు సెప్పాడని యేడుచుకుంటూ ఇంటికెళ్ళానా?

**తిప్పయ్య** : ఆహా!

**చంగప్ప** : నేనింటికెల్లిన గంటకంతా గేదెకూడా ఇంటికొచ్చేసింది అదే!

**లింగం** : వార్నీ!

**చంగప్ప** : అందుకే నా గేదెను మీరే ఎదికి పెట్టాల.

**తిప్పయ్య** : నీ పేరేమిట్రా?

**చంగప్ప** : చెంగప్పయ్యా!

**తిప్పయ్య** : నీ బాబు పేరేమిట్రా?

**చంగప్ప** : చిన చెంగప్పయ్యా!

**తిప్పయ్య** : నీ తాత పేరేమిట్రా?

**చంగప్ప** : పెద చెంగప్పయ్యా!

**తిప్పయ్య** : ఆడి బాబు పేరేమిట్రా?

**చంగప్ప** : తెలీదయ్యా!

**తిప్పయ్య** : ఏ ఊరురా నీది?

**చంగప్ప** : ఇదేనయ్యా!

**తిప్పయ్య** : నీకు పెళ్ళాలెందరురా?

**చంగప్ప** : ఎందరో యాడయ్యా... ఉన్నదాంతోటి యేగలేక సత్తోంటే...

**తిప్పయ్య** : నీకు పిల్లలెందర్రా?

**చంగప్ప** : పదకొండుమందయ్యా! ఈల్లుగాక ఇంకోడు పోయాడయ్యా!!

**తిప్పయ్య** : డజనుమందినెందుకు కన్నావురా?

**చంగప్ప** : తీటబట్టి... నా గేదె సంగెతెత్తకుండా ఈ పెశ్నలన్నీ అడుగుతారేందయ్యా?

**తిప్పయ్య** : నీవే వీధిలోరా ఉండేది?

**చంగప్ప** : నా గేదయ్యా?

**తిప్పయ్య** : నీవే వీధిలోరా ఉండేది వెధవా?

**చంగప్ప** : నా గేదయ్యా... నా గేదె సంగతి సూడకుండా ఏంటయ్యా ఇయన్నీ?

**లింగం** : నీ వివరాలన్నీ కావాలి మొదట. నీవసలు మంచోడా, దొంగోడా తేలాలి ఇప్పుడే.

**తిప్పయ్య** : అసలు నీ గేదె పోయిందో, నీవే అమ్మేశావో, అస్సలు ఆ గేదె నీదో కాదో అన్నీ తేలాలి. అనుమానం తోస్తే నిన్నే లోపల తొయ్యాలి! ఆ!

**చంగప్ప** : గేదె పోయి నేనేడుత్తాంటే యియన్నీ ఏంటయ్యా?

**లింగం** : అవన్నీ ఉండకూడదనుకుంటే ఓ వంద రూపాయలు ఇలా పడెయ్యి... నీ గేదె సంగతి చూస్తాము.

**చంగప్ప** : (చివాలున వెనక్కి తిరిగి ఎడంవైపుగా వెళ్ళిపోబోతాడు గబగబా).

**తిప్పయ్య** : రేయ్ ఆగరా! ఆగు!!

**లింగం** : ఎక్కడికోయ్ ఆ పరుగు?

**చంగప్ప** : (ఆగి అంటాడు) ఫో పోండయ్యా, నన్ను మీకాడికి అంపించిన ఆ పెద్దమడిసి ముగంనీళ్లు దింపేత్తాను పోయి...

**తిప్పయ్య** : ఎవర్రా నిన్ను పంపించింది?

**చంగప్ప** : ఆ పెద్దమనిసే... సీపతిరావు... మేజటీటట... మేజటీటు... ఆ పెద్దమనిసినే దులిపేత్తాను. సానా మంచి జాగాకు అంపిచ్చినావని.

| | | |
|---|---|---|
| **లింగం** | : | (ఉలికిపడి ఇద్దరూ ఒకేసారి అంటారు). |
| **తిప్పయ్య** | : | మేజిస్ట్రేట్ శ్రీపతిరావుగారు పంపించారా నిన్ను? |
| **చంగప్ప** | : | ఆ పెద్దమడిసే! బలే సోటి కంపాడు. |
| **లింగం** | : | అయ్యగారు నీకెలా తెలుసు. |
| **చంగప్ప** | : | నాకాడేగా ఆయప్ప పాలు కొనేది చింతగింజేత్తే మునగనంత సిక్కగా పోత్తా పాలాయనకు. |
| **తిప్పయ్య** | : | లింగం కూర్చీ లాగు. |
| **లింగం** | : | (తిప్పయ్య కూర్చునే కుర్చీని ముందుకు లాగుతాడు) కూర్చోండి చంగప్పగారూ (అంటాడు గౌరవంగా). |
| **చంగప్ప** | : | (కుర్చీలో కూర్చుని చుట్ట నోట్లో ఉంచుకుని అగ్గిపెట్టె జేబులోంచి తీస్తాడు). |
| **తిప్పయ్య** | : | లింగం మంచి కాఫీ తెప్పించు చంగప్ప గారికి! |
| **కనకలింగం** | : | (ఎడంవైపు వెళ్తాడు). |
| **తిప్పయ్య** | : | చెంగప్పగారూ! మీ గేదె ఎక్కడున్నా సాయంకాలంలోగా వెతికిపెడ్తాము. |
| **చంగప్ప** | : | (నోట్లోంచి చుట్ట తీసి అంటాడు) ఆ! |
| **తిప్పయ్య** | : | మేము నిన్ను డబ్బులడిగిన సంగతి మాత్రం అయ్యగారితో చెప్పొద్దు... చచ్చి మీ కడుపున పుడ్తాను. |
| **చంగప్ప** | : | (కంగారుగా కుర్చీలోంచి లేచి నిలబడి అంటాడు) ఒద్దొద్దు... నీలాంటోల్లను కంటే నాకు నరకమే గతి. |
| | | (ఎడంవైపు నుండి రాజారావు ప్రవేశిస్తాడు). |
| **రాజారావు** | : | ఏయ్, ఎవరయ్యా నీవు? స్టేషనులో చుట్ట తీస్తున్నావు. చుట్టా, పెట్టీ జేబులో పెట్టు. (అంటూ చంగప్పను దబాయిస్తాడు). |
| **తిప్పయ్య** | : | ఇదిగో రాజారావ్! |

**రాజారావు** : (తిప్పయ్యవైపు తిరిగి అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ కొడ్తాడు) గుడ్‌మార్నింగ్ సార్.

**తిప్పయ్య** : రాజారావ్, ఇదిగో ఈ పెద్దాయన వెంట నీవూ, ఎయిట్‌నాట్ టూ ఇద్దరూ కలిసి వెళ్ళాలి. వీరి గేదె పోయిందట... పూర్తి వివరాలు సేకరించి సాయంకాలంలోగా ఆరా తీయాలి!

**రాజారావు** : నా డ్యూటీ అయిపోయింది కద సార్! నేను ఇంటికి వెళ్ళాలి (కాస్త విసుగ్గా అంటాడు).

**తిప్పయ్య** : నో...నో... ఇది స్పెషల్ కేసు. మేజిస్ట్రేట్ గారు స్వయంగా పంపిన మనిషి. నీవు వెళ్తే తప్ప పని జరగదు. నీవీరోజు ఎక్స్ట్రా డ్యూటీ చెయ్యాలి. ఇంకోరోజు నీకు స్పెషల్ ఆఫ్ ఇప్పిస్తాను.

**రాజారావు** : (అయిష్టంగా తల వూపుతాడు).

**లింగం** : కాఫీ కప్పుతో ప్రవేశిస్తాడు.

**(తెరవాలుతుంది)**

## నాలుగవ అంకం

(తెర తీయబడగానే కన్పిచే దృశ్యం: గోడ గడియారం ఎనిమిది గంటలు చూపుతుంటుంది. తిప్పయ్య తన కుర్చీలో కూర్చుని బల్లమీద తలవాల్చి నిద్రపోతూనే ఉంటాడు. ప్రొద్దెకుతున్నదనడానికి నిదర్శనంగా వెలుగు బాగా ఎక్కువగా వుంటుంది).

(గడియారం ఎనిమిది గంటలు కొడ్తున్న శబ్దం వినవస్తూండగా ఎడంవైపు నుండి యన్.సి.సి. డ్రెస్‌లో ఉన్న సురేష్ ప్రవేశించి స్టేజి మధ్యకు వచ్చి నిలబడి చుట్టూ చూస్తాడు. తరువాత గాంధీ ఫోటోకేసి చూస్తాడు).

**సురేష్** : గాంధీ తాతయ్యా, ఈ స్వాతంత్ర్యం కోసమేనా మీరందరూ అన్ని త్యాగాలు చేసింది? (అంటూ నిద్రపోతున్న తిప్పయ్యవైపు చేయి చూపుతాడు. కుడివైపు నుండి కళ్ళు నులుముకుంటూ కనకలింగం ప్రవేశిస్తాడు).

**లింగం** : ఎవరయ్యా నీవు?

**సురేష్** : (అటెన్షన్‌లో నిలబడి కనకలింగానికి సెల్యూట్ చేస్తాడు).

నేను కాలేజి స్టూడెంట్‌ని సార్.

**లింగం** : తెలుస్తూనే ఉందిలే... ఏంపని మీ వచ్చావు?

**సురేష్** : నా సైకిలు పోయింది సార్!

(తిప్పయ్య మేలుకుని లేచి కూర్చుంటాడు).

**లింగం** : ఎక్కడ పోయింది? ఎప్పుడు?

**సురేష్** : ఉదయం ఐదు గంటలకు కాలేజీ గ్రౌండుకు వెళ్తూ సైకిలు స్టాండులో పెట్టాను సార్ తాళం వేసి మరీ. యన్.సి.సి. పెరేడ్ అయిపోగానే వచ్చి చూస్తే సైకిలు లేదు.

**తిప్పయ్య** : సైకిలు కొత్తదా? పాతదా?

**సురేష్** : సరికొత్త సైకిలు సార్... హెర్క్యులెస్ కంపెనీది. గ్రీన్ కలర్. ఫ్రేం నంబరు ఎఫ్ టూ బార్ సెవన్ టూ వన్ టూ త్రీ. చైన్ కవరుమీద కె. సురేష్ అని నా పేరు కూడా వ్రాయబడి ఉంది.

**తిప్పయ్య** : నీ సైకిలు దొరకదయ్యా!

**సురేష్** : ఏం? ఎందుకు దొరకదు??

**తిప్పయ్య** : ఈ ఏడాది ప్రారంభం నుండీ పోయిన సైకిళ్ళలో నీది నూట ఇరవై ఒకటవ సైకిలు. ఇంతవరకూ ఒక్కటయినా దొరికి చావలేదు.

**సురేష్** : ఎలా మరి?

**తిప్పయ్య** : ఒక పని చెయ్యి.

**సురేష్** : ఏం చెయ్యను సార్?

**తిప్పయ్య** : రెండొందల రూపాయలు తెచ్చుకో. మా దగ్గర అనామతు బాపతుగా పడివున్న సైకిళ్ళ లోంచి ఏదో ఒకటి తీసుకెళ్దు గానీ.

**కనకలింగం** : నాలుగు వందలు ఇచ్చుకుంటే... మొన్న స్మగ్లింగ్‌కు ఉపయోగపడ్తూ దొరికిపోయిన కొత్త సైకిలే ఇచ్చేస్తాము... రికవరీ కింద!

**సురేష్** : (సీరియస్‌గా చూస్తూ జేబులోంచి ఓ కాగితం తీసి మడతలు విప్పుతాడు). ఇది నా సైకిలు వివరాలతో ఇవ్వబడుతున్న కంప్లయింటు. వీలయినంత త్వరగా నా సైకిలు వెతికి పట్టుకోండి.

**తిప్పయ్య** : దొరకని దానిని ఎలా పట్టుకోవాలయ్యా?

**సురేష్** : మీ డి.యస్.పి. గారు మా నాన్నగారి మిత్రులు. వారితో చెప్పిస్తాను. నా సైకిల్ను, నా సైకిలు దొంగను ఎలా వెతికి పట్టుకోవాలో! (అంటూ కంప్లయింటు పేపరు బల్లమీదకు విసరి విసవిసా వెళ్ళిపోతాడు).

**తిప్పయ్య** : లింగం

**లింగం** : సార్!

**తిప్పయ్య** : ఉదయాన్నే ఎవరి ముఖం చూశామయ్యా... అన్నీ చావు గిరాకీలే తగుల్తున్నాయి.

**లింగం** : ఉదయాన్నే మీ ముఖం నేనూ, నా ముఖం మీరు చూసుకున్నాము సార్!

**తెరవాలుతుంది**

## ఐదవ అంకం

(తెర తీయబడగానే కన్పించే దృశ్యం: గోడ గడియారం పంన్నెండు గంటలు చూపుతుంటుంది. మధ్యాహ్నం కాబోతున్నందుకు నిదర్శనంగా వెలుగు చాలా ఎక్కువగా ఉంటుంది. తిప్పయ్య కుర్చీ ఖాళీగా ఉంటుంది. పావు నిముషం తరువాత గడియారం పన్నెండు గంటలు కొడ్తుంది. ఆ వెంటనే దూరం నుండి వినవస్తున్నట్లుగా ఆటోరిక్షా శబ్దమూ, కారు హారనూ విన్పిస్తాయి. మరో పావు నిముషం గడిచాక ఎడంవైపు నుండి మఫ్టీలో తిప్పయ్య ప్రవేశిస్తాడు అతనికి లింగం కన్పిస్తాడు)

**తిప్పయ్య** : హాయిగా ఇంట్లో నిద్రపోకుండా ఏమిటిలా వచ్చావు?

**లింగం** : రాత్రి దొంగతనం జరిగినందుకూ, దొరికిన దొంగను నేనే వదిలేసినందుకూ మా ఆవిడ చాలా కోపంగా ఉంది సార్! అందుకే ఇంట్లోంచి పారిపోయి వచ్చేశాను (అంటూ తల తడుముకుంటాడు).

**తిప్పయ్య** : మంచిపనే చేశావు... వెళ్దాం పద... ఎక్కడైనా నాలుగు డబ్బులు సంపాదించుకుందాం!

**లింగం** : (ఉత్సాహంగా) పదండి సార్!

(ఇద్దరూ కలిసి ఎడంవైపు వెళ్ళబోతుండగా కుడివైపు నుండి కాకీ ప్యాంటుమీద హాఫ్ స్లాగ్ ధరించివున్న స్టేషను రైటరు ప్రవేశిస్తాడు).

**స్టేషను రైటరు** : మీకిద్దరికీ ఓ సాడ్ న్యూస్... సారీ!

**తిప్పయ్య**<br>**లింగం** } (ఒకే పర్యాయం) ఏమిటది?

**స్టేషను రైటరు** : మన స్టేషను నుండి మిమ్మల్నిద్దర్నీ దెయ్యాల దిబ్బకు బదిలీ చేశారట. ఇక్కడ వెంటనే రిలీవ్ అయి ఏడు రోజులలోగా అక్కడ జాయిన్ అవ్వాలంటూ ఆర్డర్సు కూడా డిస్పాచ్ అయిపోయాయట... ఇందాకా హెడ్‌క్వార్టర్స్ నుండి వైర్లెస్ కాంటాక్టు వచ్చినప్పుడు ఆపరేటర్ ద్వారా తెలిసింది మాకు. వెరీ సారీ!!

**తిప్పయ్య** : (ముఖం నల్లబడిపోతుంది). దెయ్యాల దిబ్బకా? రామా! (దిగులుగా అంటాడు).

**లింగం** : రాత్రిళ్లు దయ్యాలూ, పట్టపగలే నక్సలైట్లూ తిరిగే ప్రాంతానికా? ఓరి దేవుడో! (ఏడ్పు గొంతుతో కళ్ళనీళ్ల పర్యంతమైపోతూ అంటాడు).

(ఎడంవైపు నుండి రాజారావు యూనిఫాంలో ప్రవేశించి అటెన్షన్‌లో నిలబడి తిప్పయ్యాకు సెల్యూట్ చేస్తాడు)

**రాజారావు** : సార్, చంగప్ప గేదె ఆచూకీ లాగాము. పెద్దపాళ్యం మాజీ జమీందారువారి బంగాళాలో చొరబడి పూలతోటంతా తినీ, తొక్కీ నాశనం చేసిందని ఆ బంగళావాళ్ళు కట్టి పడేశారు దాన్ని (అంటూ ఉత్సాహంగా చెప్తాడు).

**తిప్పయ్య** : అదలా అగ్గి పడనీవయ్యా. పనిష్‌మెంట్ ఏరియాలో, అడవిదగ్గర చీకటి పడగానే, దెయ్యాలు తిరిగే దెయ్యాలదిబ్బ స్టేషనుకు బదిలీ చేశారయ్యా నన్నూ, లింగాన్నీ.

**లింగం** : చీకటి పడకముందే 'ఎలుగ్గొడ్లూ, నక్కలూ, హైనాలూ తిరిగే ఊరికి....'

**స్టేషను రైటరు** : మీరింత విషాదంలో ఉండగా... రాజారావుకో శుభవార్త ఉందని చెప్పడానికి సంశయిస్తున్నాను.

**తిప్పయ్య**<br>**లింగం**<br>**రాజారావు** } ఏమిటది? (ముగ్గురూ ఒకే పర్యాయం ప్రశ్నిస్తారు.)

**స్టేషను రైటరు** : కంగ్రాచ్యులేషన్స్ రాజారావ్! నీకు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ వచ్చింది.

**రాజారావు** : నిజమా సార్?(ముఖం వికసించగా ఆనందంగా అడుగుతాడు).

**స్టేషను రైటరు** : నిజమేనయ్యా! ఇందాకా హెడ్‌క్వార్టర్సులో వైర్లెస్ కాంటాక్టు వచ్చినప్పుడు తెలిసింది. ఆర్డర్సు కూడా డిస్పాచ్ అయిపోయాయట.

**రాజరావు** : ఏ వూరికి వేశారు సార్? (సంతోషంగా ప్రశ్నిస్తాడు.)

**స్టేషను రైటరు** : ఎక్కడో కాదు... ఇక్కడకే... మన తిప్పయ్య ప్లేస్‌లోకే పోస్ట్ చేశారట నిన్ను!

**రాజారావు** : థాంగ్ గాడ్!

**తిప్పయ్య** : నేనా ఊరు వెళ్ళి, ఆ స్టేషనులో జాయిన్ అవ్వను. మెడికల్ లీవు పెట్టేసి ఎంతకాలమైనా సరే వేరేవూరికి మార్చేవరకూ లాంగ్ లీవ్‌లోనే గడిపేస్తాను. (దీనంగా అంటాడు).

**లింగం** : నేను అంతే! (కళ్ళ నీళ్ళతో, ఏడ్పు గొంతుతో అంటాడు).

(దూరం నుండి వినవస్తున్నట్లుగా...

"అన్యాయార్జిత విత్తం<br>దశ వర్షాని జీవితం<br>అధవా ద్వాదశ వర్షాని<br>సహమూలం వినశ్యతే!"

అన్న శ్లోకం శ్రావ్యమైన కంఠస్వరంతో వినవస్తుండగా తెర వాలుతుంది.)

**శుభం**